www.manatelangana.news
Mana Telangana

మన తెలంగాణ

హైదరాబాద్ | సంపుటి 6 | సంచిక: 46 | శనివారం | 5 ఆగస్టు, 2017


...అక్షరం సాక్షిగా ఇది ప్రజల పక్షం

Published from: Hyderabad, Karimnagar, Warangal, Khammam, Nalgonda, Mahabubnagar, Nizamabad

పేజీలు: 12 + టాబ్లాయిడ్ | వెల రూ. 5.00




ఉపరాష్ట్రపతి ఎన్నిక నేడే



- ఉదయం 10 నుంచి 5 వరకు పోలింగ్
- సాయంత్రం 7కల్లా ఫలితాలు
- ఎన్‌డిఎ తరపున వెంకయ్యనాయుడు, ప్రతిపక్షాల అభ్యర్థిగా గోపాలకృష్ణగాంధీ, విపక్షాల వైపు బిజెడి, జెడి(యు)

న్యూఢిల్లీ : ఉప రాష్ట్రపతి ఎన్నికలు మరికొద్ది గంటల్లో ప్రారంభంకానున్నాయి. ఇక్కడ పార్ల మెంటు హాలులో ఉదయం 10 గంటల నుండి సాయంత్రం 5వరకు జరగనున్న పోలింగ్‌లో ఎన్నికైన, నియమితులైన ఉభయ సభల ఎంపిలు ప్రత్యేకమైన కలం ద్వారా తమ ఓటు హక్కును వినియోగించుకోనున్నారు. భారతదేశ తదుపరి ఉప రాష్ట్రపతి ఎవరనేది రాత్రి 7 కల్లా తెలిసిపోతుంది. ఈ ఎన్నికలు రహస్య బ్యాలెట్ ద్వారా జరుగుతున్నందు వల్ల రాజకీయ పార్టీలు విప్‌ను జారీ చేయడానికి వీల్లేదు. ఈ ఎన్నికల్లో అధికార ఎన్‌డిఎ అభ్యర్థిగా బిజెపి సీనియర్ నేత ఎం.వెంకయ్యనాయుడు, విపక్షాల ఉమ్మడి అభ్యర్థిగా **తరువాయి 6లో**








రైతే నిర్ణేత



- మద్దతు ధరల నిర్ణయం వారిదే
- రైతు సమాఖ్యల ఏర్పాటుతో నవయుగం
- ప్రపంచంలోనే తొలి సారిగా తెలంగాణలో ఏర్పాటు: కేశవరం, లక్ష్మాపూర్ సభల్లో సిఎం కెసిఆర్

మనతెలంగాణ/మేడ్చల్ జిల్లా/శామీర్ పేట: రైతు పండించిన పంటలకు రైతులే ధర నిర్ణయించేందుకు రైతు సమాఖ్య ఏర్పాటు చేయనున్నట్లు రాష్ట్ర ముఖ్య మంత్రి కె.చంద్రశేఖర్‌రావు తెలిపారు. శుక్రవారం మేడ్చల్ జిల్లా శామీర్‌పేట మండల పరిధిలోని కేశవరం, లక్ష్మాపూర్ గ్రామాలలో నిర్వహించిన గ్రామ సభలో ఆయన పాల్గొని ప్రసం గించారు. రైతులను సంఘటితం చేస్తూ రైతు నిర్ణయించే మద్దతు ధర కోసం ప్రపంచంలోనే మొదటిసారిగా తెలంగాణ రాష్ట్రంలో రైతు సమాఖ్యలను **తరువాయి 6లో**



రాహుల్ కారుపై దాడి

గుజరాత్ టూర్‌లో రాళ్ళు విసిరిన బిజెపి మద్దతుదారు

కారు అద్దాలు ధ్వంసం, నిలిచిపోయిన సభ



ధనేరా: గుజరాత్‌లో కాంగ్రెస్ ఉపాధ్యక్షులు రాహుల్ గాంధీ కారుపై బిజెపి మద్దతుదార్లు రాళ్లతో దాడి జరిపారు. వరద ప్రాంతాలలో పర్యటనకు వచ్చిన సందర్భంగా శుక్రవారం ఈ ఘటన జరిగింది. దాడిలో ఆయనకు దెబ్బలేమీ తగులలేదని, సురక్షితంగా బయటపడ్డారని బనస్‌కాంత సూపరిండెంట్ **తరువాయి 6లో**

ఈ ఏడాదిలోనే రామగుండం

ఎరువుల ఫ్యాక్టరీ పునరుద్ధరణ

- రాజ్యసభలో వెల్లడించిన మంత్రి అనంతకుమార్ 10

టెట్ ఫలితాలు

మనతెలంగాణ/హైదరాబాద్: రాష్ట్ర ఉపాధ్యాయ అర్హత పరీక్ష(టిఎస్ టెట్) ఫలితాలు విడుదలయ్యాయి. పాఠశాల విద్యాశాఖ కార్యాలయంలో శుక్రవారం కమిషనర్ జి.కిషన్ టెట్ విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, పేపర్1కు 98,848 మంది అభ్యర్థులు పరీక్షకు హాజరుకాగా, అందులో 56,708(57.37 శాతం) మంది ఉత్తీర్ణత నమోదైనట్లు వెల్లడించారు. అలాగే **తరువాయి 6లో**


మరణ నమోదుకు ఆధార్

- అక్టోబర్ 1 నుండి అమలు 10

దుబాయ్‌లో 11

భారీ అగ్నిప్రమాదం

- ఆకాశహర్మ్యంలో మంటలు





పరీక్షలు వాయిదా


అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్స్, వెటర్నరీ అసిస్టెంట్ సర్జన్స్, బాయిలర్స్ ఇన్‌స్పెక్టర్ పరీక్షలు 27, 28తేదీలకు వాయిదా : టిఎస్‌పిఎస్‌సి 3

కుంచెపోటు





ఈ పార్లమెంట్ సమావేశాల్లోనే బిసి కమిషన్ బిల్లు : కృష్ణయ్య



మన తెలంగాణ/ హైదరాబాద్ / ముషీరాబాద్ : ప్రస్తుతం జరుగుతున్న పార్లమెంట్ సమావేశాల్లోనే జాతీయ బిసి కమిషన్‌కు రాజ్యాంగబద్ధమైన హోదా కల్పించే బిల్లుకు రెండు సభలు ఆమోదం తెలుపుతూ పాస్ చేయాలని, అందుకు ప్రధాన మంత్రి నరేంద్రమోడి చొరవ తీసుకోవాలని జాతీయ బిసి సంక్షేమ సంఘం అధ్యక్షులు ఆర్.కృష్ణయ్య డిమాండ్ చేశారు. శుక్రవారం ప్రధానితో పాటు పార్లమెంట్‌లో ఉన్న 36 రాజకీయ పార్టీల ఫ్లోర్ లీడర్లకు ఆర్.కృష్ణయ్య శుక్రవారం లేఖలు రాసారు.

నేడు పార్లమెంట్ వద్ద భారీ ప్రదర్శన : బిసిలకు చట్ట సభల్లో 50 శాతం రిజర్వేషన్లు కల్పించాలని, బిసి ఉద్యోగులకు ప్రమోషన్లలో రిజర్వేషన్లు కల్పించాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 5వ తేదీన (నేడు) ఢిల్లీ పార్లమెంట్ వద్ద భారీ ప్రదర్శన నిర్వహిస్తున్నామన్నారు. అనంతరం శుక్రవారం సాయంత్రం ఢిల్లీకి ప్రత్యేక రైళ్లల్లో తరలివెళ్లారు.

ఊరించుడే తప్ప ఇచ్చేదెప్పుడు?

ప్లీనరీ జరిగి మూడు నెలలు దాటినా పార్టీ కమిటీలేవి?



మన తెలంగాణ/ హైదరాబాద్ : పార్టీ పదవులు, నామినేటెడ్ పదవుల కోసం ఏళ్ళ తరబడి ఎదురు చూస్తూ టిఆర్ఎస్ నాయకులు, క్యాడర్ నిరుత్సాహానికి లోనవుతున్నారు. తెలంగాణ ఏర్పడక ముందు చివరి సారిగా పూర్తి స్థాయి రాష్ట్ర కమిటీ వేశారు. ఆ తరువాత మూడు ప్లీనరీలు జరిగినా కమిటీల ఊసే లేదు. చివరి సారిగా గత ఏప్రిల్ 21న హైదరాబాద్‌లో జరిగిన ప్లీనరి సందర్భంగా నిబంధనావళిలో మార్పులు చేసి, కమిటీల కాలపరిమితి రెండు నుండి నాలుగేళ్ళకు పెంచారు. అదే ప్లీనరీలో త్వరలోనే టిఆర్ఎస్ అధినేత కెసిఆర్ ఇప్పటివరకు ప్రభుత్వ పనిలో బిజిగా ఉన్నానని, ఇక పార్టీ క్యాడర్ వైపు దృష్టి సారిస్తానని, వారిని అదుకునే విషయంపై మంత్రులతో మాట్లాడతానని ప్రకటించారు. వెంటనే పార్టీ కమిటీలు, నామినేటెడ్ పదవులను ప్రకటిస్తామని ప్రకటించారు. అయితే ప్లీనరీ తరువాత నాలుగు నెలలవుతున్నా, ఇదిగో, అదిగో అంటూ కమిటీలపై కాలయాపన చేస్తున్నారు. మార్కెట్, దేవాలయ కమిటీలు దాదాపు పూర్తయ్యాయి. అయితే అడ పాదడపా కార్పొరేషన్ చైర్మన్, ఇతర నామినేటెడ్ పోస్టులకు నియామకాలు చేసినా, ఇంకా చేయాల్సినవి చాలా ఉన్నాయి. అటు పార్టీ, ఇటు నామినేటెడ్ పదవులు కలిపి, మొత్తం నాలుగైదు వేలు ఉంటాయని కెసిఆర్ గతంలో పదే పదే ఊరించారు. కాని వాటి భర్తీ మాత్రం ఆస్థాయిలో లేదు. కార్పొరేషన్‌లకు చైర్మన్‌లు నియమించినా, ఇంకా డైరెక్టర్‌లను వేయలేదు. మధ్యలో ఒక సారి ఒకే రోజు నామినేటెడ్ పదవులన్నీ ప్రకటిస్తామని, వెంటనే జాబితాలు ఇవ్వాల్సిందిగా ఎంఎల్‌ఏలు, మంత్రులకు ఆదేశాలు వెళ్ళాయి. ఆ మేరకు జాబితాలు సిద్ధం చేసినా, కార్యరూపం మాత్రం దాల్చలేదు. జాబితాల్లో కొందరికి పదవులు వచ్చినా చాలా మంది ఆశావాహులకు ఆ భాగ్యం దగ్గలేదు. ఇక పార్టీ కమిటీల ఏర్పాటు అనేక మలుపులు తిరిగింది. తొలుత ప్లీనరీకి ముందే గత ఏడాదిలో అన్ని జిల్లాలకు కమిటీలు వేసేందుకు జాబితాలు సిద్ధమయ్యాయి. ఒకటి రెండు రోజుల్లో కమిటీల ప్రకటనే తరువాయి అనుకున్న తరుణంలో డిమానిటైజేషన్ వచ్చి పడడంతో పార్టీ పదవుల ప్రకటన అటకెక్కింది. ఆ తరువాత అకస్మాత్తుగా అధినేత మదిలో కొత్త ఆలోచన వచ్చి జిల్లా కమిటీల స్థానంలో నియోజకవర్గ కమిటీలు వేయాలని, వాటికి ఎంఎల్‌ఏలనే అధ్యక్షులుగా నియమించాలని, జిల్లాలకు సమన్వయకర్తలను వేయాలని నిర్ణయించారు. ఈ మేరకు ప్లీనరీలో పార్టీ నిబంధనావళిని సవరించారు. సాధారణంగా పార్టీ కమిటీలు వేశాక, అనుబంధ సంఘాల కమిటీలు ప్రకటిస్తుండడం ఆనవాయితీ. కాని ప్లీనరీ తరువాత ఇటీవల అనుబంధ సంఘాలకు అధ్యక్షులను ప్రకటించారు. ఒక్క విద్యార్థి విభాగానికి మాత్రమే పూర్తి స్థాయి కమిటీలు వేశారు. మిగతావాటికి వేయాల్సి ఉంది. పార్టీ కమిటీలను మాత్రం ఇంకా ప్రకటించలేదు. వరంగల్ బహిరంగ సభ కాగానే ప్రకటిస్తారన్న కమిటీలు, ఆ తరువాత ఆషాడం ముగియగానే ప్రకటిస్తారన్నారు. శ్రావణం మాసం సగం పూర్తయినా ఇంకా రేపు మాపు అంటూ సాగదీస్తున్నారు. దీంతో పదవుల కోసం టిఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు తమ వంతు కోసం ఎదురు చూస్తున్నారు. ఇప్పటికే పార్టీ అధికారంలోకి వచ్చి మూడేళ్ళు దాటిందని, ఎన్నికలకు రెండేళ్ళే గడువుందని, ఇంకా పదవులు ఎప్పుడిస్తారని వారు లోలోపల మథన పడుతున్నారు.

శంషాబాద్ ఎయిర్‌పోర్ట్‌లో ఆధునిక తనిఖీ వ్యవస్థ



మన తెలంగాణ/శంషాబాద్: దేశీయ ప్రయాణికుల సౌకర్యార్థం దేశంలోనే మొట్టమొదటిసారిగా ఆధునిక భద్రతా తనిఖీ వ్యవస్థను శుక్రవారం ఉదయం రాజీవ్‌గాంధీ అంతర్జాతీయ విమానాశ్రయంలో సీఐఎస్‌ఎఫ్ డీజి ఓపి సింగ్, జీఎంఆర్ సీఇఓ ఎస్‌జీకే కిషోర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా జీఎంఆర్ సీఇఓ కిషోర్ మాట్లాడుతూ ఇక్కడి నుండి సంవత్సరానికి ఎనిమిది మిలియన్ల ప్రయాణికులు ప్రయాణిస్తున్నారు. వీరి సౌర్యార్థం దేశంలోనే మొట్టమొదటిసారిగా బ్యాగ్ ఏజ్ చెకింగ్ కోసం శంషాబాద్ ఎయిర్‌పోర్టులో ఆధునిక తనిఖీ వ్యవస్థను ప్రారంభించినట్లు తెలపడానికి సంతోషిస్తున్నామన్నారు. ఈ వ్యవస్థతో రద్దీ సమయాలలో 40శాతం ప్రయాణికులకు సమయంతోపాటు ఆందోళనను తగ్గిస్తుందన్నారు. ఈ రోజు పది సెల్ఫ్ చెకింగ్ యంత్రాలతోపాటు సైనింగ్ యంత్రాలను ఎయిర్‌పోర్టులో ప్రయాణికుల సౌకర్యార్థం ఏర్పాటు చేశామన్నారు. సీఐఎస్‌ఎఫ్ డీజీ ఓపి సింగ్ మాట్లాడుతూ అత్యాధునిక భద్రతా ప్రమాణాలతోపాటు ప్రయాణికులకు ఎలాంటి ఇబ్బందిలేకుండా స్నేహపూర్వకంగా తనిఖీలు నిర్వహిస్తున్నామన్నారు.

కాంగ్రెస్ వాళ్లంతా లక్ష గుంజీళ్ళు తీయాలె : కర్నె

మన తెలంగాణ/ హైదరాబాద్ : ప్రభుత్వ నిర్ణయాలకు వ్యతిరేకంగా కాంగ్రెస్ నాయకులు కోర్టుల్లో కేసులు వేస్తున్నందుకు జానారెడ్డి సహా, ఆ పార్టీ నాయకులంతా ముక్కు నేలకు రాసి, లక్ష గుంజీళ్ళు తీయాలని టిఆర్ఎస్ ఎంఎల్‌సి కర్నె ప్రభాకర్ అన్నారు. టిఆర్ఎస్ఎల్‌పి కార్యాలయంలో శాసనమండలి విప్ బోడకుంటి వెంకటేశ్వర్లుతో కలిసి శుక్రవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ నాయకులు స్వార్థ రాజకీయాల కోసం కోర్టులను కూడా పక్కదారి పట్టిస్తున్నారని, ఒక్క కాళేశ్వరం ప్రాజెక్టుపైనే 119 కేసులు, ఇతర ప్రాజెక్టులపై 164 కేసులు వేశారని చెప్పారు. ప్రతిపక్ష నేత జానారెడ్డి అజ్ఞానంతో మాట్లాడుతూ మమ్మల్ని అహంకారమంటారా? అని ప్రశ్నించారు . సిఎంకు అవగాహన లేదనడం కాంగ్రెస్ నాయకుల అహంకారానికి నిదర్శనమని చెప్పారు. మొండిగా ప్రాజెక్టులను అడ్డుకోవడమే మీకున్న అవగాహనా? అని అన్నారు.

పేదలు ఆత్మగౌరవంతో బతకడానికే



మన తెలంగాణ/సిద్దిపేట ప్రతినిధి: పేదలు ఆత్మగౌరవంతో బతకాలనే సదుద్దేశంతోనే సిఎం కెసిఆర్ డబుల్ బెడ్‌రూమ్ ఇండ్ల నిర్మాణ పథకాన్ని చేపట్టారని రాష్ట్ర గృహ నిర్మాణ, దేవాదాయ శాఖ మంత్రి ఐ.ఇంద్రకరణ్‌రెడ్డి అన్నారు. శుక్రవారం సిద్దిపేట అర్బన్ మండల పరిధిలోని మందపల్లి గ్రామంలోగల పిట్టలవాడలో 20 డబుల్ బెడ్‌రూమ్ ఇండ్లను ప్రారంభించి మాట్లాడారు. దేశంలోనే ఎక్కడా లేని విధంగా 565 చదరపు అడుగుల పరిధిలో డబుల్ బెడ్‌రూమ్ ఇండ్లను నిర్మిస్తున్నట్టు తెలిపారు. రాష్ట్రంలో 2.70 లక్షల డబుల్ బెడ్ రూమ్ ఇండ్లను నిర్మిస్తున్నామని, హైదరాబాద్ నగరంలో లక్ష డబుల్ బెడ్ రూమ్ ఇండ్లకు గాను 70వేల ఇండ్లకు సంబంధించి టెండర్ల ప్రక్రియ పూర్తయింద న్నారు. డబుల్ బెడ్ రూమ్ ఇండ్లపై అవాకులు, చెవాకులు మాట్లాడుతున్న ప్రతిపక్షాలు పిట్టలవాడను చూడాలని ఎద్దేవా చేశారు. ప్రతి నెలలో డబుల్ బెడ్‌రూమ్ ఇండ్లు ప్రారంభమయ్యేలా చూస్తున్నామని, చిన్న గ్రామాల్లో 25, పెద్ద గ్రామాల్లో 50 డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు నిర్మిస్తున్నట్టు తెలిపారు. మంత్రి హరీశ్‌రావు మాట్లాడుతూ డబుల్ బెడ్‌రూమ్ ఇండ్లను నిర్మించి ఇచ్చామని వాటిని కాపాడుకోవాల్సిన బాధ్యత లబ్ధిదారులదేనన్నారు. వీటిని అమ్ముకున్నా, కొన్నా, అద్దెకు ఇచ్చినా జైలుకు వెళతారని హెచ్చరించారు. డబుల్ బెడ్‌రూమ్ ఇండ్లతో పాటు కనీస వసతి సౌకర్యాలను కల్పించామన్నారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ సలహాదారు జి.వివేక్, ఎమ్మెల్సీలు ఫారూక్‌హుస్సేన్, భూపాల్‌రెడ్డి, సుధాకరరెడ్డి, ఎంపి కె.ప్రభాక రరెడ్డి, కలెక్టర్ వెంకటరామిరెడ్డి మాట్లాడారు.

జాతీయ చేనేత దినోత్సవాన్ని జయప్రదం చేయండి



మన తెలంగాణ /హైదరాబాద్ : తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఈ నెల 7ను జాతీయ హ్యాండ్లూమ్స్ దినోత్సవంగా జరుపుకుంటోందని, చేనేత వస్త్ర ధారణపై ప్రజల్లో అవగాహన కల్పించేందుకు చేపడుతున్న ఈ మహత్తర కార్యక్రమానికి ప్రతి ఒక్కరూ చేయూత నివ్వాలని హ్యాండ్లూమ్ అండ్ టెక్స్‌టైల్స్ డైరెక్టర్ శైలజా రామయ్యర్ విజ్ఞప్తి చేశారు. బూర్గుల రామకృష్ణారావు భవన్లో శుక్రవారం ఆమె మీడియాతో మాట్లాడారు. చేనేత దినోత్సవాన్ని పురస్కరించుకుని ఏడో తేదీన హైదరాబాద్ సచివాలయం సమీపంలోని ఎన్‌టిఆర్ గార్డెన్ నుండి నెక్లెస్‌రోడ్ పీపుల్స్ ప్లాజా వరకు హ్యాండ్లూమ్ వాక్‌ను నిర్వహిస్తున్నామన్నారు. ''చేనేత సంబురాలు'' పేరిట 7వ తేదీ నుండి 15వ తేదీ వరకు పీపుల్స్ ప్లాజాలో ఏర్పాటు చేస్తున్న చేనేత వస్త్ర ఎగ్జిబిషన్‌ను చేనేత, టెక్స్‌టైల్స్ శాఖ మంత్రి కెటిఆర్ ప్రారంభిస్తారన్నారు. చేనేతను ప్రోత్సహించేందుకు చేపట్టాల్సిన అంశాలపై చర్చాగోష్టులు నిర్వహిస్తామన్నారు.ఇందుకోసం చేనేత కార్మికులు, సొసైటీల ప్రతినిధులు, మాస్టర్ వీవర్స్, హ్యాండ్లూమ్ క్లస్టర్స్, ఎన్‌జివోలతో ప్రత్యేక చర్చలు, నిర్వహించనున్నామన్నారు.

బయ్యర్స్ అండ్ సెల్లర్స్ మీట్ .. : చేనేత బ్రాండ్‌ను జాతీయ స్థాయిలో ప్రమోట్ చేసేందుకు ఈ నెల 10,11న రెండు రోజుల పాటు బయ్యర్స్ అండ్ సెల్లర్స్ మీటింగ్‌ను కూడా పీపుల్స్ ప్లాజాలో ఏర్పాటు చేస్తున్నామన్నారు. నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఫ్యాషన్ డిజైన్ (నిఫ్ట్), అపోలో హాస్పిటల్స్ లాంటి సంస్థలు చేనేత వస్త్రధారణ బ్రాండ్ ప్రమోషన్‌లో భాగస్వామ్యం పంచుకుంటామని ప్రభుత్వానికి తెలిపాయన్నారు. పీపుల్స్ ప్లాజాలోనే కాకుండా మాధాపూర్ హైటెక్స్‌లోని నోవాటెల్ హోటల్‌లోనూ చేనేత వస్త్ర ధారణ ''బ్రాండ్ ఫ్యాషన్ షో ''కార్యక్రమాన్ని చేనేత బ్రాండ్ అంబాసిడర్ సినీనటి సమంత చేత వేరుగా నిర్వహిస్తున్నామన్నారు. తెలంగాణ ఆవిర్భావం తర్వాత చేనేతకు మంత్రి కెటిఆర్ ఆధ్వర్యంలో ప్రత్యేక ప్రోత్సాహక కార్యక్రమాలను నిర్వహిస్తున్నామన్నారు. చేనేత వస్త్ర ప్రదర్శన, విక్రయాలను హైదరాబాద్‌లోనే కాకుండా అన్ని జిల్లా కేంద్రాల్లో చేనేత లక్ష్మి పేరిట ఏర్పాటు చేసి ఆయా జిల్లాల్లోని నేత కార్మికులు, నిపుణులను మెమోంటోలు, శాలువాలు కప్పి సన్మానిస్తామన్నారు. నారాయణపేట, గద్వాల, సిరిసిల్ల వస్త్రాలకు ఉన్న ప్రాధాన్యతను ప్రపంచ వ్యాప్తంగా ప్రజలు గుర్తించేందుకు ప్రత్యేక కార్యక్రమాలను రూపొందించాలని మంత్రి కెటిఆర్ సూచించారని శైలజా రమయ్యర్ వెల్లడించారు. రాష్ట్ర ప్రభుత్వం బడ్జెట్‌లో 1200 కోట్లు హ్యాండ్లూమ్స్, అండ్ టెక్స్‌టైల్స్‌కు కేటాయించిందని, ఇందులో రూ.400 కోట్లు చేనేతకు కేటాయించిందని ఆమె గుర్తు చేశారు. రైతులకు రుణాలిచ్చి వ్యవసాయాన్ని ప్రోత్సహిస్తున్నట్లే చేనేత వస్త్ర ఉత్పత్తిని ప్రోత్సహించేందుకు థ్రిఫ్ట్ పథకం కింద నేత కార్మికులకు రుణాలు ఇవ్వనున్నామన్నారు. జాతీయ చేనేత దినోత్సవాన్ని జిల్లాల్లోనూ పెద్ద ఎత్తున నిర్వహించాలని, అవసరమైన నిధులను వినియోగించుకోవాలని ఆమె జిల్లా కలెక్టర్లు, చేనేత సొసైటీలకు విజ్ఞప్తి చేశారు. రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులు వారానికోసారి ధరిస్తున్న చేనేత వస్త్రాలను స్ఫూర్తిగా తీసుకుని సాధారణ పౌరులు సైతం చేనేతను ప్రోత్సహిద్దాం అని ప్రతిజ్ఞ చేయాలని ఆమె పిలుపు నిచ్చారు.

వ్యవసాయ వర్సిటీని మొదటి స్థానంలో నిలుపుదాం



మన తెలంగాణ /హైదరాబాద్/రాజేంద్రనగర్ : దేశంలోనే ప్రొ. జయశంకర్ తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ యూనివర్సిటీని అందరి సహకారంతో మొదటి స్థానంలో నిలపాలన్నదే లక్ష్యమని వర్సిటీ ఉపకులపతి డాక్టర్ ప్రవీణ్‌రావు అన్నారు. శుక్రవారం ఆయన ఉప కులపతిగా పదవీ బాధ్యతలు స్వీకరించి ఏడాది కాలం పూరైన సందర్భంగా వర్సిటీ నాన్ టీచింగ్ స్టాఫ్ డా.ప్రవీన్‌రావు చేత కేక్ కట్ చేయించి ఘనంగా సన్మానించా రు. ఈసందర్భంగా డా. ప్రవీన్‌రావు మాట్లాడు తూ తెలంగాణ రాష్ట్రంలోని రైతుల ప్రయోజనాలకు అనుగుణంగా శాస్త్రవేత్తలు సాంకేతిక పరిజ్ఞానాన్ని రైతన్నకు చేరు వ చేయడానికి కృషి చే యాలని పిలుపునిచ్చా రు. దేశంలోని వ్యవసాయ యూనివర్సిటీల్లో 8వ స్థానంలో ఉన్న ప్రొ.జయశంకర్ అగ్రికల్చర్ వర్సిటీని నెంబర్ వన్ స్థానంలోకి తీసుకురావడానికి కృషి జరుగుతుందని తెలిపారు. అందుకోసం టీచింగ్, నాన్‌టీచింగ్, శాస్త్రవేత్తలు అందరు తమ వంతు సహకారంతో వర్సిటీ అభివృద్ధి బాటలు వేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో వర్సిటీ ఏర్పడిన ఏడాది అనతి కాలంలోనే మంచి గుర్తింపు వచ్చిందని గుర్తుచేశారు. ఈ కార్యక్రమంలో రిజిస్ట్రార్ డా. సుధీర్‌కుమార్, ఉన్నతాధికారులు ,బోధనేతర సిబ్బంది అసోసియేషన్ ప్రతినిధులు ఎం. శ్రీనివాస్ యాదవ్, అమృత్‌రెడ్డి, నర్సింగ్‌రావు, మహేష్, జయరాం, రాజు, శ్రీనివాస్, జయరాజ్, ప్రవీన్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.



ప్రభుత్వ పథకాలకు కాంగ్రెస్ అడ్డుపడుతోంది

మన తెలంగాణ/సిద్దిపేట టౌన్ : రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన పలు సంక్షేమ పథకాలను అడ్డుకుంటున్నది కాంగ్రెస్ పార్టీయేనని రాష్ట్ర మంత్రి టి.హరీశ్‌రావు ధ్వజమెత్తారు. శుక్రవారం సిద్దిపేటలోని ఆర్అండ్‌బి గెస్ట్‌హౌస్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రతి పక్షాలు వున్నమాటంటే వులికి పడుతున్నాయని దుయ్యబట్టారు. సిఎం బాధను, ఆవేదనను ప్రతిపక్షాలు అర్థం చేసుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. తెలంగాణ కోసం 14 సంవత్సరాలు పోరాడి సాధించి దాన్ని అద్భుతంగా తీర్చిదిద్దడానికి కెసిఆర్ చేస్తున్న పనులు కాంగ్రెస్ పార్టీకి కంటకింపుగా మారిందన్నారు. ప్రజల కోసం ప్రవేశపెడుతున్న సంక్షేమ పథకాలకు అడ్డుపడుతూ కోర్టుల్లో కేసులు వేసి ఆపడం బాధాకరం అన్నారు. 60సంవత్సరాల సమైక్య పాలనలో తెలంగాణకు ఒరిగిందేమీ లేదన్నారు. ప్రతిపక్షంలో వున్న పార్టీ ప్రజల గురించి ఆలోచించకుండా కేవలం రాజకీయాల కోసం ప్రయత్నించడం విడ్డూరంగా వుందన్నారు. కెసిఆర్‌పై అక్కసుతో ప్రతిపక్ష పార్టీలు తమ పాత్రను మరచిపోయారని అన్నారు.

స్వంత ఖర్చులతో ఐదుగురిని ఉమ్రాకు పంపిస్తా : హజ్ యాత్రకు వెళ్లి వారిలో ఐదుగురిని తన స్వంత ఖర్చులతో ఉమ్రాకు పంపిస్తానని మంత్రి హరీశ్‌రావు అన్నారు.

సిఎం దిష్టిబొమ్మ దగ్ధం



మన తెలంగాణ/ హైదరాబాద్: సిఎం కెసిఆర్ దళితులు, మహిళలు, ప్రజాసంఘాలు వామపక్ష పార్టీల నాయకులను అవమానపరిచే విధంగా చేసిన వ్యాఖ్యలను నిరసిస్తూ టి మాస్ ఫోరం ఆధ్వర్యంలో శుక్రవారం సుందరయ్య పార్కు వద్ద ముఖ్యమంత్రి దిష్టిబొమ్మ దగ్ధం చేశారు. దిష్టి బొమ్మ దగ్ధాన్ని అడ్డుకునేందుకు ప్రయత్నించిన పోలీసులకు, టి మాస్ నాయకుల మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది. టి మాస్ నాయకులు ఆర్.శ్రీరాంనాయక్, పి.ఆశయ్య, ఎం.నాగరాజు, డి.గణేష్ నాయక్, జక్కిడి నర్సింహ్మారెడ్డి, జావేద్ తదితరులను పోలీసులు అరెస్ట్ చేసి గాంధీనగర్ పోలీస్ స్టేషన్‌కు తరలించారు. అంతకు ముందు ప్రొఫెసర్ పి.ఎల్.విశ్వేశ్వరరావు, విమలక్కలు ప్రసంగించారు.

ఇక నుంచి కెసిఆర్‌తో ప్రయాణిస్తా వాస్తవాలను చెబుతా : వి.హెచ్

మన తెలంగాణ/ హైదరాబాద్: ఇక నుండి సిఎం కెసిఆర్ ఏ ఊరికి వెళ్తే, తాను ఆ ఊరికి వెళ్ళి వాస్తవాలు చెబుతానని కాంగ్రెస్ నాయకులు వి.హనుమంతరావు అన్నారు. గాంధీభవన్‌లో శుక్రవారం జరిగిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రతిపక్షాలను ఇష్టమొచ్చినట్లు మాట్లాడుతున్న కెసిఆర్‌కు అసలు కల్చర్ ఉందా? అని ప్రశ్నించారు. సిరిసిల్లాలో మరో ఇసుక లారీ ప్రమాదం జరిగిందని, పేదలు చనిపోతే లెక్క లేదా? అని నిలదీశారు. కెసిఆర్ సెక్రెటేరియెట్‌కు అసలే రారని, ప్రజలను కలవడని, కాని చిన జీయర్ స్వామిని మాత్రం రోజూ కలుస్తాడని ఎద్దేవా చేశారు. కేవలం పెళ్ళి పత్రికలు తీసుకోవ డానికి తప్ప ఆయన ఎవ్వరికీ అప్పాయింట్‌మెంట్ ఇవ్వడం లేదని ఆరోపించారు. హైదరాబాద్‌లో పోలీసులు చలాన్‌ల పేరుతో ప్రజల రక్తం పీలుస్తున్నారని చెప్పారు. గుజరాత్‌లో ఒక్క రాజ్యసభ సీటు కోసం బిజెపి ఇడిని వాడుకుంటోందన్నారు. సిరిసిల్లలో దళితులపై దాడిని కాంగ్రెస్ ప్రశ్నిస్తే సిఎం కెసిఆర్ జీర్ణించుకోలేకపోతున్నారని పిసిసి అధికార ప్రతినిధి ప్యాట రమేశ్ అన్నారు. ఇసుక మాఫియాకు ప్రజలు బలైపోతుంటే కెసిఆర్, కెటిఆర్‌లకు కనపడడం లేదా? అని ప్రశ్నించారు.

కొత్త సచివాలయ నిర్మాణాన్ని అడ్డుకుంటాం : మర్రి శశిధర్ రెడ్డి

మన తెలంగాణ/ హైదరాబాద్ : బైసన్ పోలో గ్రౌండ్‌లో కొత్త సచివా లయం నిర్మాణం చేపడితే అడ్డుకుంటామని మాజీ మంత్రి మర్రి శశిధర్‌రెడ్డి అన్నారు. గాంధీభవన్‌లో శుక్రవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ అసలు జింఖానా గ్రౌండ్‌లో ఏమి కట్టాలని అనుకుంటున్నారనే అంశంపై సిఎంకే స్పష్టత లేదన్నారు. సిఎం వ్యక్తిగత ప్రయోజనాలకే కొత్త సచివాలయం, కొత్త అసెంబ్లీ నిర్మాణం చేపట్టాలని భావిస్తున్నారని, దానిని అడుకుంటామన్నారు. హైదరాబాద్ ప్రజల చందాలతో ఏడవ నిజాం అసెంబ్లీ భవనాన్ని నిర్మించారని తెలిపారు. కెసిఆర్ పిచ్చి పాలన సాగిస్తున్నారని అన్నారు. రాష్ట్రమంతటా పర్యటించి ప్రతిపక్షాల బండారం బైటపెడతానని కెసిఆర్ అంటుంటే ప్రజలు నవ్వుకుంటున్నారని చెప్పారు.

ఇయు నుంచి రాఘవరెడ్డి బహిష్కరణ

మన తెలంగాణ/ హైదరాబాద్ : ఆర్‌టిసి ఎంప్లాయిస్ యూనియన్ హైదరాబాద్ జోనల్ కార్యదర్శి ఆర్.రాఘవరెడ్డిని యూనియన్ నుంచి బహిష్కరించినట్లు ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.రాజిరెడ్డి ప్రకటించారు. యూనియన్ వ్యతిరేక కార్యక్రమాలకు పాల్పడుతున్నందున రాఘవరెడ్డిని పదవి నుంచి యూనియన్ ప్రాథమిక సభ్యత్వం నుండి తొలగిస్తూ ఈ నెల 4వ తేదీన యూనియన్ నిర్ణయం తీసుకుందని రాజిరెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఇక నుంచి ఎంప్లాయిస్ యూనియన్‌కు రాఘవరెడ్డికి ఎలాంటి సంబంధం లేదని, యూనియన్‌కు సంబంధించిన అంశాలపై యూనియన్ నాయకులు కార్యకర్తలు ఆయనతో సంప్రదించాల్సిన, సంబంధాలు పెట్టుకోవలసిన అవసరం లేదని ఆయన స్పష్టం చేశారు.

ముస్లిం రిజర్వేషన్లకు ప్రధాని సానుకూలం : లక్ష్మణ్



మన తెలంగాణ/హైదరాబాద్: ముస్లిం రిజర్వేషన్ల విషయంలో ప్రధాని మోడి సానుకూలంగా ఉన్నారని సిఎం కెసిఆర్ అబద్ధాలు ఆడుతున్నారని, ప్రధాని మాటలను ఆయన వక్రీకరిస్తున్నారని బిజెపి రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ కె.లక్ష్మణ్ విమర్శించారు. మతపరమైన రిజర్వేషన్లకు తాము వ్యతిరేకమని ఆయన పునరుద్ఘాటించారు. సెప్టెంబర్ 17 విమోచన దినోత్సవాన్ని ఒక ఉద్యమంగా ప్రజల్లోకి తీసుకెళ్తామన్నారు. హైదరాబాద్‌లోని బిజెపి రాష్ట్ర కార్యాలయంలో శుక్రవారం తెలంగాణ విమోచన కమిటీ సమావేశమైంది. విమోచన దినోత్సవం కార్యక్రమంలో భాగంగా ''సెప్టెంబర్ 17న'' బహిరంగ సభ ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. సమావేశం అనంతరం డాక్టర్ కె. లక్ష్మణ్ మీడియాకు వివరాలను వెల్లడించారు. 2019లో బిజెపి అధికారంలోనికి వస్తే విమోచన దినోత్సవాన్ని అధికారికంగా నిర్వహిస్తామన్నారు.

ఉద్యాన విద్యార్థుల దీక్ష విరమణ

మన తెలంగాణ/హైదరాబాద్ : రాజేంద్రనగర్‌లో శ్రీకొండా లక్ష్మణ్ బాపుజీ తెలంగాణ ఉద్యాన విశ్వవిద్యాలయం విద్యార్థులు శుక్రవారం తమ దీక్షలను విరమిస్తున్నట్లు ప్రకటించారు. ఉద్యాన అధికారి, ఉద్యాన విస్తరణ అధికారుల పోస్టులు విడుదల చేసి భర్తీ చేయాలని కోరుతూ విద్యార్థులు గత నెల రోజులుగా దీక్షలు, నిరసనలతో ఆందోళన చేస్తున్నారు. ఉద్యాన వర్సిటీ వైస్ ఛాన్సలర్ ప్రత్యేకంగా కలుగజేసుకుని ప్రభుత్వం విద్యార్థుల డిమాండ్‌లకు సానుకూలంగా స్పందిస్తుందని దీక్షలు విరమించాలని విజ్ఞప్తి చేశారు. దీంతో విద్యార్థులు దీక్షను విరమిస్తున్నట్లు ప్రకటించారు. దీంతో నెల తరువాత వచ్చే సోమవారం నుంచి యూజి, పిజి, పిహెచ్‌డి పరీక్షల బోధన జరగనుంది.

టీచర్ల భర్తీ అలస్యం

• టిఎస్‌పిఎస్‌సికి ఇంకా అందని పోస్టుల అర్హతలు



మన తెలంగాణ/హైదరాబాద్: ఉపాధ్యాయ పోస్టుల భర్తీ నోటిఫికేషన్ మరింత ఆలస్యమయ్యే అవకాశాలు కనిపిస్తున్నాయి. రాష్ట్రంలో పెద్దసం ఖ్యలో టీచర్ పోస్టులు భర్తీ చేస్తామని గత మూడేళ్లుగా మంత్రులు, అధికా రులు ఎన్నో సార్లు ప్రకటనలు చేశారు. దాంతో టీచర్ అభ్యర్థులు ఏళ్ల తర బడి నోటిఫికేషన్ కోసం కళ్ల కాయలు కాచేలా ఎదురుచూస్తున్నారు. టెట్ ఫలితాలు విడుదలైన వెంటనే 8,792 టీచర్ పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ జారీ చేస్తామని ఇటీవల ఉపముఖ్యమంత్రి, విద్యాశాఖ మంత్రి కడియం శ్రీహరి ప్రకటించారు. అలాగే సెప్టెంబర్ మొదటివారంలోగా ఉపాధ్యాయ నియామకాల ప్రక్రియ పూర్తి చేస్తామని రాష్ట్ర ప్రభుత్వ సుప్రీంకోర్టుకు తెలి పింది. దాంతో ఆగస్టులో కచ్చితంగా నోటిఫికేషన్ వస్తుందని టీచర్ అభ్య ర్థులు ఎంతో విశ్వాసంతో ఉన్నారు. టిఎస్‌పిఎస్‌సి ద్వారా ఉపాధ్యాయ పోస్టుల నియామకాలు చేపట్టాలని ప్రభుత్వం నిర్ణయించింది. అయితే వరకు టీచర్ పోస్టులకు సంబంధించిన అర్హతలు టిఎస్‌పిఎస్‌సి పంపలేదని విద్యాశాఖ ఉన్నతాధికారులు చెబుతున్నారు. శుక్రవారం టెట్ ఫలితాలు విడుదలయినప్పటికీ టీచర్ పోస్టుల భర్తీ నోటిఫికేషన్ మాత్రం మరింత ఆల స్యమయ్యే అవకాశాలు లేకపోలేదు. టిఎస్‌పిఎస్‌సి ఉపాధ్యాయ ఖాళీల భర్తీ ప్రకటన జారీ చేస్తే, నోటిఫికేషన్ తేదీకి, , పరీక్ష తేదీకి కనీసం 40 రోజుల గడువు ఉండాలి. ఈ లెక్కల సెప్టెంబర్‌లోగా ఎట్టి పరిస్థితుల్లో ఈ ప్రక్రియ పూర్తయ్యే అవకాశమే లేదు. రాష్ట్రంలో పాఠశాలలు, విద్యార్థుల రేషనలైజే షన్ పూర్తయితేనే ఉపాధ్యాయ ఖాళీలపై స్పష్టత వస్తుందని, ఆ తర్వాతనే నోటిఫికేషన్ జారీ చేయడమే మేలని అధికారులు భావిస్తున్నట్లు సమా చారం. ఎంతోకాలంగా పెండింగ్‌లో ఉన్న ఏకీకృత సర్వీస్‌రూల్స్‌కు ఇటీవల రాష్ట్రపతి ఆమోదించిన నేపథ్యంలో త్వరగా టీచర్ల బదిలీలు, పదోన్నతుల ప్రక్రియ పూర్తి చేసి, ఆ తర్వాతనే నోటిఫికేషన్ జారీ చేయనున్నట్లు తెలు స్తోంది. ఈ పరిణామాల నేపథ్యంలో టీచర్ పోస్టుల భర్తీ నోటిఫికేషన్ ఆలస్యం కానున్నట్లు సమాచారం. ఉమ్మడి రాష్ట్రంలో చివరిసారిగా 2012లో ఉపాధ్యాయ పోస్టుల భర్తీ చేపట్టగా, అప్పటి నుంచి టీచర్ అభ్య ర్థులు నోటిఫికేషన్ల ఎదురుచూస్తూనే ఉన్నారు. రాష్ట్రంలో టెట్‌లో ఉత్తీర్ణత సాధించిన అభ్యర్థులు సుమారు 3.5 లక్షల వరకు ఉన్నారు.



ఎన్‌డిఎ ఉపరాష్ట్రపతి అభ్యర్థిగా ఎంపికైన తర్వాత కేంద్ర మాజీ మంత్రి వెంకయ్యనాయుడి రాజకీయ జీవితాన్ని అద్దంపడుతూ 'మన తెలంగాణ' ఆదివారం అనుబంధం 'హరివిల్లు'లో ఇటీవల సమగ్ర కథనాన్ని ప్రచురించింది. శుక్రవాంనాడు ఢిల్లీలో ఆ కథనాన్ని ఆసక్తిగా చదువుతున్న దృశ్యం

4 నెలలు.. రూ.4,400 కోట్లు

సాగునీటికి ప్రభుత్వ ఖర్చు తీరిదే.. పెరిగిపోతున్న పెండింగ్ బిల్లులు

మన తెలంగాణ/హైదరాబాద్: ఇరిగేషన్ బడ్జెట్ రూ.25 వేల కోట్లు కేటాయిం చినా, ఖర్చు మాత్రం దానికి తగ్గట్లుగా లేదు. సాగునీటి ప్రాజెక్టులకు నాలుగు నెలల్లో 4,466 కోట్లు మాత్రమే ఖర్చు చేశారు. నెలకు రూ.2,000 కోట్లకు తగ్గకుండా పనులు చేసి, ఖర్చు చేస్తేనే కేటాయింపులు పూర్తిగా వినియోగించు కుంటాం. కానీ నెలకు సగటున రూ.1,100 కోట్లు మాత్రమే ఖర్చు చేస్తున్నారు. పెండింగ్ బిల్లులు రూ.2,848.66 కోట్లకు చేరాయి. వీటికి అదనంగా మరో రూ.2,300 కోట్ల బిల్లులు చెల్లించడానికి సిద్ధంగా ఉన్నాయి.

కాళేశ్వరంకే పెద్దపీట: నాలుగు నెలల్లో ఖర్చు చేసిన నిధుల్లో ప్రభుత్వం కాళేశ్వరానికే పెద్దపీత వేసింది. నాలుగు నెలల్లో ఈ ప్రాజెక్టులో రూ.2002 కోట్లు ఖర్చు చేసింది. ఇంకా పెండింగ్‌లో మరో రూ.2,000 కోట్ల బిల్లులు ఉన్నాయి. తర్వాత ప్రాధాన్యత పాలమూరు రంగారెడ్డి ఎత్తిపోతల పథకానికి దక్కింది. పాలమూరు ప్రాజెక్టులో ఇప్పటి వరకు రూ.రూ.545.70 కోట్లు వెచ్చించారు. దీనికి మరో రూ.650 కోట్ల బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయి. ఇదేవిధంగా ఎఎంఆర్‌పి, ఎస్‌ఎల్‌బిసి ప్రాజెక్టుకు రూ.244 కోట్లు, కల్వకుర్తి ఎత్తిపోతలకు రూ.193 కోట్లు, శ్రీరాంసాగర్ వరద కాలువకు రూ.285 కోట్లు, దేవాదులకు రూ. 175 కోట్లు ఖర్చు చేశారు. మైనర్ ఇరిగేషన్, మిషన్ కాకతీయ పనులకు రూ.444 కోట్లు బిల్లులు చెల్లించారు.

12,13 తేదీలలో జరగాల్సిన పరీక్షలు వాయిదా

మన తెలంగాణ/హైదరాబాద్: అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజ నీర్స్, వెటర్నరీ అసిస్టెంట్ సర్జన్స్, ఇన్‌స్పెక్టర్ ఆఫ్ బాయిలర్స్ పో స్టుల భర్తీకి ఈ నెల 12,13 తేదీలలో జరగాల్సిన రాత పరీక్ష లను ఈ నెల 27,28 తేదీలకు వాయిదా వేస్తున్నట్లు టిఎస్‌పిఎస్‌సి కార్య దర్శి ఎ.వాణిప్రసాద్ తెలిపారు. ఈ పరీక్షలను స్టాఫ్ సెలక్షన్ కమిషన్ పరీక్షల కారణంగా వాయిదా వేసినట్లు పేర్కొన్నారు.

ముగ్గురికి స్వైన్‌ఫ్లూ

మన తెలంగాణ/హైదరాబాద్: తాజాగా ముగ్గురికి స్వైన్‌ఫ్లూ ఉన్న ట్లు పరీక్షల్లో తేలింది. స్వైన్‌ఫ్లూ అనుమానిత లక్షణాలతో వివిధ ఆసుపత్రులకు వచ్చిన 23 మంది నమూనాలను సేకరించి పరీక్షించారు. దీనితో ఆగస్టు 1వ తేదీ నుండి ఇప్పటి వరకు 79 అనుమానిత నమూనాలను పరీక్షించగా 10 మందిలో స్వైన్‌ఫ్లూ ఉన్నట్లు నిర్ధారించారు. స్వైన్‌ఫ్లూ ప్రభావం కొనసాగుతున్నందున ప్రజలు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని వైద్య ఆరోగ్య శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి రాజేశ్వర్ తివారీ ఒక ప్రకటనలో సూచించారు.

'వజ్ర' యాప్ టిక్కెట్లకు రాయితీ



మన తెలంగాణ/ హైదరాబాద్: 'ప్రయాణికుల ముంగిట్లోకి సర్వీస్' పేరుతో కాలనీలకు సులువుగా వెళ్లేందుకు ప్రారంభించిన 'వజ్ర' మినీ బస్సుల్లో యాప్ ద్వారా టిక్కెట్లను బుక్ చేసుకునే ప్రయాణికులకు రూ.25 రాయితీ ఇవ్వను న్నట్లు టిఎస్ఆర్‌టిసి మేనేజింగ్ డైరెక్టర్ జి.వి.రమణరావు ప్రకటించారు. యాప్ ద్వారా టెక్కెట్లు బుక్ చేసుకునే ప్రయాణికులకు మొదటి 4 బుకింగ్ లకు మొత్తం రూ.100 రాయితీగా ఇవ్వాలని నిర్ణయించినట్లు ఆయన ఒక ప్రకటనలో తెలిపారు. ఈ రాయితీ ఈ నెల 5వ తేదీ నుంచి అమలులోకి వ స్తుందని ఆయన తెలిపారు. ఇదిలా ఉండగా వజ్ర బస్సుల బోర్డింగ్ పాయింట్ల లో ఎక్కే ప్రయాణికులకు బస్సులోనే డ్రైవర్ ట్యాబ్ ద్వారా నగదు లావాదేవీతో కూడిన టిక్కెట్ ఇచ్చే సదుపాయాన్ని త్వరలో కల్పించేందుకు తగిన ఏర్పాటు చేస్తున్నట్లు ఆయన వెల్లడించారు. వజ్ర బస్సుల్లో ప్రయాణం చేయదలుచుకునే ప్రయాణికులు ముందస్తుగా టిక్కెట్లను www.tsrtconline.in వెబ్‌సైట్‌తో పాటు tsrtc App ద్వారా రిజర్వేషన్ చేసుకోవచ్చని ఆయన వివరించారు.

గిరిజనులకు రిజర్వేషన్ కోసం డిమాండ్

గిరిజనుల పోరాటానికి సిపిఐ, సిపిఐ(ఎం) మద్దతు



మన తెలంగాణ/ హైదరాబాద్: రాష్ట్రంలో గిరిజనుల జనాభా ప్రాతిపది కన 10 శాతం రిజర్వేషన్‌ను జిఓ ద్వారా కల్పించి అమలు చేయాలని గిరిజన సంఘాలు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశాయి. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందిం చి రిజర్వేషన్లు కల్పించనట్లయితే ప్రగతి భవన్‌ను ముట్టడించాలని నిర్ణ యించాయి. గిరిజనుల జనాభా ప్రకారం రిజర్వేషన్ అమలు చేయకపో వడం వల్ల గత మూడేళ్లుగా విద్య, ఉద్యోగ, ఉపాధి రంగాల్లో గిరిజనులు తీవ్రంగా నష్టపోతున్నారని గిరిజన సంఘాల నాయకులు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ మేరకు నగరంలో శుక్రవారం జరిగిన రాష్ట్ర స్థాయి గిరిజన సంఘాల రౌండ్ టేబుల్ సమావేశం పలు తీర్మానాలను ఆమోదించింది. మాజీ మంత్రి డి.రవీంద్రనాయక్, గిరిజన సంఘాల నాయకులు రమావత్ అంజయ్య నాయక్ (తెలంగాణ గిరిజన సమాఖ్య), ఎం.జగన్‌లాల్ (టిపిసిసి ఎస్‌టి సెల్), ధర్మానాయక్ (గిరిజన సంఘం), బాబూరావు నాయక్ (టిడిపి ఎస్‌టి సెల్) తదితరులు సమావేశంలో పాల్గొన్నారు. సిపిఐ రాష్ట్ర నాయకులు ఎన్.బాలమల్లేష్, సిపిఐ(ఎం) రాష్ట్ర నాయకులు జూకంటి రంగారెడ్డి సమావేశంలో పాల్గొని గిరిజనుల పోరాటానికి మద్దతు ప్రకటించారు. రవీంద్రనాయక్ మాట్లాడుతూ జిఓ ద్వారా రిజర్వేషన్ పెంచే అవకాశమున్నప్పటికీ ప్రభుత్వం కమిటీల పేరుతో కాలయాపన చేస్తున్నదని విమర్శించారు. అంజయ్య నాయక్ మాట్లాడుతూ 'గిరిజన తండాల అభివృద్ధి సంస్థ'ను ఏర్పాటు చేసి 500 జనాభా ఉన్న తండాలన్నింటినీ గ్రామ పంచాయితీలుగా గుర్తించాలని డిమాండ్ చేశారు.

తెలంగాణలో దళిత, మైనార్టీలకు రక్షణ కరువు

టిడిపి కార్యనిర్వాహక అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి



మన తెలంగాణ/కరీంనగర్‌ప్రతినిధి: సంవత్సరాలుగా పోరాడి ఎందరో త్యాగల ఫలితంగా సాధిం చుకున్న తెలంగాణ రాష్ట్రంలో బడుగు, బలహీన, దళిత, మైనార్టీ వర్గాలకు చెందిన ప్రజలకు రక్షణ కరువైందని తెలంగాణ తెలుగుదేశం పార్టీ కార్యనిర్వాహక అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి అన్నారు. నేరెళ్ల బాధితులకు సంఘీభావంగా కలెక్టరేట్ వద్ద అంబేద్కర్ యువజన ఆధ్వ ర్యంలో శుక్రవారం నుంచి చేపట్టిన రిలే నిరాహార దీక్షకు మద్దతు పలికేందుకు విచ్చేసి ఆయన మాట్లాడుతూ వచ్చిన తెలంగాణలో ఆస్తులు కూడబెట్టుకునేం దుకే కెసిఆర్ కుటుంబం ప్రయత్నిస్తుందని ప్రజల సంక్షేమం గురించి పట్టిం చుకోవడం లేదన్నారు. పేదలను నిర్భంధించి కొట్టే అధికారం పోలీసులకు ఎక్కడిదని ఆయన ప్రశ్నించారు. తెలుగుదేశం పార్టీ బాధితులకు అండగా ఉండి న్యాయం జరిగే వరకు పోరా డుతుందన్నారు. టిడిపి పొలిట్‌బ్యూరో సభ్యుడు మోత్కుపల్లి నర్సింహులు మాట్లాడుతూ మృతుల కుటుంబాలకు రూ.10లక్షల ఎక్స్‌గ్రేషియాతోపాటు ఇంటికి ఒక ఉద్యోగం ఇవ్వాలని డిమాండ్ చే శారు. క్రిమినల్ కేసులు నమోదు చేయాలన్నారు. ఈ కార్యక్ర యంలో కవ్వంపల్లి సత్యనారాయణ, అంబేద్కర్ యువజన సంఘం అధ్య క్షుడు గజ్జెల కాంతం, మేడి మహేష్ తదితరులు పాల్గొన్నారు.

ఇక 30 రోజుల్లోనే పారిశ్రామిక రాయితీలు!

ఆన్‌లైన్ ఇన్‌సెంటివ్స్‌పై పరిశ్రమలశాఖ శిక్షణా సదస్సు

మన తెలంగాణ/ హైదరాబాద్: పారిశ్రామిక రా యితీలను లబ్ధిదారులకు నెల రోజుల్లోనే అందే లా పరిశ్రమలశాఖ ప్రత్యేక చర్యలు తీసుకుం టోంది. లబ్ధిదారులు ఆన్‌లైన్‌లోనే ఇందుకోసం దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుందని, ఇన్‌సెంటి వ్స్‌కు సంబంధించిన సమాచారాన్ని కూడా ఆన్ లైన్ ద్వారానే వారికి చేరవేస్తామని పరిశ్రమల శాఖ కమిషనర్ అహ్మద్ నదీమ్ తెలిపారు. పారి శ్రామిక రాయితీలు, ప్రోత్సాహకాలపై రాష్ట్రం లోని అన్ని జిల్లాల జనరల్ మేనేజర్లతో హైదరా బాద్‌లోని పరిశ్రమల శాఖ కార్యాలయంలో శుక్ర వారం ఒక సమావేశం జరిగింది. ఈ సమావే శంలో టిఎస్ ఐపాస్‌లో 15 రోజుల్లోనే అన్ని రకాల అనుమతులు మంజూరు చేసినట్లే పారిశ్రా మిక వేత్తలకు వారి యూనిట్ల ఆధారంగా ఇన్ సెంటివ్స్‌లను నెల రోజుల్లోనే లబ్ధిదారులకు అందేలా ఆన్‌లైన్ విధానంపై శిక్షణా కార్యక్ర మాన్ని నిర్వహించారు. లబ్ధిదారులు పరిశ్రమల శాఖ ఈ మెయిల్‌కు పెట్టుకున్న దరఖాస్తులను పరిశీలించి కేవలం నెల రోజుల్లోనే వారికి తప్పని సరిగా రాయితీలు ఇవ్వాల్సి ఉంటుంది. యూని ట్ కాస్ట్ రూ. 10 లక్షల కెపిటల్ మొదలు కొని రూ. 5 కోట్ల వరకు ఉన్న సంస్థలకు పెట్టుబడి రాయితీలు లభిస్తాయి. 10 లక్షల పెట్టుబడి గల ఎంఎస్‌ఈ రంగంలో ఉన్న పరిశ్రమలను జిల్లా స్థాయిలో జిఎంలు పరిశీలిస్తారు. సులభతర వా ణిజ్య విధానంలో జనరల్ మేనేజర్ల పాత్ర ఏంటీ? తనిఖీ అధికారం ఎవరికి ఉంటుంది? రాష్ట్ర కేం ద్రానికి (పరిశ్రమలశాఖ రాష్ట్ర కార్యాలయం)కు ఈ మెయిల్ పంపిస్తే అక్కడ జరిగే ప్రాసెస్ ఏంటీ? వంటి అంశాలపై రాష్ట్ర స్థాయి అధికారు లు జిఎంలకు శిబిరంలో తర్ఫీదును ఇచ్చారు.

రాష్ట్రంలో మొక్కజొన్న ప్రాసెసింగ్ యూనిట్ ఏర్పాటు !

మన తెలంగాణ/హైదరాబాద్ : రాష్ట్రంలో మరో వ్యవసాయ ఆధారిత ప్రాసెసింగ్ యూనిట్ నిర్మాణం కానుంది. గుజరాత్ కు చెందిన రిద్ధి సిద్ధి కంపెనీ మొక్కజొన్న ఆధారిత ప్రాసెసింగ్ యూనిట్ ఏర్పాటుకు సంసిద్ధత వ్యక్తం చేసింది.సచివాలయంలో శుక్రవారం వ్యవసాయ శాఖ మంత్రి పోచారం శ్రీనివాస్ రెడ్డిని రిద్ధి కంపెనీ యజమాని కలిసారు. ఈ సందర్భంగా రూ. 200 కోట్లతో రోజుకు 800 టన్నుల సామర్థ్యంతో పనిచేసే యూనిట్‌ను సంగారెడ్డి పరిసరాలలో ఏర్పాటు చేస్తామని తెలిపారు. కంపెనీ ప్రతినిధులతో మంత్రి మాట్లాడుతూ కంపెనీ ఏర్పాటుకు అన్ని విధాలుగా సహకారం అందిస్తామ న్నారు. రాష్ట్రంలో మొక్కజొన్న సాగు ఏటా పెరుగుతుందన్నారు. ఈ సమావే శంలో హైదరాబాద్ నగర మేయర్ బొంతు రామ్మోహన్, రిద్ధి సిద్ధి సంస్థ ఎక్జిక్యూటివ్ డైరెక్టర్ సిద్ధార్థ చౌదరి పాల్గొన్నారు.

స్వతంత్రంగా సేంద్రియ ధృవీకరణ సంస్థ !

మన తెలంగాణ/హైదరాబాద్: నాణ్యమైన సేంద్రియ ఉత్పత్తుల కోసం సేంద్రియ ధృవీకరణ సంస్థ స్వతంత్రంగా లేదా ప్రత్యేక అధికార యంత్రాంగం ఏర్పాటు చేసుకోనుంది. ఈ మేరకు ప్రభుత్వానికి తెలంగాణ రాష్ట్ర విత్తన, సేంద్రియ ధృవీకరణ సంస్థ సంచాలకులు డాక్టర్ కేశవులు ప్రతిపాదనలు పంపారు. సేంద్రియ సాగుకు సంబంధించి అంతర్జాతీయ ధృవీకరణ ఇచ్చేందుకు అపెడా బృందం రాష్ట్రంలో మూడు రోజులు పర్యటించింది. ఈ సందర్భంగా ధృవీకరణ సంస్థ కార్యకాలపాలను క్షేత్రస్థాయిలో పరిశీలించి సంతృప్తి చెందింది.

కొత్త పోస్టులపై వ్యవసాయాధికారుల భగ్గు

మన తెలంగాణ/హైదరాబాద్ : కొత్త అసిస్టెంట్ అగ్రికల్చర్ ఆఫీసర్ డివి జన్ (ఎడిఎ) పోస్టులపై వ్యవసాయాధికారులు భగ్గుమంటున్నారు. జిల్లాల పునర్విభజనతో 3 నుంచి 5 మండలాలతో 31 కొత్త ఎడిఎ డివిజన్‌లు ఏర్పడ్డాయి. ఈ డివిజన్లకు వ్యవసాయ శాఖ ప్రస్తుతం వివిధ ప్రాంతాలలో పనిచేస్తున్న 31 మంది ఎడిఎలను రిడిప్లాయ్ (పోస్టుతో సహా బదిలీ) చేస్తూ గురువారం రహస్య ఉత్తర్వులను జారీ చేసింది. ఇంఛార్జి పోస్టు మాత్రమే ఇవ్వాలని కోరుతూ వ్యవసాయ అధికారుల ఉద్యోగ సంఘం ప్రభుత్వానికి పలుసార్లు విజ్ఞప్తి చేసింది. అయితే ప్రభుత్వం వాటిని పట్టించుకోకుండా రిడిప్లాయ్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేసిందని వారు మండిపడుతున్నారు. అలాగే ఒక జిల్లా నుంచి మరొక జిల్లాకు ఎడిఎలను బదిలీ చేశారని, జోనల్ పరధి దాటి చేసారని ఆరోపిస్తున్నారు. నల్లగొండలో పనిచేస్తున్న ఒక ఎడిఎను నిజామాబాద్ జిల్లా ఇందల్వాయికు బదిలీ చేశారని ఒక ఎడిఎ వాపోయారు. ఇలా చాలా మందిని ఇతర జిల్లాలకు కేటాయించినట్లు పేర్కొన్నారు. ప్రభుత్వం ఇచ్చిన ఉత్తర్వుల్లో మార్పులు చేయాలని లేదంటే ఆందోళన చేస్తామని ఎడిఎలు హెచ్చరిస్తున్నారు.



"జీవితంలో కోట్లు సంపాదించినా కలగని ఆనందం ఒక మంచి మిత్రుడిని పొందినప్పుడు కలుగుతుంది.
– సర్వేపల్లి రాధాకృష్ణన్"

అధికార దుర్వినియోగం

సంపాదకీయం

రాజకీయ స్వప్రయోజనాల కోసం నరేంద్ర మోడీ ప్రభుత్వ అధికార దుర్వినియోగానికి తాజా ఉదాహరణ కర్నాటక విద్యుత్ శాఖామంత్రి డి.కె.శివకుమార్ ఇళ్లు, వ్యాపార సంస్థల కార్యాలయాలపై ఆదాయపు పన్ను శాఖ దాడులు. అతడు బహుళ వ్యాపారాలున్న పారిశ్రామిక వేత్త. అందువల్ల అవినీతికరమైన ఆర్జన, ఆదాయానికి మించిన ఆస్తులు కలిగి ఉండవచ్చు. అతనిపై చట్ట ప్రకారం చర్యలు తీసుకోవటాన్ని ఎవరూ వ్యతిరేకించరు. కాని అందుకు ఎంచుకున్న సమయం మోడీ ప్రభుత్వ దురుద్దేశాన్ని వెల్లడి చేస్తున్నది. బీహార్‌లో ముఖ్యమంత్రి నితీష్ కుమార్ మహాకూటమిని విచ్ఛిన్నం చేసేందుకు ఒక సాకు కల్పించటానికే ఆర్‌జెడి నేత లాలూప్రసాద్, అతని కుటుంబ సభ్యుల నివాసాలపై సిబిఐ దాడులు చేసి అవినీతి కేసులు పెట్టారన్నది సర్వవిదితం. లాలూ ప్రసాద్‌పై పశు దాణాకు సంబంధించిన అవినీతి కేసులపై పునర్విచారణ జరుగుతూనే ఉంది. కుమార్తెతోపాటు ఉప ముఖ్యమంత్రిగా ఉండిన కుమారుడు తేజస్వి యాదవ్‌పై కూడా సిబిఐ ఎఫ్ఐఆర్ దాఖలు చేయటం తెలిసిందే. వారి అవినీతి గూర్చిన నిజానిజాలు నిగ్గు తేల్చటానికి ఎన్నేళ్లు పడుతుందో ఎవరూ చెప్పలేరు. ఈలోపు బిజెపి రాజకీయంగా లబ్ది పొందింది.

గుజరాత్‌లో ఒక రాజ్యసభ సీటు అదనంగా గెలుచుకోవటానికి, సోనియా గాంధీ రాజకీయ సలహాదారు అహ్మద్ పటేల్‌ను ఓడించటానికై కాంగ్రెస్ శాసన సభ్యులను నయాన భయాన కొనుగోలు చేస్తున్న బిజెపి కుయుక్తుల నుంచి తమను తాము కాచుకోవటానికై ఆ పార్టీ సభ్యులు కర్నాటకలో ఆశ్రయం పొందటం తెలిసిందే. వారు శివకుమార్‌కు చెందిన ఈగల్ టన్ రిసార్ట్‌లో బస చేస్తున్నారు. ఆ రిసార్ట్‌లో కూడా సోదాలు ఐటి డిపార్టుమెంట్ రాజకీయ పనిముట్టుగా ఉపయోగపడటాన్ని సూచిస్తున్న ది. ఐటి దాడుల గురించి రాష్ట్ర ప్రభుత్వానికి సమాచారమివ్వకుండా, రాష్ట్ర పోలీసు సహాయం తీసుకునే సాంప్రదాయానికి విరుద్ధంగా యూనిఫాం, తుపాకులధారణతో కూడిన సి ఆర్‌పిఎఫ్‌ను ఉపయోగించుకోవటం ఫెడరల్ వ్యవస్థ పనితీరుకు విఘాతం కలిగించటమే. అంతేగాక వారు రిసార్ట్‌లో బస చేసిన వివరాలు, వారిని పోషిస్తున్న వారెవరో తెలుసుకో గోరటంలోని ఉద్దేశం ఎమ్మెల్యేలను భయపెట్టటమే. ఇక్కడేం చేస్తున్నారు గుజరాత్ వెళ్లండి అంటూ ఇద్దరు ఎమ్మెల్యేలను హెచ్చరించారట కూడా.

గుజరాత్ అసెంబ్లీ నుంచి మూడు రాజ్యసభ సీట్లకు ఈనెల 8న పోలింగ్ జరుగుతుంది. రెండు సీట్లు సునాయాసంగా గెలుచుకునే సంఖ్యాబలమున్న బిజెపి, పార్టీ అధ్యక్షుడు అమిత్ షా, కేంద్ర మంత్రి స్మృతి ఇరానీలను అభ్యర్థులుగా నిర్ణయిం చింది. కాంగ్రెస్‌కు ఇటీవల రాజీనామా చేసిన అసెంబ్లీలో ప్రతిపక్ష నాయకుడు శంకర్ సింగ్ వాఘెలాకు చెందిన ఎమ్మెల్యేల సహాయంతో, కాంగ్రెస్ నుంచి మరి కొందరిని 'ఆకర్షించి' అహ్మద్‌పటేల్‌ను ఓడించటానికై మూడవ అభ్యర్థిని పోటీకి దించింది. ఈ సంవత్సరాంతంలో గుజరాత్ అసెంబ్లీ ఎన్నికల దృష్ట్యా, కాంగ్రెస్‌ను నైతికంగా దెబ్బతీయటానికి అమిత్ షా – మోడీ ద్వయం ఈ రాజకీయ చాతుర్యం ప్రదర్శించింది.

అవినీతికి పాల్పడిన రాజకీయ నాయకులపై సిబిఐ, ఇడి, ఐటివంటి ఏజెన్సీలు చర్య తీసుకోవటాన్ని ప్రజలు హర్షిస్తారు. అది తగినంతగా జరగటం లేదని, నిష్పాక్షికంగా కాకుండా ఎంచుకున్న కొందరిపైకి దర్యాప్తు సంస్థలను ప్రయోగిస్తున్నారనే భావన ప్రజల్లో ఉంది. 'పంజరంలో చిలుక' అంటూ సిబిఐకి సుప్రీంకోర్టు అక్షింతలు వేయటం గుర్తు చేసుకోదగింది. రాజస్థాన్, చత్తీస్‌ఘడ్, మధ్యప్రదేశ్ ముఖ్య మంత్రులపై ఆరోపణలపై దర్యాప్తు చేపట్టకపోవటంలోని పక్షపాతం విదితమవుతున్నది. కర్నాటక మంత్రి శివకుమార్ అవినీతి సంగతేమోగాని, దాడులకు ఐటి ఎంచుకున్న సందర్భం వల్ల ప్రజల ఏహ్యతకు బదులు సానుభూతి పొందుతున్నాడు. ఈ ఏడాది జనవరిలో మరోమంత్రి రమేష్ జార్ కిహోళిపై ఐటి దాడులు జరిగినపుడు ఆయన రాజీనామాను గట్టిగా డిమాండ్ చేసిన రాష్ట్ర బిజెపి, శివకుమార్ విషయంలో మౌనం వహించటం ఆశ్చర్యకరం!

కర్ణాటకలో బసవ 'పురాణం'!

చూపు

కర్నాటకలో లింగాయత్‌లు ప్రత్యేక మతం గుర్తింపును డిమాండ్ చేస్తున్నారు. వారి డిమాండ్‌కు కాంగ్రెస్ మద్దతిస్తోంది. అలా మద్దతు పలకడం ఆ రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల కోసం కాంగ్రెస్ అనుసరిస్తున్న ఎత్తుగడగా పరిశీలకులు భావిస్తున్నారు. 2018 మేలో జరిగే రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికలకు కాంగ్రెస్, బిజెపిలు నువ్వా నేనా అన్న రీతిలో లింగాయత్‌ల ఓట్ల కోసం పోటీ నడుస్తోంది. రాష్ట్ర జనాభాలో లింగాయత్‌లు 17 శాతం.

ఇటీవల కొంత కాలంగా లింగాయత్‌లు కాంగ్రెస్ పట్టు నుంచి బయటకు వచ్చారు. అందువల్ల కాంగ్రెస్ తన రాజకీయ వ్యూహాలకు పదునుపెడుతున్నది. హిందువుల వెలుపల ప్రత్యేక మతం హోదా కోసం లింగాయత్‌లలో ఓ వర్గం చేస్తున్న డిమాండ్‌కు కాంగ్రెస్ అందుకే బాహాటంగా మద్దతు పలుకుతోంది. బిజెపి, దాని ముఖ్యమంత్రి అభ్యర్థి, శక్తివంతమైన లింగాయత్ నాయకుడు యడ్యూరప్ప పై కాంగ్రెస్ గట్టిగా విమర్శల దాడి సాగిస్తుండడాన్ని కేవలం మైనారిటీలు, దళితులు, వెనుకబడిన వర్గాల మీద పూర్తిగా ఆధారపడకుండా సొంతంగా గట్టి ఓటు బ్యాంకును సృష్టించుకోవడానికి తహతహపడుతున్నట్టుగా అర్థం చేసుకోవచ్చు. ముఖ్యంగా గట్టి పునాదిని ఏర్పరచుకోవాలని, కోల్పోతున్న ఎన్నికల ప్రాతిపదికను తిరిగి పుంజుకునేలా చేయాలని కాంగ్రెస్ దృఢంగా సంకల్పించినట్లు లింగాయత్‌ల డిమాండ్‌కు ఆ పార్టీ మద్దతులో స్పష్టమవుతోంది.


అది ప్రస్తుత ముఖ్యమంత్రి సిద్ద రామయ్య ఆలోచన అని కూడా వినిపిస్తోంది.రాష్ట్ర కాంగ్రెస్‌లో దృఢంగా నిలిచి ఉన్న పెద్ద తరం నాయకులలో ఆయన కూడా ఒకరు. కుల, మత గుర్తింపులకు ప్రజాస్వామ్య రాజకీయాలు ఎలా రూపమిస్తాయో ఈ అంశంలో తేటతెల్లమవుతోంది. హిందూ మత ఓట్లను గట్టి చేసుకోడానికి బిజెపి ప్రాధాన్యమిస్తుంటే దాని వెలుపల ప్రత్యేక మతంగా గుర్తింపును లింగాయతులు కోరడాన్ని కాంగ్రెస్ బలపరుస్తోంది. ఈ అంశంలో కొంత సంక్లిష్టత ఇమిడి ఉంది. రిజర్వేషన్ రాజకీయాలు కూడా దీనితో ముడిపడి ఉన్నాయి. లింగాయత్‌ల గుర్తింపునకు సంబంధిం చిన చిక్కు ప్రశ్నలు కొన్నిటిని ఆ అంశం ముందుకు తెస్తోంది.

బిజెపికి ఆ ఓట్లు కీలకం

2018 ఎన్నికలలో అధికారంలోకి రాడానికి లింగాయత్‌ల మొక్కవోని మద్దతుబిజెపికి అవసరం. జాతీయ స్థాయిలో పర్యవసా నాలు ఉండగల విస్తృత రాజకీయ చర్చకు ఈ అంశం తెర తీస్తోంది. బిజెపి, ఆర్‌ఎస్‌ఎస్‌లు ఐక్య హిందూ ఓటు కోసం సాగిస్తున్న ప్రయత్నాలకు రాష్ట్ర కాంగ్రెస్ లింగాయత్‌ల డిమాండ్‌కు మద్దతు పలకడం ద్వారా గండి కొడుతోంది. మరోప్రక్క ఉత్తర ప్రదేశ్ ఎన్నికలలోవలె పూర్తిగా తనకు అనుకూలంగా చక్రం తిప్పడానికి దీనిని బిజెపి వాడుకోవచ్చు కూడా. మొత్తానికి కర్నాటక రాజకీయాలలో ఈ 'ప్రత్యేక మతం' డిమాండ్ అందరి దృష్టిని ఆకర్షిస్తోంది. లింగాయత్‌లు 'కులాధార తెగ' వారుగా రాజకీయ పండితులు పేర్కొంటారు. వారు కర్నాటకలో ఒబిసిల క్రిందకు వస్తారు. అది హిందూ మతం లోపల వేర్వేరు కులాల వారిలో బసవే శ్వరుని బోధనలను అనుసరించేవారందరి ఐక్యత వల్ల ఏర్పడినది. బసవేశ్వరుడు 12వ శతాబ్దం నాటి భక్తి ఉద్యమంలో ఆవిర్భవించిన సంఘ సంస్కర్త, కవి, సన్యాసి. ఆయన బసవన్నగా ప్రసిద్ధులు.

హిందూ సామాజిక వ్యవస్థలోని అసమానతలతో ఆయన పోరాడారు. శ్రేయో దృక్పథంతో హిందూమతంలో వీరశైవం అనే కొత్త భక్తి సాంప్రదాయ శాఖను బసవన్న నెలకొల్పారు. అది సమాజం లోని వివిధ వర్గాల నుంచి అనుయాయులను ఆకర్షించింది. లింగా యత్ 'వేరే మతం' అని ఎప్పటికప్పుడు ఆ వర్గంలోని కొందరు వినిపి స్తూనే ఉన్నారు. గత దశాబ్ద కాలంలో ఆ ప్రకటన జోరు అందుకొంది. 2011 జనాభా లెక్కల తరుణంలో కొన్ని లింగాయత్ సంస్థలు హిందువులుగా నమోదు కావద్దని తమ వర్గంవారిలో ప్రచారం చేశారు. అయితే ఈ నెల 19న ఒక ర్యాలీలో లింగాయత్‌ల ప్రత్యేక మతం డిమాండ్ మొట్ట మొదటిసారి డిమాండ్ బాహాటంగా వినప డింది.బీదర్‌లో జరిగిన ఆ ర్యాలీలో సుమారు 50,000 మంది పాల్గొన్నారు. లింగాయత్‌లు, వీర శైవులు ఒక్కరూ కారని కూడా బీదర్‌లోని రాజకీయ, మత నాయకులు ర్యాలీలో పేర్కొన్నారు . వారు ఒక్కటే అని సాధారణంగా భావించేది నిజం కాదని వివరించారు. హిందూ మతంలో అంతర్భాగమైన శైవ ఆరాధన నుంచి వీర శైవం పుట్టిందని, కాబట్టి అది హిందూ మతంలో ఒక శాఖ అని వారు పేర్కొన్నారు.

అయితే లింగాయత్‌లు అలా కాకుండా ఒక ప్రత్యేక మతానికి చెందు తారని, బసవన్న 'వచనాలు' ఆ మతానికి ఆధారమ ని కూడా పేర్కొం టారు. లింగాయత్‌ల పూజాదికాలకు ఆ వచనాలే మూలం. అందు చేత తమను వీర శైవులుగా కాకుండా వేరే మతస్థులు గా గుర్తించాలని వారు కోరుతున్నారు. అది హిందూమతంలో అంతర్భాగం కాదని గుర్తు చేస్తున్నారు. ర్యాలీలో పాల్గొన్న వారి సంఖ్యతో నిమిత్తం లేకుం డా సిద్దరామయ్యకు ఈ డిమాండ్ కొత్త శక్తిని అందించింది. కేంద్రం చేత ఈ డిమాండ్‌ను ఆమోదింపచేసే ప్రయత్నాలు ఆయన ప్రారంభించారు. ప్రత్యేక మత హోదాను డిమాండ్ చేయడం కోసం లింగాయత్‌లు ఏకం అవుతున్నారని కేంద్రానికి ఆయన లేఖ రాయాలని సంకల్పించారు. వెంటనే యడ్యూ రప్ప రంగంలోకి దిగి లింగాయత్‌లను విభజించడానికి కాంగ్రెస్ ప్రయత్నిస్తున్నదని, మత ప్రాతిపదికపై ఎన్నికల ప్రయోజనాలను ఆశిస్తోందని ఆరోపణ చేశారు. ప్రత్యేక మతం డిమాండ్‌ను ఆయన నిర్ద్వంద్వంగా తోసిపుచ్చారు. వీర శైవులకు, లింగాయత్‌లకు మధ్య భేదం లేదని చెప్పారు. వారు హిందువులేనని గట్టిగా వాదించారు. ఇద్దరు ముఖ్యమంత్రి అభ్యర్థుల మధ్య ఇటువంటి ప్రకటనల యుద్ధం ఫలితంగా అనేక వాదనలు, ప్రతివాదనలు లింగాయత్‌లలో బయలు దేరాయి. అందులో మఠాధిపతులు ప్రమేయం కల్పించు కోవడం కూడా మొదలయింది.లింగాయత్‌ల ప్రత్యేక మతం డిమాండ్‌కు ప్రజాభిప్రాయాన్ని కూడగట్టేందుకు మంత్రుల బృందాన్ని కాంగ్రెస్ పురమాయించింది. ఆ డిమాండ్‌కు వ్యతిరేకంగా ప్రచారం చేయించాలని బిజెపి కూడా సంకల్పించింది. చివరకు జనతాదళ్ (సెక్యులర్) నేత హెచ్‌డి కుమార స్వామి ఈ ప్రచార పోటీలోకి దిగారు. ఆయన ఒక్కలిగ కులానికి చెందిన నేత. ఆ వర్గం ఓట్లకు ఆయనను కీలక నేతగా భావిస్తారు. లింగాయత్‌లకు వ్యతిరేకంగా ఓటు చేసే పెద్ద వర్గం ఒక్కలిగ. లింగాయత్‌ల డిమాండ్‌ను హిందూమతం నుంచి బయటికి రావడంగా కాకుండా వచ్చే ఏడాది జరిగే కర్నాటక అసెంబ్లీ ఎన్నికల రాజకీయ వ్యూహంగా పరిశీలకులు భావిస్తున్నారు.



* ఆర్తీ రామచంద్రన్

బిజెపి, కాంగ్రెస్‌లకు నెహ్రూ భయం!



టంకశాల అశోక్
9848191767

బిజెపి నెహ్రూ వారసత్వాన్ని రూపు మాపేందుకు ప్రయత్నిస్తున్నదనే విమర్శ లోగడ వాజపేయి ప్రభుత్వ కాలంలోనే మొదలైంది. అది నరేంద్ర మోడీ అధికారానికి వచ్చిన తర్వాత ఎక్కువైంది. ఈ విమర్శలకు తగినన్ని ఆధారాలున్నాయి గనుక బిజెపి కూడా వాటిని గట్టిగా కొట్టివేయలేకపోతున్నది. బిజెపికి, ఆ పార్టీ వెనుక ఉండి దీనినంతా ప్రేరేపిస్తున్న సంఘ్ పరివార్‌కు నెహ్రూ పట్ల వ్యతిరేకత, జంకూ ఉండటం సైద్ధాంతిక కారణాల వల్ల సహజమైన విషయం. అందువల్ల దానిలో ఆశ్చర్యపడదగింది లేదు. అదే సమయంలో అందరూ విస్మరిస్తున్న విషయం ఒకటుంది. నెహ్రూ అంటే కాంగ్రెస్‌కు కూడా భయమే. అది కూడా సైద్ధాంతికమైనదే. ఆ విధంగా ఇద్దరి భయాలు ఏమిటో చూద్దాము.

బిజెపికి నెహ్రూపట్ల గల వ్యతిరేకత కొత్త రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ తన ప్రసంగంలో ఆయన పేరును ప్రస్తావించకపోవటంతో తాజాగా మరొకమారు వ్యక్తమైంది. ఉపప్రధాని వల్లభాయ్ పటేల్ గురించి పేర్కొని ప్రధానమంత్రి నెహ్రూను విస్మరించటం ఏ విధంగా చూసినా అవివేకమైనదే. తమకు ఆయనపట్ల సైద్ధాంతికంగా వ్యతిరేకత ఉన్నట్లయితే అది వారి స్వేచ్ఛ. తనను విమర్శించవచ్చు కూడా. కాని, కొత్త రాష్ట్రపతి తొలి ప్రసంగం ఒక విశిష్టమైన సందర్భం. అది ప్రజాస్వామ్య పరిధిలో జరిగేది. ప్రధానమంత్రి మోడీ తన రాజకీయ ప్రసంగాలలో ఏమి చేసినా చెల్లిపోవచ్చు. కాని రాజకీయాలకు అతీతమైన రాజ్యాంగ అధినేత అయిన రాష్ట్రపతి విషయంలో అది చెల్లదు. గౌరవ మర్యాదలను ఆయన పాటించవలసిందే. లేనట్లయితే ప్రభుత్వం మాట ఎట్లున్నా రాష్ట్రపతిపట్ల విమర్శరాగల అవకాశం ఉంటుంది. ఈ విషయం ప్రభుత్వానికి, కొత్త రాష్ట్రపతికి తెలియదనుకోలేము. అయినప్పటికీ అందరూ తమ సంకుచిత వైఖరిని బయట పెట్టుకున్నారు.

నెహ్రూపై బిజెపి నిరసనకు ప్రధానంగా రెండు కారణాలున్నాయి. ఒకటి ఆయనవి ఆర్థికంగా, సామాజికంగా సోషలిస్టు విధానాలు కావటం. రెండు సామాజికంగా, సాంస్కృతికంగా ఆయన సెక్యులరిస్టు అవటం. ఈ రెండింటిని సంఘ్ పరివార్ శక్తులు స్వాతంత్ర్యానికి ముందు నుంచే వ్యతిరేకించాయి. ఇవే కారణల వల్ల వారు గాంధీజీని సైతం కనీసం పాక్షికంగా వ్యతిరేకించారు. ఆ దశలో వారు అభిమానించిన జాతీయ నాయకులు వల్లభాయ్ పటేల్, రాజేంద్రప్రసాద్ పటేల్ హిందూత్వ శక్తులతో అన్ని విషయాలలో ఏకీభవించలేదు. అయినప్పటికీ అప్పటి నాయకులలో తనే అందరి కన్న తమకు అనుకూలుడనే నమ్మకం వారికుంది. రాజేంద్రప్రసాద్ విషయం కూడా అంతే. నెహ్రూ సోషలిజం నిజానికి అపుడు ఇతర మాజీ వలస దేశాల నాయకులు అనుసరించిన లోకల్ బ్రాండ్ వంటిదే తప్ప శాస్త్రీయమైనది కాదు. ఆయనపై మార్క్సిజం, రష్యా – చైనా విప్లవాల ప్రభావాలు ఉండినా శాస్త్రీయ సోషలిస్టు వ్యవస్థలతో ఏకీభవించలేదాయన. కొన్ని వ్యవస్థాగత మార్పులతో పాటు సంక్షేమ పరిపాలన కోసం ప్రయత్నించాడు నెహ్రూ. అయితే సెక్యులరిజం మాత్రం ఇతరత్రానేగాక, దేశ వాస్తవిక పరిస్థితుల దృష్ట్యా తప్పనిసరి అని నమ్మాడు. సంఘ్ పరివార్ శక్తులకు ఆర్థికంగా ఫ్యూడల్, పెట్టుబడిదారీ వ్యవస్థలపట్ల పూర్తి అనుకూలత వుంది. సామాజికంగా వివిధ అల్ప సంఖ్యాక మత వర్గాలు హిందూ మెజారిటీకి లోబడి ఉండాలన్నది వారి విధానం. ఆ విధంగా నెహ్రూతో సంఘ్ పరివార్‌కు రెండు విధాలా చుక్కెదురైంది.

నెహ్రూ మరణించి ఇప్పటికి యాభై ఏళ్లు గడిచిపోయాయి. ఆ తర్వాత దేశంలో చాలా మార్పులు వచ్చాయి. అయినప్పటికీ అదే వ్యతిరేకత ఇప్పటికీ ఎందుకనే సందేహం కలగవచ్చు. అందుకు సమాధానం సులభంగా చెప్పవచ్చు. నెహ్రూ రెండు విధాలైన భావజాలాలకు ఇప్పటికీ విలువ వుంది. ఆయన జీవిత కాలంలో ఎంత ఉన్నదో ఈ రోజు కూడా అంతున్నది. జనాభాలో గణనీయమైన భాగం ఇంకా పేదరికంలో ఉన్నారు. దేశ లౌకిక వ్యవస్థకు ముప్పు మరింత పెరుగుతున్నది. ఈ విషయాలలో దేశానికి అవసరమైన భావజాలాన్ని ముందుకు తెచ్చిన నెహ్రూకు సాటిరాగల నాయకుడు ఆ తర్వాత మరెవరూ లేరు. ఇవన్నీ సంఘ్ పరివార్‌కు ఎంత మాత్రం సరిపడని సిద్ధాంతాలు.

ఆ విధంగా వారికి అప్పటికీ, ఇప్పటికీ కంటగింపుగా నిలిచిన పేరు జవహర్ లాల్ నెహ్రూది మాత్రమే. ఆర్థిక సంస్కరణల ప్రవేశం, నరేంద్ర మోడీ ప్రధాన మంత్రిత్వాల నుంచి ఈ రెండు అంశాలలో నెహ్రూ భావజాలంతో వైరుధ్యాలు ఎక్కువవుతున్నాయి. దేశంలో క్లిష్ట పరిస్థితులు పెరిగిన పక్షంలో సామాన్య ప్రజలకు తిరిగి నెహ్రూ భావజాలం బలంగా గుర్తుకు వచ్చి అదే శరణ్యంగా తోచవచ్చు. అది సంఘ్ పరివార్‌కు ప్రమాదకారి అవుతుంది. అనగా నెహ్రూ వారికి ఒక శాశ్వత శత్రువు. జీవించి ఉన్నా మరణించినా కూడా. అందువల్లనే ఆయన పేరును రూపుమాపేందుకు పరివార్ ప్రయత్నిస్తున్నది.

అయితే వారికి అర్థంకానిది ఒకటున్నది. ప్రజలకు నెహ్రూ గుర్తుకు రాని విధంగా దేశ పరిస్థితులను సామాన్యుని అభివృద్ధిపరంగా, లౌకిక విధానాలపరంగా మార్చటం అందుకు తగిన మార్గం అవుతుంది గాని, కొత్త రాష్ట్రపతి నోటి వెంట నెహ్రూ పేరు రాకుండా జాగ్రత్తపడటం వల్ల కాదు. ఇటువంటి అపరిణత చేష్టలవల్ల తమ భయాలను వెల్లడి చేసుకోవటం మినహా జరిగేది ఏమీ ఉండదు. అంతే కాదు. సామాన్యుల అభివృద్ధి, లౌకిక వాద విషయాలలో తమ చర్యల వల్ల ప్రజలకు నెహ్రూ మరింతగా గుర్తుకు వచ్చేట్లు చేస్తున్నారు వారు.

ఇప్పుడు కాంగ్రెస్ మాట చెప్పుకుందాము. నెహ్రూ ఆశయాలకు నేటి కాంగ్రెస్ మాటలలో ఎట్లున్నా ఆచరణలో ఎంతకట్టుబడి ఉందో తెలిసిందే. ఆర్థిక సంస్కరణలను ప్రవేశపెట్టిన దశలో స్వయంగా వారే ఇక నెహ్రూ నీతికి కాలం చెల్లిందని ప్రకటించారు. ఆయన విధానాలనే తగు విధంగా సవరించి అనుసరిస్తున్నామని పైకి అన్నప్పటికీ అందులో నిజాయితీ లేదని అందరికీ అర్థమైంది. సంస్కరణల ఫలితాలు వికటించి ప్రజలు ఎదురు తిరగరాదని, అదే విధంగా పేదల ఓట్లు అవసరమని భావించి కొన్ని సంక్షేమ, ఉపాధి పథకాలనైతే చేపట్టారు గాని, ఆ విషయంలో వారికి నెహ్రూ మౌలిక దృక్పథంలో ఏకీభావం లేదు.

ఆయనకది సమాజంపట్ల నిబద్ధతకాగా, వీరికి ఒక రాజకీయ ఎత్తుగడ మాత్రమే. లౌకిక వాదం విషయంలో కాంగ్రెస్‌ను బిజెపితో సమానం చేయలేముగాని, అదే సమయంలో ఇప్పటి కాంగ్రెస్ నెహ్రూ ఆలోచనల కాంగ్రెస్ కాదు. మతం కార్డును ఇటు మైనారిటీతో, అటు అధిక సంఖ్యాక మతస్తులతో ఒక ఎత్తుగడగా ఉపయోగించుకోవటం సాక్షాత్తూ నెహ్రూ కుమార్తె ఇందిరా గాంధీతో మొదలై, ఆమె కుమారుడు రాజీవ్ గాంధీ హయాంలో కొనసాగింది. ఈ కపటపు వలయాల నుంచి ఆ పార్టీ నేటికీ బయటపడలేదు. ఈ వాస్తవాన్ని స్వయంగా అల్ప సంఖ్యాక వర్గాల వారు సుమారు పాతికేళ్ల క్రితం నుంచి అర్థం చేసుకుంటున్నారు.

నెహ్రూపట్ల కాంగ్రెస్ ప్రేమ ప్రకటనలు పైపై నటనలు మాత్రమే. బిజెపిని విమర్శించేందుకు అటువంటి నటనల ప్రేమ ఉపయోగపడుతుందన్నది వారి ఆశ. ఆ విధంగా నటించి సామాన్యులను తమ నిబద్ధత విషయమై మోసగించవచ్చునని అంచనా వేస్తున్నారు. నెహ్రూను ఆచరించకుండా, ఆయనను తన విమర్శకులైన పరివార్ సంస్థ నుంచి కాపాడుగలరా? ఆ విమర్శలు నిజాయితీలేనివి, సామాన్యులను భ్రమపెట్టేందుకు ఉద్దేశించినవి. నెహ్రూ సోషలిజమన్నా, సెక్యులరిజమన్నా కాంగ్రెస్‌కు కూడా భయమే.

ఆ రెండు తాము పెదవుల చివరి నుంచి మాట్లాడగలవే తప్ప ఆచరించగలవి కాదు. ఇందులో గమనించదగినది మరొకటి ఉంది. కొంత కాలంగా వేగంగా క్షీణిస్తున్న కాంగ్రెస్ పార్టీకి పూర్తిగా కాకున్నా గణనీయమైనమేర తిరిగి నెహ్రూ వాదం వైపు మళ్లటమే తరుణోపాయం కాగలదనే సూచనలు వెలువడుతున్నాయి శ్రేయోభిలాషుల నుంచి. కాని పార్టీ నాయకత్వం అందుకు సిద్ధంగా లేదు. ఈ సరిగా స్వయంగా పార్టీ నాయక శ్రేణుల ప్రయోజనాలు మారటం అందుకు కారణం. కనుక వారికి నెహ్రూ సరిపడే వ్యక్తి కాదు. ఉపయోగపడినంత మేర ఉపయోగించుకుంటారంతే.

ప్రజా వేగుల పీకనొక్కకండి!

భారతదేశంలో గడిచిన మూడేళ్ల కాలంలో 15 మందికిపైగా ప్రజావేగులు (విజిల్ – బౌలర్స్) హత్య చేయబడ్డారు. పార్లమెంటు 2014 లోనే విజిల్ – బౌలర్స్ రక్షణ (డబ్ల్యుబిపి) చట్టాన్ని ఆమోదించింది. అయితే ఆ చట్టాన్ని అమలులోకి తేవటానికి ప్రభుత్వం మొండిగా తిరస్కరిస్తున్నందున వారి ప్రాణాలు కాపాడటానికి ఆ చట్టం సహాయపడలేదు. ఒక పబ్లిక్ సర్వెంట్‌కు వ్యతిరేకంగా అవినీతి, ఉద్దేశపూర్వకంగా అధికార దుర్వినియోగం లేదా క్రిమినల్ నేరానికి పాల్పడటం వంటి ఆరోపణలను సంబంధిత అధికారుల దృష్టికి తెచ్చిన వారికి రక్షణ కల్పించటానికి ఆ చట్టం ఉద్దేశించబడింది.

విజిల్– బౌలర్స్ అంటే ఎవరు అని నిర్వచించటంలో, తమ విధుల నిర్వహణ క్రమంలో తమ దృష్టికి వచ్చిన అవినీతిని బహిర్గతం చేసే ప్రభుత్వోద్యోగులను మించి చట్టం ముందు కెళ్లటం గమనించాల్సిన విషయం. ఎవరైనా వ్యక్తి లేదా ప్రభుత్వేతర సంస్థ కూడా చేర్చబడినాయి. అటువంటి ప్రగతిశీల విస్తరణ ప్రాముఖ్యతను గ్రహించటానికి ఒక విషయాన్ని గుర్తు చేసుకోవాలి. సమాచార హక్కు చట్టం (ఆర్‌టిఐ) కింద పొందిన సమాచారం ప్రాతిపదికగా ప్రభుత్వంలో అవినీతిని బట్టబయలు చేసిన 65 మందికిపైగా గత కొద్ది సంవత్సరాల్లో హత్య చేయబడ్డారు. ప్రభుత్వాధికారుల నుంచి సమాచారం పొందేందుకు సామాన్య మానవునికి అధికార మిచ్చింది ఆర్‌టిఐ చట్టం. గతంలో ప్రభుత్వ అధికారులకే ఆ సమాచారం తెలిసేది. ఆర్‌టిఐ చట్టం ప్రతి పౌరుణ్ణి విజిల్ – బౌలర్ చేసింది.

విజిల్ – బౌలర్ కోరినట్లయితే అతని గుర్తింపును రహస్యంగా ఉంచే నిబంధనలు డబ్ల్యుబిపి చట్టంలో ఉన్నాయి. 2003లో సత్యేంద్ర కె. దూబే హత్య వంటి కేసుల దృష్ట్యా అటువంటి చట్టం కొరకు డిమాండ్ వచ్చింది. గయలో నేషనల్ హైవేస్ అథారిటీ ఆఫ్ ఇండియాలో మేనేజర్‌గా పని చేస్తుండిన దూబే ప్రధానమంత్రికి రాసిన లేఖలో ఎన్‌హెచ్ఎఐలో అవినీతి పద్ధతులను ఎత్తి చూపాడు. తన గుర్తింపును (తానెవరనేది) గోప్యంగా ఉంచాలని ప్రత్యేకంగా కోరాడు. అయితే సమాచారం లీకు అయింది. అది అతని హత్యకు దారి తీసింది.

ఫిర్యాదుదారుపై లేదా దర్యాప్తులో సహాయపడే ఏ ఇతర వ్యక్తిపై కక్ష సాధింపుకు వ్యతిరేకంగా చట్టం రక్షణ కల్పించటం ప్రత్యేకించి గమనించదగింది. విజిల్ బౌలర్లు సాధారణంగా సస్పెన్షన్, ప్రమోషన్ నిలుపుదల, హింస, దాడుల హెచ్చరికల వంటి వివిధ రూపాల్లో కక్ష సాధింపు చర్యలకు గురవుతుంటారు. కావున ఈ రక్షణ విజిల్ – బౌలర్లకు ఎంతో ముఖ్యమైంది. వారికి రక్షణ కల్పించే అధికారాన్ని అర్హత గల అధికారులకు చట్టం ఇచ్చింది. పోలీస్ రక్షణ, కక్ష సాధింపుకు పాల్పడిన వారిని శిక్షించటం వంటి చర్యలు అందులో ఉన్నాయి. బెదిరింపులకు గురైన రాం ఠాకూర్, నందీసింగ్, అమిత్ జెట్వా పోలీసు రక్షణ కోరినా నిరర్థకమైంది. వారు హత్య చేయబడినారు.

డబ్ల్యుబిపి చట్టాన్ని అమలులోకి తెచ్చేబదులు భారతీయ జనతా పార్టీ ప్రభుత్వం చట్టాన్ని ప్రాథమికంగా నీరుగారుస్తూ ఒక సవరణ బిల్లును 2015లో పార్లమెంటులో ప్రవేశపెట్టింది. సంబంధిత వ్యక్తులు, సంస్థలతో సంప్రదించే ప్రక్రియను కూడా పాటించలేదు.

డబ్ల్యు బిపి చట్టం కింద వెల్లడి చేసిన విషయాలకుగాను నిరంకుశమైన అధికార రహస్యాల చట్టం (ఒఎస్ఎ) కింద కేసు పెట్టటం నుంచి విజల్ – బౌలర్స్‌కున్న రక్షణను తొలగించాలని సవరణ బిల్లు కోరుతున్నది. ఒఎస్ఎ కింద నేరాలు రుజువైతే 14 సంవత్సరాల వరకు ఖైదుతో శిక్షించవచ్చు. అటువంటి కఠినమైన శిక్షలు విధించే ప్రమాదం నిజాయితీపరులైన విజిల్– బౌలర్లను సైతం నిరోధిస్తుంది. తప్పుడు పనుల గూర్చి ఫిర్యాదు చేయటాన్ని ప్రోత్సహించటం డబ్ల్యు బిపి చట్టం ప్రాథమిక ప్రయోజనం. తమ ఫిర్యాదుల్లో భాగంగా సమాచారాన్ని వెల్లడించినందుకు విజిల్ బౌలర్లను ప్రాసిక్యూట్ చేయటం, ఒఎస్ఎ నుంచి రక్షణ మంజూరు చేయకపోవటం చట్టం మౌలిక ప్రయోజనాన్ని దెబ్బ తీస్తుంది.

అంతేగాక, ఆర్‌టిఐ చట్టానికి అనుగుణంగా డబ్ల్యుబిపి చట్టాన్ని మార్పు చేసేందుకై తెచ్చినట్లు చెబుతున్న సవరణ బిల్లు, విజిల్ బౌలర్స్ ఫిర్యాదుల్లో దేశ సార్వభౌమత్వం, సమగ్రత, భద్రత లేదా రాజ్య ఆర్థిక ప్రయోజనాలకు చేటు చేసే అంశాలున్నట్లయితే వాటిని దర్యాప్తు చేయరాదని చెబుతోంది. అంతేగాక, కొన్ని కేటగిరీల సమాచారం, అది ఆర్‌టిఐ చట్టం కింద పొందినదైతే తప్ప, అది విజిల్ బౌలర్స్ వెల్లడి చేసే సమాచారంలో భాగం కారాదని చెబుతోంది. మూడవ పక్షం పోటీ స్థితికి చేటు కలిగించే వాణిజ్య ఆత్మవిశ్వాసం, వాణిజ్య రహస్యాలు, ధర్మకర్తృత్వ స్థాయిలో కలిగి ఉండే సమాచారం కూడా ఈ నిషేధం కిందకు వస్తుంది. పౌరులకు వెల్లడించరాని సమాచారంగా ఆర్‌టిఐ చట్టం సెక్షన్ 8 (1) కింద పొందు పరిచినదానికి అనుగుణంగా ఈ మినహాయింపులు తయారు చేశారు.

రెండు చట్టాలు, వేర్వేలు లక్ష్యాలు

రెండు చట్టాలు (ఆర్‌టిఐ, డబ్ల్యుబిపి) పూర్తిగా భిన్నమైన లక్ష్యాలు గలవనే వాస్తవాన్ని సవరణలు విస్మరిస్తున్నాయి. ప్రజలకు సమాచారాన్నివ్వాలని ఆర్‌టిఐ చట్టం కోరుతున్నది. కాగా, అవినీతి ఆరోపణలపై దర్యాప్తుకు వీలు కల్పించేందుకు ప్రభుత్వం లోపల నిర్దేశిత అధికారులకు రహస్య సమాచారాన్ని అందజేసే మెకానిజం ఏర్పాటును, విజిల్ –బౌలర్స్‌కు రక్షణ కల్పించటాన్ని డబ్ల్యు బిపి చట్టం ఉద్దేశించింది.

రెండు చట్టాలను ఏకీకరణ చేయటం బేసబబైన విషయం. అనేక సందర్భాల్లో నిజాయితీపరులైన విజిల్ బౌలర్సును ఇది నిరోధిస్తుంది. ఉదాహరణకు, తమ రోజువారీ పనులు నిర్వహణ క్రమంలో, తప్పుడు పనులు గూర్చిన సమాచారం తటస్థపడిన ప్రభుత్వోద్యోగుల మాటేమిటి? సంబంధిత సమాచారం పొందటానికి వారికి ఆర్‌టిఐ చట్టం అవసరం లేదు. అణుశక్తి వసతులు లేదా సున్నితమైన ఆర్మీ పోస్టుల్లో అవినీతిని బహిర్గతం చేసే ఫిర్యాదులను – జాతీయ భద్రతకు సంబంధించిన సమాచారం వాటిలో ఉందనే కారణాన వాటిపై దర్యాప్తు చేయనవసరం లేదా? అటువంటి తప్పుడు పనులు బహిర్గతమైతే అనువైన చర్య తీసుకునే వీలు కలుగుతుంది. అది దేశానికి మేలు చేస్తుంది.

జాతీయ భద్రత, సమగ్రతకు సంబంధించిన సున్నితమైన సమాచారం బయటకు పొక్కకుండా నిరోధించటమే ఉద్దేశమైతే, మొత్తంగా మినహాయింపులు విధించే బదులు ప్రభుత్వం అదనపు రక్షణలు ప్రతిపాదించవచ్చు. అటువంటి ఫిర్యాదులు చేసేవారు వారి వద్దనున్న సమాచారాన్ని సీల్డు కవరులో సంబంధిత అధికారులకు అందజేయాలని నిర్దేశించవచ్చు.

ఈ తిరోగమన సవరణలపట్ల వ్యక్తమైన ఆందోళనలను త్రోసివేసి, హడావిడిగా లోక్‌సభలో బిల్లు ఆమోదింపచేశారు. సవరించిన బిల్లు ప్రస్తుత సమావేశాల్లో రాజ్యసభ ముందుకు రానుంది. చట్టాన్ని ప్రాథమికంగా నీరుగార్చుతున్నటువంటి సవరణలను పునఃపరిశీలించేందుకు, ప్రజలతో సంప్రదింపులకు అవకాశం కల్పించేందుకుగాను ఈ బిల్లును ఎగువ సభ సెలెక్ట్ కమిటీకి పంపటం తప్పనిసరి.డబ్ల్యుబిపి చట్టాన్ని అమలులోకి తీసుకురాకపోవటానికి సమర్థించదగిన కారణమంటూ లేదు. తప్పుడు పనులను బట్టబయటు చేసి ప్రాణ భయంతో ఉన్న వారికి రక్షణ ఇచ్చే నిమిత్తం తక్షణమే రూల్సు జారీ చేసి చట్టాన్ని అమలులోకి తేవాలి.

* అంజలి భరద్వాజ్
* అమితా జోహ్రీ

(రచయిత్రులు నేషనల్ క్యాంపెయిన్ ఫర్ పీపుల్స్ రైట్ టు ఇన్ఫర్మేషన్ (ఎన్‌సిపిఆర్ఐ) సభ్యులు)



మధ్యతరగతికి కుటుంబానికి చెందిన ఆ అమ్మాయి చదువులో అంతంత మాత్రమే.. అత్తెసరు మార్కులతో చదువుకోవడం ఇష్టం లేదు...ఎలా తప్పించుకోవాలా అని తెగ ఆలోచించిది. ఇష్టంలేకపోయినా ఫెన్సింగ్ (ఖడ్గ యుద్ధం) ఆట నేర్చుకుంది. అదే ఆమె జీవితాన్ని మలుపులు తిప్పింది. అంతటితో ఊరుకోకుండా దాంట్లో నైపుణ్యం సంపాదించి, భారతదేశానికే గర్వకారణంగా నిలిచిన భవానీ దేవి యువతకు స్ఫూర్తిగా నిలిచింది...

బంగారాన్ని తెచ్చిన భవానీ ఖడ్గం



ప్రస్తుతం ఇంటర్నేషనల్ ఫెన్సింగ్ ఫెడరేషన్ (ఎఫ్ఐఇ) (మహిళా విభాగంలో)లో 36వ ర్యాంకును సంపాదించుకుంది. అప్పటి వరకు టాప్ 50 వరకు భారతీయులెవరూ ఈ లిస్టులో లేరు. ఈ ఏడాది మే నెలలో ఐస్‌లాండ్‌లో జరిగిన సబర్ ఈవెంట్ టూర్నోయ్ సెటిలైట్ ఫెన్సింగ్ చాంపియన్‌షిప్ పోటీలో గ్రేట్‌బ్రిటన్‌కు చెందిన సారాజేన్ హాంప్సన్‌ను ఓడించింది. దీంతో ఈ ఆట ఏంటో అందరికీ తెలిసింది. భవానీ ఈ ఆట విలువను మన దేశానికి భవానీ ద్వారా సుపరిచితమైంది.

అది 2003 వ సంవత్సరం చివరి రోజులు. ఉత్తర చెన్నైలోని ఓ స్కూల్లో పూజారి కూతురైన భవానీ దేవి ఆరో తరగతి చదువుతుంది. ఫైనల్ పరీక్ష ఫలితాలు విడుదల అయ్యాయి. పాసో, ఫెయిలో అని భయపడుతూ ముడుచుకుపోయింది భవానీ. తనకొచ్చే మార్కుల గురించి బాగా తెలుసు. అంతే తరగతి గదిలోంచి బయటకు వచ్చేసింది. ఆవరణలో ఓ నోటీస్ బోర్డ్‌పై ఓ నోటీస్ కనిపించింది. ఆ ఏడాది నుంచే స్కూలు యాజమాన్యం జిమ్నాస్టిక్, స్క్వాష్, ఫెన్సింగ్‌లాంటి కొత్త ఆటలను ప్రవేశపెట్టింది. వీటికి విద్యార్థుల పేర్లు నమోదు చేసుకోవాలనేది దాని సారాంశం. జిమ్నాస్టిక్, స్క్వాష్‌లో పేరు ఇద్దామనుకుంటే ఖాళీలు లేవన్నారు. చేసేదేంలేక ఫెన్సింగ్‌లో చేరింది. చదువు నుంచి తప్పించుకోవడానికి ఏ ఆటైతే ఏం అనుకుంది. 14 ఏళ్ల క్రితం తీసుకున్న ఆ నిర్ణయం ఆమె జీవితాన్నే మార్చేసింది. ఈ రోజు ప్రపంచ స్థాయిలో ఫెన్సింగ్ క్రీడలో బంగారు పతకాన్ని సంపాదించుకున్న మొదటి భారతీయ క్రీడాకారిణిగా గుర్తింపు పొందింది.



కోచ్ మెప్పు పొందింది : చెన్నైకు చెందిన భవానీ తండ్రి సి. ఆనంద సుందరరామన్ పూజారి. తల్లి గృహిణి. సాధారణ మధ్యతరగతికి చెందిన కుటుంబం. నలుగురు ఆడపిల్లల్లో చివరిది భవానీదేవి. వీరి కుటుంబంలో ఎవరికీ క్రీడలపై ఆసక్తిలేదు. ఫెన్సింగ్ కెరీర్ వెనుక నా తల్లి ప్రోత్సాహం ఎంతో ఉంది అంటుంది భవానీ. 2007 నుంచి అమరావతిలో ఆమెను చూసిన కోచ్ లగూ.. కేరళలోని తలాస్సేరీలోని స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా ట్రైనింగ్ సెంటర్‌లో భవానీకి ఫెన్సింగ్ విద్యలోని మెళకువలను నేర్పాడు. మొదటిసారి జరిగిన క్రీడా పోటీలో ఓడిపోయినా ఆమె ఆట ఆడే తీరును మెచ్చుకున్నాడు . 2008లో జరిగిన క్రీడలో 17ఏళ్ల సాబోర్లోపై గెలిచి జాతీయ స్థాయిలో బంగార పతాకాన్ని సంపాదించుకుంది.

మాజీ సీఎం జయలలిత మద్దతు : దురదృష్టమేమంటే ఇండియాలో ఫెన్సింగ్ క్రీడకు నిధులు చాలా తక్కువ. భవానీ తల్లి స్పాన్సర్ల కోసం చాలా ఇబ్బందులు పడ్డారు. ఎన్‌జివోలు, కార్పొరేట్ల సాయంతో ఆమె శిక్షణకు, ఆట జరిగే ప్రాంతానికి వెళ్లడానికి ప్రయాణ ఖర్చులను తెచ్చుకునేవారు. ప్రస్తుతం భవానీకి గోస్పోర్ట్స్ ఫౌండేషన్ మద్దతునిస్తుంది. తమిళనాడు మాజీ ముఖ్యమంత్రి జయలలిత మద్దతు ఆమెకు లభించింది. 2008లో కొరియాలో సీనియర్ ఆసియా చాంపియన్‌షిప్ కోసం వెళ్లాలనుకున్న భవానీ అప్పటి తమిళనాడు సీఎం జయలలితను కలిసింది. ఆర్థిక సాయాన్ని పొందింది. జయలలిత మేడం రుణం ఎప్పటికీ మర్చిపోనంటూ గుర్తు చేసుకుంటోంది భవానీ. మేడం వల్లే మిషన్ ఒలింపిక్స్ ఎలైట్ అథ్లెట్ పథకంలో చేరానంటుంది.

అనేక పతకాలు, అవార్డులు : ఇటలీ కోచ్ నికోలా జొనాటీ శిక్షణలో 2009లో మలేషియాలోని జూనియర్ కామన్‌వెల్త్ ఛాంపియన్‌షిప్ సబెర్ జట్టు పోటీలో మొదటిసారిగా అంతర్జాతీయ పతకాన్ని, ఒక కాంస్య పతకాన్ని గెలుచుకుంది. తర్వాత సంవత్సరంలో సీనియర్ జాతీయ ఓపెన్ ఛాంపియన్‌షిప్ పోటీలో కాంస్య పతకాన్ని గెలుచుకుంది. 2012లో జూనియర్ కామన్‌వెల్త్ ఛాంపియన్‌షిప్ పోటీలో వ్యక్తిగతంగా ఒక కాంస్యం, జట్టుకు సంబంధించి రజత పతకాన్ని సాధించింది. 2014, 15లో అండర్ 23 యూత్ ఆసియా చాంపియన్‌షిప్ వెండి పతకాన్ని సాధించింది. 2015లో బెల్జియంలో ఫ్లెమిష్ ఓపెన్లో కాంస్య పతకాన్ని గెలిచింది.

"ఫెన్సింగ్ అనేది ఖరీదైన క్రీడ. క్రీడకు కావాల్సిన ఉపకరణాల కొనుగోలుకు లక్ష వరకు అవుతుంది. బయట ప్రాంతాల్లో క్రీడలకు వెళ్లాల్సివచ్చినపుడు ప్రయాణ ఖర్చులు ఉంటాయి. ఉదాహరణకు ఐరోపా వెళ్లి, ఆట ఆడి వస్తే, మళ్లా వేరే చోటకు వెళ్లాలంటే నిధులు సంపాదించుకోవడనికి మూడు నాలుగు నెలలు విరామం తీసుకోవాల్సి వస్తుంది. అప్పట్లో నేను చాలా టోర్నమెంట్లను మిస్ అయ్యాను. ఆర్థిక బాధల వల్ల కోల్పోయాను" అంటూ గతాన్ని గుర్తుచేసుకుంటారామె. ప్రస్తుతం తనకు తమిళనాడు ప్రభుత్వం ఎటువంటి సాయం చేయడం లేదని విచారం వ్యక్తంచేస్తుంది భవానీ. టోక్యో ఒలెంపిక్స్ 2020 కోసం సిద్ధమవుతోంది. ఆమె కల నెరవేరాలని కోరుకుందాం.

ఏడేళ్లు కనబడకుంటే సజీవంగా లేనట్లే ..!

సమస్య : నేను ప్రస్తుతం డిగ్రీ మొదటి సంవత్సరం చదువుతున్నాను. నేను మా అక్క (సరిత) సమస్య గురించి రాస్తున్నాను. మా తల్లిదండ్రులకు మేమిద్దరం ఆడపిల్లలం. మా నాన్న వాచ్‌మెన్‌గా, మా అమ్మ కూరగాయల దుకాణంలో పనిచేస్తుంది. మాది పేద కుటుంబం. మా అమ్మకి ఒక తమ్ముడు (మావయ్య) వున్నాడు. తను లారీ డ్రైవర్. మా అమ్మకి తల్లి, తండ్రి ఇద్దరూ చనిపోయారు. అమ్మ మావయ్యని పెంచింది. మా నాన్న మేము హైస్కూల్ చదువుతున్నప్పుడు కరెంట్ షాక్ కొట్టి చనిపోయాడు. మా మావయ్య రోజూ తాగి వచ్చి గొడవలు చేస్తున్నాడు. అక్కనిచ్చి తనకి పెళ్లి చేయకపోతే చంపేస్తానని అమ్మని బెదిరిస్తే అమ్మ (అక్కకి 16 సంవత్సరాలు), మావయ్యకు 28 సంవత్సరాలు. 2008లో పెళ్లి చేసేసింది. అక్కని, అమ్మని కొట్టడం రోజూ తాగి ఇంటికిరావడం. ఇలా ఆరు నెలలు గడిచింది. ఒకరోజు మావయ్య లారీ ప్రమాదం చేశాడని తెల్సింది. పోలీసులు కూడా విచారణకి వచ్చి అడిగి వెళ్లారు. తర్వాత మావయ్య జాడ తెలియలేదు. పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు ఇచ్చాం అప్పుడే. అక్కని ప్రేమించానని, పెళ్లి చేసుకుంటా నని మాకు తెలిసిన (మురళి) అనే వ్యక్తి అడుగుతున్నాడు. పెళ్లి చేస్తే ఏమన్నా సమస్య వస్తుందా?

– అనిత, కామారెడ్డి

సలహా : అనితా నీవు మీ అక్క గురించి రాసిన ఉత్తరం చదివాకా, మీ అక్క పరిస్థితి నాకు అర్థమైంది. ఆమె తొందరపడి 16 సంవత్సరాల అమ్మాయికి బాల్యవివాహం చేసి చాలా పెద్ద తప్పు చేసింది. బాల్య వివాహాల నిరోధక చట్టం 1929లో పెట్టడం జరిగింది. సెక్షన్ 3&4 ప్రకారం వధువుకి 18 సంవత్సరాలు, వరుడికి 21 సంవత్సరాలు నిండి వుండాలి. లేనిచో ఎవరు ఈ వివాహాలు జరిపినా (తల్లిదండ్రులు) శిక్షార్హులే. మీ బావ తాగి మిమ్మల్ని బాధించడం, యాక్సిడెంట్ చేసి కనపడకుండా ఎటో వెళ్లిపోవడం, అసలు ఏమయ్యాడే 2008 నుండీ మీకు ఏ సమాచారం లేదని రాశావు పి.ఎస్.లో ఫిర్యాదు ఇచ్చినా ఏమీ తెలియలేదన్నావు. ఈ విధంగా ఏడు సంవత్సరాలపైన ఒక వ్యక్తి అసలు కనపడకుండా, ఏ సమాచారం లేకుండా వున్నచో చట్టం దృష్టిలో అతడు మరణించినట్లుగా పరిగణిస్తుంది. హిందూ వివాహచట్టం 1955 సెక్షన్ 13(1)(7) కింద ఈ విధంగా భర్త జాడలేదని రుజువు చేసుకున్నట్లైతే అతనితో జరిగిన వివాహం రద్దైనట్లు డిక్రీ పొందవచ్చు. సాక్ష్య చట్టం సెక్షన్ 108 ప్రకారం ఏడు సంవత్సరాలు లేదా అంతకుమించి కనపడనిచో సజీవంగా లేనట్లే భావిస్తారు. మీ అక్కను ఒక మంచి మనసున్న వ్యక్తి పెళ్లి చేసుకోవడానికి సిద్ధంగా వున్నాడని రాశావు. పైన చెప్పిన చట్టం ప్రకారం (మొదటి) వివాహాన్ని రద్దు చేసుకుని కొత్త జీవితాన్ని ప్రారంభించడంలో తప్పులేదు.

ఫిర్యాదు చేస్తే కచ్చితంగా చర్యలు తీసుకుంటారు

సమస్య : నాకు ప్రస్తుతం 46 సంవత్సరాలు. మా పెళ్లైన కొత్తలో నా భర్త నాతో చాలా ప్రేమగా ఉండేవారు. తర్వాత సంతానం కలగకపోవడంతో, అందరి మాటలు విని, ఆయన నన్ను నిర్లక్ష్యం చేయడం మొదలుపెట్టారు. నేను అయినా భరిస్తూనే, తనే నా లోకమనుకుని బతుకుతున్నాను. కానీ, ఆయన రెండవ పెళ్లి చేసేసుకున్నారు. అయినా నేను ఆయన్ని విడిచిపెట్టడం ఇష్టంలేక ఆయన మీద కేసు కూడా ఏమీ పెట్టలేదు. మా పుట్టింటి వాళ్ళు ఎంత చెప్పినా నేను వినలేదు ఇప్పుడు రెండవ భార్యకు ఇద్దరు పిల్లలు పుట్టారు. ఒక పాప, ఒక బాబు. మా ఆయన వాళ్లే తన వారసులని, అప్పటినుండీ నన్ను అసలు చూడడం మానేశారు. మేమంతా ఒకే ఇంట్లో వుంటున్నాము. మా ఆయన సెంట్రల్ గవర్నమెంట్ ఉద్యోగి. రెండు ఇళ్ళు (సొంతవి) వున్నాయి. వాటిని కిరాయికి ఇచ్చి క్వార్టర్స్‌లో వుంటున్నాము. నాకు నెలకు ఏమీ డబ్బు కూడా (ఖర్చులకి) ఇవ్వడం లేదు. కనీసం అనారోగ్యంగా వున్నా మందులకు కూడా డబ్బు లేవని నిర్ధాక్షిణ్యంగా చెప్పి వెళ్లిపోతున్నారు. నా పరిస్థితి నాకే అర్థంకాక జీవితం మీద విరక్తి కలుగుతుంది. మీతో చెప్పుకుంటే ఏమైనా పరిష్కారం లభిస్తుందని ఈ ఉత్తరం రాస్తున్నాను. పిల్లలు లేని నాకు ఏ హక్కులూ వుండవా? దయచేసి నాకు సలహా చెప్పండి.

– అన్నపూర్ణ, రాజేంద్రనగర్

సలహా : అన్నపూర్ణ గారూ! మీ ఉత్తరం చదివాకా చాలా బాధ కలిగింది. ఎంతో ప్రేమగా చూసినా మీ వారు మిమ్మల్ని నిర్లక్ష్యం చేసి, మరో పెళ్లి చేసేసుకున్నారని రాశారు. ఇది నిజంగా దారుణం. కేవలం పిల్లల కారణంతో రెండవ వివాహం చేసుకోవడం తగదని, పిల్లలు కావాలనుకునే వారు ఎవర్నైనా దత్తత తీసుకొని కూడా తమ లోటును తీర్చుకోవచ్చునని, ఒక కేసులో సుప్రీం కోర్టు కూడా చెప్పడం జరిగింది. ఆయన మీకు ద్రోహం చేసినా, మీరు ఆయన మీద ప్రేమతో కేసు పెట్టలేదు. మీరు బైగమీ 494 కింద కేసు పెట్టవచ్చు. మీ భర్తకు కనీసం ఆ విధంగానైనా అభిమానం లేదు. అయితే మీరు బాధపడుతూ కూర్చుంటే లాభం లేదు. మీ భర్త ఆస్తిలో మీకే వాటా వుంటుంది. అతని (రెండవ భార్యకు) వుండదు. అయితే పుట్టిన పిల్లలు కూడా వారసులు అవుతారు. మీరు ఖర్చులకు, మీ వైద్యానికి కూడా డబ్బు ఇవ్వడం లేదని రాశారు. ఆయన సెంట్రల్ గవర్నమెంట్ ఉద్యోగి అని రాశారు. ఆయన ఆఫీస్ చీఫ్ ఎవరైతే వున్నారో వారికి ఒక ఫిర్యాదు రాసి ఇవ్వండి. అప్పుడు ఆయన మీద కచ్చితంగా యాక్షన్ తీసుకుంటారు. అలాగే మీరు సెక్షన్ 125 సిఆర్‌పిసి కింద మెయింటనెన్స్ కేసు వేసుకుంటే నెలనెలా మీకు కచ్చితంగా మెయింటెనెన్స్ పొందవచ్చు. కనుక మీరు ఆలస్యం చేయకుండా పైన చెప్పిన విధంగా చట్టం ద్వారా న్యాయం పొందండి. బాధపడకండి.

ఎస్.బి.టి. సుందరి,
హైకోర్టు న్యాయవాది, ఫ్యామిలీ కౌన్సెలర్.

టేస్ట్‌కి ఫస్ట్ స్ట్రెంత్‌కి బెస్ట్

చక్కగా ఆరోగ్యంగా ఉండాలంటే మంచి తిండి ఉండాలి. తిండి పుష్టి ఉంటేనే బలంగా, ఆరోగ్యంగా ఉండగలుగుతాం. ఎవ్వరి సాయం అక్కర్లేకుండానే పనులు చేసుకోగలుగుతాం. తిండి అనగానే మనలో రెండు రకాల భావాలు చోటు చేసుకుంటాయి. ఇష్టంగా తినడం, ఏడుస్తూ బలవంతంగా తినడం. ఇష్టంగా తినాలంటే ఆహారం రుచికరంగా, చూడడానికి ఇంపుగా ఉండాలి. ఏడుస్తూ తినే తిండి బలాన్నిస్తుందికాని రుచీపచీ ఉండదు. రుచి బలం రెండూ కావాలంటే కొద్దిగా కష్టమే కాని ప్రయత్నిస్తే అసాధ్యం కాకపోవచ్చు. రుచిని, బలాన్ని అందిచగల ఏడు రకాల కూరగాయల గురించి ఆలోచిద్దాం.



రాడిష్ : రుచికి, బలానికి రాడిష్ పెటింది పేరు. వీటిలో రకాలు ఉన్నాయి. అవి జూసిగానూ, పంజంట్‌గానూ ఉంటాయి. ర్యాడిష్‌ను స్లైస్‌లా కట్ చేసుకుని తింటే స్నాక్‌లా ఉపయోగపడుతుంది. కొంచెం ఓపిక ఉంటే సలాడ్‌చేసుకుని దాంట్లో వాడుకోవచ్చు. కొంచెం బిట్టర్‌గా ఉన్నా చీజ్, తేనె, ఆలివ్ ఆయిల్ కలిపి వాడితే దానికి ఉండే పంజంట్ గుణం పోతుంది. తినడానికి ఎంతో బాగుంటుంది. రాడిష్‌లో ఫైబర్ ఎక్కువగా, కాలరీలు తక్కువగా ఉంటాయి.

కీరా : కీరాలు అనేక రకాలుగా ఈటర్ ఫ్రెండ్లీగా ఉంటుంది. దీన్ని కట్‌చేసి వండుకుని కూరలో, పచ్చళ్ళో చేసుకు తినక్కర్లేదు. జస్ట్ కట్‌చేసుకుని పచ్చిగా తినేయొచ్చు. కాస్త ఉప్పు, కారం, తగిలించుకుని తింటే మహామజాగా ఉంటుంది. ఇవి లేకుండా తిన్నా కూడా బాగానే ఉంటుంది. ఇవి ఎప్పుడూ తాజాగా ఉంటాయి. తింటే తేలికగా అరుగుతాయి. అలాకాదు దేనితోనైనా కాంబినేషన్‌గా తినాలనుకున్నా కూడా బాగానే ఉంటుంది. టమాటాలు, పుచ్చకాయ వంటి వాటితో కలిపి తినవచ్చు. కీరాలు గొప్ప ఆరోగ్యవంతమైన కాయగూర అని సైంటిస్టులు నిగ్గు తేల్చి చెప్పారు. దీంట్లో పొటాసియం, విటమిన్‌కె, ఫ్లావనాయిడ్స్ ఉంటాయి. ఇవి గొప్ప శక్తిదాయినులు. వాపులు రాకుండా అరికట్టగల సుగుణాలు కీరాలో ఉంటాయి. కొని రకాల క్యాన్సర్‌లను, కొన్ని రకాల హృద్రోగాలను రాకుండా నివారిస్తుంది.



క్యారెట్లు : కీరాలలాగే క్యారెట్లు కూడా ఎవర్ ఫ్రెష్ వెజిటబుల్. వంటతో సంబంధంలేకుండానే కొరుక్కుతినేయొచ్చు. క్రంచీ, జూసీ, స్వీట్ వెజిటబుల్ క్యారెట్. కొబ్బరిని కోరినట్టుగా క్యారెట్‌ను కోరి దాన్లో కొత్తిమీర, కొన్ని నిమ్మకాయ రసం కొద్దిగ, చిటికెడు ఉప్పు, మొలకెత్తిన పెసలతో కలిపి తింటే మహామోతగా ఉంటుంది. కారంగా కావాలనుకునే వారు కొన్ని పచ్చిమిరపకాయ ముక్కలు కలుపుకోవచ్చు. క్యారెట్లలో విటమిన్‌బి, విటమిన్‌సి, విటమిన్ డి, బీటా కెరొటెనెన్, ఓలిక్ యాసిడ్, పొటాసియం, మాంగనీస్, ఫైబర్ వంటివి ఎన్నో ఉన్నాయి. జీర్ణకోశాన్ని నీట్‌గా క్లీన్ చేయడంలో, మలబద్ధకాన్ని వదలగొట్టడంలో కీరాలలాగే క్యారెట్లు కూడా ఎంతగానో ఉపయోగపడతాయి.

క్యాప్సికామ్ : ఇవి పైకి నిండుగా, గుండుగా కనిపించినా లోపల అంత డొల్లే! ఎంతో క్రిస్పీగా ఉండే వీటిని కూడా పచ్చిగా కాని ఉడికించుకుని కూరలా కాని తీసుకోవచ్చు. వీటిని సలాడ్స్‌లో కాని, స్టఫ్డ్ ఫుడ్ ఐటంగాగానీ, బేక్డ్ ఐటంగా కానీ వాడుకోవచ్చు. ఇవి రకరకాల రంగుల్లో దొరుకుతాయి. రంగును బట్టి దాని రుచి కూడా మారుతుంది. పచ్చ క్యాప్సీ చిరుచేదుతో, కూల్‌గా ఉంటుంది. ఎర్రరంగులో ఉండేది తియ్యగా ఉంటుంది. పచ్చకాయే కాస్త పక్వానికి వచ్చేసరికి పసుపు పచ్చ రంగులోకి మారుతుంది. దాన్నుంచి ఎరుపు రంగులోకి మారుతుంది. వీటిలో విటమిన్‌సి, ఫైబర్ పుష్కలంగా ఉంటుంది. వీటిలో పొటాసియం, మాగ్నీషియం కూడా ఉంటాయి. ఆనందంగా తినడానికి బాగుంటాయి.

క్యాబేజీలు : తరుచు కడుపు చెడిపోయేవారు తప్పక తినవలసిన ఆహారం క్యాబేజీ! దీన్ని తినడం వల్ల కడుపులో గ్యాస్ ఫాం కాదు. తేన్పులు కూడా రావు. దీన్నికూడా పచ్చిగా తినే వారున్నారు. కానీ చాలా మంది ఉడికించుకుని తినడానికే మొగ్గుచూపుతారు. ఇది ఉడుకుంతుంటే ఒక విధమైన వాసన వస్తుంది. ఆ వాసన నచ్చినవారికి తెగనచ్చుతుంది. నచ్చని వారికి అస్సలే నచ్చదు. దీన్ని ఎలా ఉన్నా గ్యాస్ బాధ నుంచి విముక్తిని కలిగించడంలో ఇది ముందుంటుంది.

క్యాలీఫ్లవర్ : క్యాబేజీలాగే ఇది కూడా నచ్చిన వారికి తెగ నచ్చుతుంది. నచ్చని వారికి అంతగా నచ్చదు. దీన్లో సల్ఫర్ చాలా ఎక్కువగా ఉండడం వల్ల దీన్ని తరుగుతున్నప్పుడు గ్యాస్ వాసనలా అనిపిస్తుంది. ఈ వాసన కొందరికి కడుపులో తిప్పుతుంది. అందుకని ఇది యూనివర్శల్ వెజ్ కాలేకపోయింది. గ్యాసీగా ఉండే వాసనేకాదు అలెర్జిక్ రియాక్షన్స్‌ను కూడా ఇది తెచ్చిపెడుతుంది. అందువల్ల వాపులు రావడం, ఊపిరి సమస్యలు రావడం వంటివి కూడా జరగడానికి ఆస్కారం ఉంది. అయితే ఇలా అలెర్జీ ఫీలయ్యే వారి సంఖ్య తక్కువ.

టమాటాలు : పోషక విలువలు పుష్కలంగా ఉన్న కాయగూర టమాట. దీన్ని పచ్చిగా కాని, వండుకుని కాని తినవచ్చు. వంటలలో కూడా సోలోగా చేసే ఇగురుకూరగాకానీ, ఇతర కూరగాయలతో కాంబినేషన్‌లో కాని దీన్ని తినవచ్చు. పప్పుగా, పచ్చడిగా, రసంగా అనేక రకాలుగా దీన్ని తీసుకోవచ్చు. కాస్త తీపి, కాస్త పులుపు కలిగి ఒక తమాషా అయిన రుచిలో ఉంటుంది. టమాటాను తరిగి పచ్చి ముక్కలలో కొత్తిమీర, ఉప్పు, కారం చల్లుకుని అన్నంలోకి తీసుకోవచ్చు లేదా ఉత్తగా కూడా తినవచ్చు. కారంగా వద్దనుకునే వారు టమాట ముక్కలపై చక్కర చల్లుకుని సరదాగా తినవచ్చు. పిల్లలకు టమాట సాస్ అంటే ఎంతో ఇష్టం. టమాటా ఫ్లావర్‌తో చేసే స్నాక్స్ అంటే ఎగిరి తింటారు. టామాటా కెచప్ బ్రెడ్‌లోకి అద్భుతమైన కాబినేషణ్. టమా టాలో టమాటాలను ఉడకబెడితే ఐసోపెన్ అనే ఫైటో న్యూట్రియంట్ విడుదల అవుతుంది. దీని వల్ల క్యాన్సర్ వచ్చే అవకాశం బాగా తగ్గుతుంది. గుండెపోటును బాగా నియంత్రిస్తుంది. యాంటీ ఆక్సిడెంట్లను నిర్వీర్యం చేసి జీర్ణక్రియను మెరుగుపరచడానికి ఇది ఎంతగానో ఉపయోగపడుతుంది.





తుమ్మలకు అస్వస్థత: యశోద ఆస్పత్రిలో చేరిక



మన తెలంగాణ / హైదరాబాద్ : రోడ్లు భవనాల శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అస్వస్థతకు గురయ్యారు. అల్సర్ కారణంగా రక్త వాంతులు అవడంతో ఆయన్ను శుక్రవారం ఉదయం హుటాహుటిన ఫిలింనగర్‌లోని ఇంటి నుండి సోమాజిగూడ యశోద ఆస్పత్రికి తరలించారు. ప్రస్తుతం ఆయన అత్యవసర చికిత్స విభాగంలోనే వైద్య చికిత్సలను పొందుతున్నారు. తుమ్మలకు అందిస్తున్న చికిత్స కారణంగా ప్రస్తుతానికి రక్త వాంతులు ఆగాయని, ఎలాంటి ప్రాణాపాయం లేదని, ఆయనకు చికిత్స అందిస్తున్న వైద్యులు విడుదల చేసిన హెల్త్ బులిటెన్‌లో పేర్కొన్నారు.అయితే వాంతులు పూర్తిగా ఆగుతాయన్న భరోసా ఇప్పుడే కలగని కారణంగా మరో రెండు రోజులు అబ్జర్వేషన్ నిమిత్తం ఆస్పత్రిలోనే చికిత్స అందించాలని నిర్ణయించామన్నారు. తుమ్మల ఆస్పత్రిలో చేరిన విషయం తెలిసిన వెంటనే సాగునీటి పారుదల శాఖ మంత్రి టి. హరీశ్ రావు, ఎంఎల్‌సి పల్లా రాజేశ్వర్‌రెడ్డి, ఎంఎల్‌ఎ అరికెపూడి గాంధీ ప్రభృతులు ఆస్పత్రికి చేరుకుని ఆయన ఆరోగ్య పరిస్థితిని వాకబు చేశారు. మెరుగైన వైద్య చికిత్సలను అందించాలని ఈ సందర్భంగా వారు వైద్యులకు విజ్ఞప్తి చేశారు.

ఉన్నత పదవులలో కీలక పరిణామం

ఎంపీల భేటీలో ప్రధాని మోడీ



న్యూఢిల్లీ : రాష్ట్రపతి, ఉప రాష్ట్రపతి , ప్రధాని, స్పీకర్ అంతా ఒకే పార్టీకి, సంప్రదాయానికి చెందిన వారు కావడం దేశంలో కీలక మార్పులకు దారితీస్తుందని ప్రధాన మంత్రి మోడీ తెలిపారు. ఉప రాష్ట్రపతి ఎన్నికల సందర్భంగా శుక్రవారం ఆయన ఇక్కడ ఎన్‌డిఎ ఎంపీలతో మాట్లాడారు. ఎన్‌డిఎ అభ్యర్థి వెంకయ్యనాయుడుకు మద్దతు ఇస్తున్న ఇతర పార్టీల ఎంపీలు కూడా పాల్గొన్న ఈ సమావేశంలో మోడీ మాట్లాడుతూ ఇది ఒకే కుటుంబం ఒకే ఆలోచనా విధానంగా ఉంటుందని, దీనితో గణనీయమైన పరిణామాలు ఉంటాయని వచ్చే ఐదేళ్ల పాటు ఏక సిద్ధాంతాల వారు దేశంలో కీలకమైన రెండు పదవులలో ఉండటం వల్ల పలు మంచి మార్పులు చోటుచేసుకుంటాయని తెలిపారు. స్వాతంత్ర్యం తరువాత తొలిసారిగా ఈ విధమైన పరిణామం వచ్చిందని తెలిపారు. రాష్ట్రపతిగా ఎన్నికైన రామ్‌నాథ్ కోవింద్ దేశంలో రాష్ట్రపతి పదవిని అధిరోహించిన తొలి రైతుబిడ్డ అని, అత్యధిక మెజార్టీ ఉన్న వెంకయ్య ఉప రాష్ట్రపతి అయితే ఈ పదవి కూడా వ్యవసాయ కుటుంబం నుంచి వచ్చిన వారిదే అవుతుందని ప్రధాని తెలిపారు. ఎన్‌డిఎ, ఇతర ఎంపీలతో భేటీ సందర్భంగానే వెంకయ్య నాయుడు ప్రసంగాలతో కూడిన రెండు సంపుటాల పుస్తకం ఆవిష్కరణ జరిగింది.

ఉపరాష్ట్రపతి ఎన్నిక నేడు

(మొదటిపేజీ తరువాయి)

గోపాలకృష్ణ గాంధీ పోటీ చేస్తున్న సంగతి తెలిసిందే. ప్రస్తుత గణాంకాల ప్రకారం, లోక్‌సభలో అధికార ఎన్‌డిఎకి సంఖ్యా బలం మెండుగా ఉంది. అందువల్ల తదుపరి ఉప రాష్ట్రపతిగా వెంకయ్య ఎన్నిక లాంఛనమే అన్నది బహిరంగ రహస్యం. రాష్ట్రపతి ఎన్నికల్లో ఎన్‌డిఎ అభ్యర్థి రామ్‌నాథ్ కోవింద్‌కు మద్దతు పలికిన బిజెడి, జెడి (యు) ఈ ఎన్నికల్లో మాత్రం విపక్షాల అభ్యర్థి గోపాలకృష్ణకు జై కొట్టాలని నిర్ణయించుకున్నాయి. ప్రభుత్వ ఏర్పాటు కోసం జెడి (యు) బీహార్‌లోని మహాకూటమితో తెగదెంపులు చేసుకుని బిజెపితో చేతులు కలిపినప్పటికీ, ఈ ఎన్నికల్లో పశ్చిమబెంగాల్ మాజీ గవర్నరయిన గాంధీకి మద్దతివ్వాలని నిర్ణయించుకోవడం గమనార్హం. ప్రస్తుత ఉప రాష్ట్రపతి హమీద్ అన్సారీ పదవీకాలం ఈ నెల 10తో ముగియనుంది. పార్లమెంటు ఉభయసభల్లో సభ్యుల మొత్తం సంఖ్యా బలం 790. అయితే లోక్‌సభలో రెండు, రాజ్యసభలో ఒకటి ఖాళీలున్నాయి. బిజెపి లోక్‌సభ ఎంపి ఛేడి పాశ్వాన్‌పై న్యాయ విచారణ కొనసాగుతున్నందు వల్ల ఆయనకు ఓటు హక్కు లేదు. 545 మంది సభ్యులున్న లోక్‌సభలో బిజెపికి 281 మంది సభ్యులున్నారు. బిజెపి నేతృత్వంలోని ఎన్‌డిఎకి 338 మంది సభ్యుల బలముంది. ఇక, 243 మంది సభ్యులున్న రాజ్యసభలో, బిజెపి ప్రస్తుత బలం 56. 59 మంది సభ్యులతో కాంగ్రెస్ ఏకైక అతిపెద్ద పార్టీగా ఉంది.

టెట్ ఫలితాలు

(మొదటిపేజీ తరువాయి)

పేపర్2లో 2,30, 932 మంది పరీక్ష రాయగా, 45,055(19.51 శాతం) మంది అర్హత పొందారని తెలిపారు. పేపర్2(గణితం, సైన్స్)లో 1,11,018 మంది అభ్యర్థులకు 20,323(18.31 శాతం) మంది, సాంఘిక శాస్త్రంలో 1,19,914 మందికి 24,732(20.62 శాతం) ఉత్తీర్ణత సాధించారని అన్నారు. ఈ కార్యక్రమంలో టెట్ కన్వీనర్, ఎస్‌సిఇఆర్‌టి డైరెక్టర్ శేషుకుమారి తదితరులు పాల్గొన్నారు.

పేపర్1లో 74.24 శాతం ఉత్తీర్ణతతో రాజన్న సిరిసిల్ల జిల్లా ప్రథమ స్థానంలో నిలవగా, 47.90 శాతం ఉత్తీర్ణతతో భద్రాద్రి కొత్తగూడెం జిల్లా చివరి స్థానంలో నిలిచింది. అలాగే పేపర్2(మ్యాథమెటిక్స్ అండ్ సైన్స్)లో 24.91 శాతం ఉత్తీర్ణతతో భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రథమ స్థానంలో, 14.45 శాతం ఉత్తీర్ణతతో సిద్దిపేట జిల్లా చివరి స్థానంలో నిలిచింది. పేపర్2(సోషల్ స్టడీస్)లో 26.06 శాతం ఉత్తీర్ణతతో ప్రథమస్థానంలో, 17.15 శాతం ఉత్తీర్ణతతో మహబూబ్‌నగర్ జిల్లా చివరిస్థానంలో నిలిచింది.

నిరంకుశ పాలనకు చరమగీతం

మన తెలంగాణ/హైదరాబాద్/నల్లకుంట : తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి కెసిఆర్ నిరంకుశ పాలనకు ప్రజలు చరమగీతం పాడేరోజు దగ్గరలోనే ఉందని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం, విరసం నేత వరవర రావు, సిపిఐ నాయకులు బాలమల్లేష్‌లు అన్నారు. దుబ్బాక నియోజవర్గం తాళ్ళపల్లి గ్రామంలో పోలీసులు అరెస్ట్ చేసిన అరుణోదయ నాయకుడు యాదగిరి, రైతుకూలీ సంఘం నాయకుడు శ్రీనివాస్‌రెడ్డి వారితోపాటు మరో ఇద్దర్ని వెంటనే బేషరతుగా విడుదల చేయాలని డిమాండ్ చేశారు. కెసిఆర్ ప్రభుత్వం అన్ని రకాల మాఫియాలకు అనుకూలంగా వ్యవహరిస్తోందని, ఇసుక మాఫీయా, మైనింగ్ మాఫియా, హెల్త్ మాఫియా, ఎడ్యుకేషన్ మాఫియాలు రాష్ట్రాన్ని దోచుకుంటున్నారని వారికి ప్రభుత్వం అండదండలు ఉన్నాయని ఆరోపించారు. శుక్రవారం బాగ్‌లింగంపల్లి సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో అరుణోదయ విమలక్క, ప్రొఫెసర్ పిఎల్.విశ్వేశ్వర్‌రావు, పౌరహక్కుల సంఘం నాయకులు ప్రొఫెసర్ లక్ష్మణ్ తదితరులతో కలిసి వారు మాట్లాడారు. తెలంగాణ రాష్ట్ర వస్తే మన పాలన మనం చేసుకుని తమ సమస్యలు పరిష్కరించుకోవచ్చని భావించిన ప్రజలు ఉద్యమంలో త్యాగాలు చేసి రాష్ట్రం సాధించుకున్నారని పేర్కొన్నారు. వచ్చిన తెలంగాణ కెసిఆర్ నిరంకుశ, నియంతృత్వ పాలనలో మగ్గిపోతుందని, రాబోయే రోజులలో మరో పోరాటానికి ప్రజలు సన్నద్ధమవుతారని హెచ్చరించారు. నేరెళ్ళ ఘటనలో ఇసుక మాఫియా ఎందుకు దళితుల ఇండ్లపై పడి విపరీతంగా కొట్టి చిత్రహింసలు పెట్టి థర్డ్ డిగ్రీ ప్రయోగించారని ఆరోపించారు. ప్రభుత్వ దోపిడీ విధానాలను మానుకోవాలని చెప్పిన వారందరిని అక్రమ కేసులు బనాయించి హింసించి జైళ్లలో పెడుతున్నారని ధ్వజమెత్తారు. దుబ్బాక నియోజకవర్గం తాళ్ళపల్లి గ్రామంలో ఉమ్మడితోట కొందరు ఆక్రమించుకున్నారని ఈ విషయంలో ప్రశ్నించినందుకు గ్రామంలో సమావేశం నిర్వహించుకుని మాట్లాడుతున్న రైతుకూలీ సంఘం నాయకుడు శ్రీనివాస్‌రెడ్డి, అరుణోదయ నాయకులు యాదగిరి వారితో పాటు మరో ఇద్దరిని మఫ్టిలో వచ్చిన పోలీసులు తీసుకొనిపోయారని ఇంత వరకు వారి ఆచూకీ దొరకడం లేదని వారిని కూ డా పోలీసులు చిత్రహింసలకు గురి చేసి ఎన్‌కౌంటర్ చేస్తారేమోనని బాధిత కుటుంబాలు ఆందోళనకు గురవుతున్నాయని అన్నారు. నిబంధనల ప్రకా రం అరెస్ట్ చేసిన వారిని 24 గంటల్లో కోర్టులో హాజరుపరచాలని కాని వారు కోర్టుకు కూడా తీసుకుపోకుండా ఆచూకీ చెప్పకుండా వ్యవహరిస్తున్నారని వివరించారు. వారిని వెంటనే బేషరతుగా విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ప్రజల ప్రజాస్వామిక హక్కులను ప్రభుత్వం కాలరాస్తుందని ఇదేమిటని ప్రశ్నిస్తే నిరంకుశంగా అణిచివేస్తున్నారని అన్నారు. ఈ ప్రభుత్వానికి ప్రజలు గుణపాఠం చెప్పేరోజు దగ్గరలోనే ఉందన్నారు. ప్రభుత్వం స్పందించకుంటే రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమం చేపడతామని హెచ్చరించారు. ఈ విలేకరుల సమావేశంలో అరుణోదయ మోహన్, మాజీ మంత్రి రవీంద్రనాయక్, టిపిఎఫ్ అధ్యక్షులు నలమాస కృష్ణ పాల్గొన్నారు.

ప్రత్యామ్నాయం వైపు చూపు!

● తీవ్ర వర్షాభావ పరిస్థితుల నేపథ్యంలో వ్యవసాయశాఖ మల్లగుల్లాలు ● పంటల పరిస్థితిపై డిఎఓల నివేదికలు

మన తెలంగాణ/హైదరాబాద్ : రాష్ట్రంలో నెలకొన్న తీవ్ర వర్షాభావ పరిస్థితుల దృష్ట్యా వ్యవసాయ శాఖ ప్రత్యామ్నాయం వైపు చూస్తోంది. ఇందుకు అత్యవసరంగా జిల్లా వ్యవసాయ శాఖ అధికారులతో (డిఎఒ) ఆయా జిల్లాల్లోని పంటల పరిస్థితి ఎలా ఉందో తెలుసుకోవాలని నిర్ణయించింది. వరుణుడు కరుణించకపోవడంతో ఈ వానకాలంలో సాగు అవుతోన్న 81.37 లక్షల ఎకరాల్లోని పంటల పరిస్థితి ప్రశ్నార్థంగా మారింది. జూన్‌లో అన్నదాతను మురిపించిన వానలు ఇప్పుడు నిరాశ పరుస్తుండటంతో వేసిన పంటల ఎదుగుదలపై రైతులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. సరియైన సమయంలో వర్షం రాకపోవడంతో పంటలు ఎండిపోవడంతో పాటు, వాటికి పురుగు ఆశిస్తుండటంతో దిక్కుతోచని స్థితిలో అన్నదాతలు ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. వర్షాభావ పరిస్థితుల నేపథ్యంలో వ్యవసాయ శాఖ ఈ నెల 7వ తేదీన డిఎఒలు, వ్యవసాయ శాస్త్రవేత్తలతో అత్యవసర భేటీ నిర్వహించనుంది. డిఎఒలు వానకాలం పంటలపై ఇచ్చిన నివేదికల ఆధారంగా వ్యవసాయ శాస్త్రవేత్తల సూచనలు తీసుకోవడంతో పాటు, అవసరమైతే వెంటనే ప్రత్యామ్నాయ ప్రణాళికలు ప్రకటించినున్నట్లు వ్యవసాయ కార్యదర్శి సి. పార్థసారధి తెలిపారు. సిఎం కె. చంద్రశేఖర్‌రావు కూడా పంటల స్థితిపై ఎప్పటికప్పుడు అడిగి తెలుసుకుంటున్నట్లు తెలిసింది.

ఈ నెల జూన్ నుంచి కురిసిన వర్షాలతో పోలిస్తే సాధారణ వర్షానికి 12 శాతం లోటు ఉంది. రాష్ట్రంలోని 10 జిల్లాలలో లోటు వర్షపాతం (20 శాతం నుంచి 59 శాతంగా) ఉంది. ఇందులో వరిని కూడా వర్షాధారిత పంటగా పండించే ఆదిలాబాద్ జిల్లా కూడా ఉండటం గమనార్హం. ఇంకా 18 జిల్లాలలోనూ అదే పరిస్థితి ఉంది. ఈ జిల్లాలలో లెక్కల ప్రకారంగా సాధారణ వర్షపాతం నమోదైనట్లు ఉన్నప్పటికి, ఆ వర్షాలు జూన్‌లో కురిసినవే. మరో 4 జిల్లాల్లో అతి తక్కువ వర్షం కురిసినట్ల వాతావరణ నివేదికలు చెబుతున్నాయి.

వాస్తవానికి జూలై నెలలో అరకొర వర్షాలు పడినప్పటికీ సరియైన సమయంలో సరిగ్గా కురవలేదు. మొత్తం 584 మండలాల్లో కేవలం 95 మండలాల్లో మాత్రమే అధిక వర్షపాతం ఉంది. ఈ పరిస్థితులు డ్రైస్పెల్ (వర్షాల మధ్య తీవ్ర అంతరం) నమోదు దిశగా కనిపిస్తున్నాయని వ్యవసాయశాఖ ఉన్నతాధికారికి ఒకరు పేర్కొన్నారు. ఒక్క వానపైనే కోట్ల విలువచేసే పంటలు ఆధారపడి వున్నాయి.

లోటు వర్షపాతంలో ఉన్న జిల్లాలు (--20 శాతం నుంచి --59 శాతం)
ఆదిలాబాద్, కొమురంభీం, మంచిర్యాల్, నిర్మల్, నిజామాబాద్, జగిత్యాల్, పెద్దపల్లి, జయశంకర్, రాజన్నసిరిసిల్ల, మెదక్

సాధారణ వర్షపాతంలో ఉన్న జిల్లాలు (19 శాతం నుంచి -19 శాతం)
భద్రాద్రి, మహబూబాబాద్, వరంగల్ రూరల్, వరంగల్ అర్బన్, మహబూబ్‌నగర్, కరీంనగర్, కామారెడ్డి, సంగారెడ్డి, సిద్దిపేట, జనగాం, మేడ్చల్‌మల్కాజ్‌గిరి, యాదాద్రి, వికారాబాద్, వనపర్తి, సూర్యాపేట, నల్గొండ, నాగర్ కర్నూల్, ఖమ్మం

పంటల పరిస్థితులు, వరి - 9.83 లక్షల ఎకరాలు:ఇప్పటి వరకు 9.83 లక్షల ఎకరాల్లో వరి పంటను రైతులు సాగు చేశారు. వర్షాలు పడుతాయని ఆశించినప్పటికీ పడకపోవడంతో భూగర్భ జలాలు తగ్గి బోర్ల కింద సాగు చేసిన వరి మళ్ల బీటలు వారుతున్నాయి. ఈ పరిస్థితుల్లో కొందరు రైతులు నాట్లు వేయకుండా వరినార్లను వదిలేసారు. వాతావరణ ఇలాగే ఉంటే వరికి బదులు ప్రత్యామ్నయ పంటలు వేసుకోవాలని ప్రభుత్వం సూచించనుంది.

పత్తి - 43.46 లక్షల ఎకరాలు:రాష్ట్రంలో అత్యధికంగా దాదాపు అన్ని జిల్లాలోనూ సాగువుతున్నది పత్తి పంటనే. సాధారణ అంచనాలకు మించి ఇప్పటి వరకు 43.46 లక్షల ఎకరాల్లో సాగు చేశారు. అయితే వానలు లేకపోవడంతో పత్తి పంట వాడిపోతోంది. గులాబీ పురుగు ఆశించి, పత్తి కాయలను తొలుస్తోంది. వాతవరణంలో వస్తోన్న మార్పులతో రసం పీల్చే పురుగు కూడా ఆశిస్తుండటంతో అన్నదాతలకు కంటిమీద కునుకు ఉండటం లేదు. రైతులు అప్పులు చేసి మరి కోట్ల రూపాయల పెట్టుబడి కేవలం పత్తి పంట మీదే పెట్టారు.

సోయాబీన్ -3.90 లక్షల ఎకరాలు:వర్షాభావ పరిస్థితులను తట్టుకునే నిలిచే పంట అయినప్పటికీ సోయాబీన్ ఎండిపోతుంది. ఉమ్మడి ఆదిలాబాద్, నిజామాబాద్‌లో జిల్లాలో ఈ పంటను అధికంగా సాగు చేస్తున్నారు. 3.90 లక్షల ఎకరాల్లో పంటను వేసారు.

మొక్కజొన్న - 10.62 లక్షల ఎకరాలు:మొక్కజొన్న పంట పైరు వడిపోయి, ఎండిపోతుంది. మొవ్వు తొలుచు పురుగు పడుతోంది.

కందులు 5.78 లక్షల ఎకరాలు:వర్షాభావ పరిస్థితులతో కందిలో పేను బంక ఆశిస్తుంది. ఇప్పటికే వేసిన కంది విత్తులు వానలు లేక మొలకెత్త లేదు. కాస్త ఎదిగిన మొక్కలు కూడా ఎండిపోతున్నాయి.

సమాజంతో మమేకం కావాలి

న్యాయవాదులకు జస్టిస్ రామలింగేశ్వర్‌రావు సూచన



మన తెలంగాణ/హైదరాబాద్ : సామాజిక న్యాయం కేవలం నినాదం కాదని, అది భారత రాజ్యాంగానికి ఆత్మ వంటిదని హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ ఏ.రామలింగేశ్వర రావు అన్నారు. న్యాయవాదులు సామాజిక ఇంజనీర్లుగా కూడా పరిగణింపబడుతున్నారన్నారు. అందుకే సామాజిక న్యాయం గురించి పూర్తిగా తెలుసుకోవాలంటే లా పుస్తకాలు చదవడానికే పరిమితం కాకుండా చరిత్రను చదవాలని, సమాజంతో మమేకం కావాలని ఆయన సూచించారు. రాజ్యాంగ రూపకల్పన సందర్భంగా జరిగిన చర్చలు, రాజ్యాంగంలో పొందుపరిచిన అధికరణాలు, సూత్రాలతో పాటు అప్పుడు ఉన్న సామాజిక, రాజకీయ, చారిత్రక నేపథ్యం వంటి చరిత్రను ముందుగా తెలుసుకోవలసిన అవసరముందని, ఈ విషయంపై న్యాయవాదులు ప్రత్యేక దృష్టిని సారించాలని ఆయన కోరారు. ఇండియన్ అసోసియేషన్ ఆఫ్ లాయర్స్ (ఐఎఎల్) ఆధ్వర్యంలో ఐఎఎల్ వ్యవస్థాపక సభ్యులు, ప్రముఖ న్యాయవాది సి.పద్మనాభరెడ్డి నాల్గవ వర్ధంతి సభ బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో శుక్రవారం జరిగింది. ఈ సందర్భంగా జస్టిస్ ఏ.రామలింగేశ్వరరావు ''భారత రాజ్యాంగం సామాజిక న్యాయం'' అనే అంశంపై పద్మనాభరెడ్డి స్మారకోపన్యాసం చేశారు. సభలో హైకోర్టు జస్టిస్ సి.ప్రవీణ్‌కుమార్ హాజరయ్యారు. ఐఎఎల్ జాతీయ ప్రధాన కార్యదర్శి బొమ్మగాని ప్రభాకర్ అధ్యక్షతన జరిగిన సభలో తొలుత పద్మనాభరెడ్డి చిత్రపటానికి న్యాయమూర్తులు పుష్పాంజలి ఘటించారు.

ఈ సందర్భంగా జస్టిస్ నాగేశ్వరరావు ప్రసంగిస్తూ ఈన్యాయవాదులు సమకాలీన చరిత్రతో పాటు గత చరిత్రను తెలుసుకోవాల్సిన అవసరరముందని సూచించారు. భారత రాజ్యాంగం సామాజిక న్యాయం అందించడానికి సామాజిక న్యాయం, రాజకీయ, ఆర్థిక సమానత్వాలు అనే మూడు అంశాలను పొందుపరిచారని, అయితే గడిచిన 70 ఏళ్లలో ఒక్క సామాజిక న్యాయం కోసమే పోరాటం జరుగుతుందన్నారు. సామాజిక న్యాయాన్ని ముందుకు తీసుకెళ్లేందుకు ఏమైనా అవరోధాలు ఏర్పడుతున్నాయా, ప్రపంచీకరణ ప్రభావం ఎలా ఉంది అన్న దానిపై కూడా లోతుగా అధ్యయనం చేయాలని కోరారు. రాజ్యాంగంలో ప్రాథమిక హక్కులను అమలు పరిచే బాధ్యత, అధికారం ప్రభుత్వాలకు ఇవ్వబడిందన్నారు.సామాజిక న్యాయ పరిధిలోకి వచ్చే ప్రాథమిక హక్కులు, వ్యక్తిగత హక్కులు హరించబడుతున్నాయా అనే విషయాలను గమనించాలన్నారు. వీటిని ప్రభుత్వాలు అమలు పరచకపోతే పౌరులు ప్రశ్నించాలని, అందుకోసం సమాచార హక్కు చట్టాన్ని ఉపయోగించుకోవాలని జస్టిస్ సూచించారు. గడచిన మూడు సంవత్సరాలుగా అనేక మార్పులు వస్తున్నాయని, కమర్షియల్ కోర్టులు, ఇంకా అనేక కోర్టులు వస్తున్నాయని, చట్టాల్లో మార్పులు చోటు చేసుకుంటున్నాయని, ఇలాంటి పరిస్థితుల్లో న్యాయవాదులు కొత్త కొత్త కోర్టులలో తమ వృత్తిని కొనసాగించాగలరా అని ఆయన ప్రశ్నించారు. ఈ కొత్త కోర్టులు, కొత్త చట్టాలను ఏ వర్గాల వారు ఉపయోగించుకొని ముందుకు వెళ్తున్నారో ఆలోచించాలని జస్టిస్ ఏ.రామలింగేశ్వర రావు సూచించారు. కార్యక్రమంలో హైకోర్టు అడ్వకేట్స్ అసోసియేషన్ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు జల్లి కనకయ్య, ఆంధ్రప్రదేశ్ అధ్యక్షులు సిహెచ్.ధనంజయ, రంగారెడ్డి జిల్లా బార్ అసోసియేషన్ అధ్యక్షులు జి.చంద్ర శేఖర్ రెడ్డి, సిటీ సివిల్ కోర్ట్స్ బార్ అసోసియేషన్ అధ్యక్షులు కె.హరిమోహన్‌రెడ్డి, ఐఎఎల్ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రిసీడియం సభ్యులు జి.జగదీశ్వర్, తెలంగాణ రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎం.కె.రత్నం,ఉపాధ్యక్షులు ఎ.వి.భీమ్‌నాథ్, శ్రీనివాస్, గ్రేటర్ హైదరాబాద్ అధ్యక్షులు ఎ.వి.కృష్ణారావు, ప్రధాన కార్యదర్శి దాసరి జయ శ్రీనివాస్ పాల్గొన్నారు.తొలుత కార్యక్రమానికి ఐఎఎల్ నాయకులు కె.వి.ఎల్ .స్వాగతం పలికారు.

రైతే నిర్ణేత

(మొదటిపేజీ తరువాయి)

ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. దీనికి ప్రభుత్వం రూ.500కోట్ల బడ్జెట్‌ను కేటాయిస్తుందని చెప్పారు. రైతు నష్టపోకుండా కనీస మద్దతు ధరకు రైతు సమాఖ్య ఎక్కువ ధరను నిర్ణయిస్తుందన్నారు. రైతులు పండించిన ధాన్యాన్ని అవసరమైతే రాష్ట్ర రైతు సమాఖ్య కొనుగోలు చేసేలా ప్రభుత్వం అనుమతులు ఇస్తుందన్నారు. రైతు బాగుంటేనే రాష్ట్రం బాగుటుందని, గతంలోలా రైతు చుట్టూ బతికే పరిస్థితి రానుందని ఆశాభావం వ్యక్తం చేశారు. రైతులకు 24గంటల విద్యుత్ అందించేందుకు చర్యలు చేపడుతున్నట్లు చెప్పారు. రైతుకు రైతుశత్రువు కావద్దని, పంటలను కాలనీలుగా విభజించి ఆహార అవసరాలకు అనుగుణంగా పంటలు సాగు చేసుకోవాలని సూచించారు. వచ్చే యాసంగి నుంచి పంటలకు రైతు ఖాతాలలో సంవత్సరానికి రూ.8వేలు జమచేసే నిమిత్తం రైతు లెక్క తేల్చేందుకు రాష్ట్ర వ్యాప్తంగా 1500మంది వ్యవసాయ విస్తరణ అధికారులను నియమిస్తున్నట్లు తెలిపారు. గ్రామ రైతు సమాఖ్య నిర్ణయం మేరకు రైతు ఖాతాలలో డబ్బులు జమచేస్తామని చెప్పారు. 15టీఎంసీల సామర్థ్యంతో చేపడుతున్న కొండపోచమ్మ ప్రాజెక్టుతో మేడ్చల్ నియోజకవర్గంలోని 374 చెరువు కుంటలను నింపి 70వేల ఎకరాలకు వచ్చే జూన్ నాటికీ సాగునీరు అందిస్తామన్నారు. ఇక వర్షాల కోసం రైతులు ఎదురుచూడాల్సిన పరిస్థితి రాదన్నారు.

వృక్షాల గొప్పతనం తెలుసుకోవాలి...
ప్రతిఒక్కరూ వృక్షాల గొప్పతనం తెలుసుకొన్నప్పుడే పర్యావరణ సమతుల్యత జరుగుతుందన్నారు. పిల్లల మాదిరిగా ప్రేమతో చెట్లను పెంచి భవిష్యత్‌తరాల కోసం కర్తవ్యాన్ని నేరవేర్చాలని సీఎం పిలుపునిచ్చారు. ఆ దిశగా ప్రతి ఇంటికి ఆరు మొక్కలు నాటి సంరక్షించాలన్నారు. ఈ మేరకు కేశవరం, లక్ష్మాపూర్ గ్రామస్తుల నుంచి మాటతీసుకున్నారు. ఆరు మొక్కలను నాటి సంరక్షించిన ప్రతి ఇంటికి వచ్చే సంవత్సరం జనవరిలో రెండు పాడిగేదెలను బహుమతిగా అందజేస్తానని తెలిపారు.

రెండు గ్రామాలపై వరాల జల్లు...
కేశవరం, లక్ష్మాపూర్ గ్రామాలపై ముఖ్యమంత్రి కేసిఆర్ వరాల జల్లు కురిపించారు. గ్రామస్తుల కోరిక మేరకు అధికారులు, ప్రజాప్రతినిధులు మౌళిక సదుపాయాల కోసం రూపొందించిన ప్రణాళికల నివేదికను పరిశీలించిన ముఖ్యమంత్రి రెండు గ్రామాలకు భారీగా నిధులు మంజురు చేశారు. కేశవరంలో అభివృద్ధి పనులకు రూ. 10.27 కోట్లతో ప్రతిపాదనలు సిద్ధం చేయగా రూ.12 కోట్లు, లక్ష్మాపూర్‌లో అభివృద్ధి పనులకు రూ. 13.48 కోట్లతో ప్రతిపాదనలకుగాను రూ. 15 కోట్లు మంజురు చేసేందుకు హామీనిచ్చారు. శనివారం మధ్యాహ్ననికి జీఓలు జారీ చేసి ఆరు నెలల్లో పనులు పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. వచ్చే 8వ తేదిన ప్రారంభించే అభివృద్ధి పనులలో తాను పాల్గొననున్నట్లు చెప్పారు. ఈ అవకాశాలను సంఘటితంగా వినియోగించుకొని ఆదర్శ గ్రామాలుగా తీర్చిదిద్దుకోవాలని సూచించారు.

తెలంగాణ యోధుల గడ్డ మేడ్చల్ జిల్లా...
మేడ్చల్‌కు చెందిన సింగిరెడ్డి వెంకట్‌రాంరెడ్డి, మూడుచింతల పల్లికి చెందిన కామిడి వీరారెడ్డిలు 1969లో సాగించిన తెలంగాణ ఉద్యమ స్ఫూర్తితో నేడు ప్రత్యేక రాష్ట్రం సాధించుకున్నట్లు తెలిపారు. అంతకు ముందు మూడుచింతలపల్లిలోని వీరారెడ్డి విగ్రహానికి ముఖ్యమంత్రి పూలమాల వేసి నివాళులర్పించారు.

ఆయా గ్రామాల సర్పంచులు మంజుల హరిమో హన్‌రెడ్డి, శ్యామలల అధ్యక్షతన జరిగిన గ్రామ సభలలో రాష్ట్ర రోడ్డు రవాణా శాఖమంత్రి పి.మహేందర్‌రెడ్డి, మల్కాజిగిరి ఎంపి సిహెచ్ మల్లారెడ్డి, ఎమ్మెల్యేలు ఎం.సుధీర్‌రెడ్డి, మాధవరం కృష్ణారావు, ఎమ్మెల్సీ శంభీపూ ర్‌రాజు, రంగారెడ్డి జిల్లా కలెక్టర్ ఎం.రఘునందన్‌రావు, మేడ్చల్ జిల్లా జాయింట్ కలెక్టర్ కే.ధర్మారెడ్డి, సీఎం ప్రత్యేక కార్యదర్శి స్మీతాసబర్వాల్, రాష్ట్ర మినరల్ డెవలప్‌మెంట్ కార్పోరేషన్ చైర్మన్ సుభాష్‌రెడ్డి, ఉన్నతాధికారులు ప్రియాంక వర్గీస్, నీతూప్రసాద్, కరుణ, విద్యుత్ డైరక్టర్ శ్రీనివాస్‌రెడ్డి, సిఎండి ప్రభాకర్‌రావు, డిఆర్‌ఓ సురేందర్‌రావు, విద్యుత్ శాఖ సిజిఎం పర్వతం, జడ్పి వైస్ చైర్మన్ ప్రభాకర్‌రెడ్డి, ఎంపిపి చంద్రశేఖర్‌యాదవ్, జడ్పిటిసి బాలేష్ తదితరులు పాల్గొన్నారు.

రాహుల్ కారుపై దాడి

(మొదటిపేజీ తరువాయి)

ఆఫ్ పోలీసు నీరజ్ బద్గుజర్ తెలిపారు. అయితే రాహుల్‌తో పాటు ఉన్న కొందరికి స్వల్ప గాయాలు అయినట్లు తెలిసింది. వరదలతో దెబ్బతిన్న ధనేరా పట్టణంలో ప్రజలను పరామర్శించేందుకు రాహుల్ వచ్చినప్పుడు ఓ వ్యక్తి రాళ్లతో కారుపై దాడికి దిగాడని ఎస్‌పి చెప్పారు. లాల్ చౌక్ నుంచి ధనేరా హెలీపాడ్ వైపు రాహుల్ కాన్వాయ్ వెళ్లుతుండగా ఆగంతకుడు ఈ చర్యకు పాల్పడ్డాడు. భారీ వర్షాలతో అతలాకుతలం అయిన గుజరాత్‌లో పర్యటనకు వచ్చిన రాహుల్‌కు అనేక చోట్ల నిరసనకారులు అడ్డుతగిలారు. ఆయన సభలను సాగనివ్వలేదు. లాల్‌చౌక్ ప్రాంతంలో సభ జరుగుతూ ఉండగా కొందరు నల్ల జెండాలు ప్రదర్శించడం, రాహుల్‌కు వ్యతిరేకంగా నినాదాలకు దిగుతూ , నరేంద్ర మోడీ జిందాబాద్ అంటూ గందరగోళం సృష్టించారు. దీనితో రాహుల్ అర్థాంతరంగా సభను ముగించి వెళ్లిపోవల్సి వచ్చింది. తరువాత ఆయన హెలీపాడ్ వైపు వెళ్లుతుండగా దాడి ఘటన జరిగింది. దాడికి బాధ్యులుగా నిర్ధారిస్తూ ఓ వ్యక్తిని అదుపులోకి తీసుకున్నట్లు పోలీసు అధికారి తెలిపారు. పెద్దపెద్ద రాళ్ల దెబ్బలతో రాహుల్ వాహనం ముందు భాగం బాగా దెబ్బ తింది. అద్దాలు పూర్తిగా ధ్వంసం అయ్యాయి. ఎనిమిదవ తేదీన గుజరాత్‌లో రాజ్యసభ ఎన్నికలు జరగనుండటం, కాంగ్రెస్ ఎమ్మెల్యేలను బిజెపి బారి నుంచి రక్షించేందుకు బెంగళూరుకు తరలించడం వంటి ఘటనల సమయంలోనే రాహుల్ కారుపై ఇప్పుడు దాడి జరిగింది. బిజెపి మద్దతుదారు ఒకరు సిమెంట్ ఇటుకను తీసుకుని కారువైపు విసిరాడని, అది నేరుగా రాహుల్ పయనిస్తున్న కారు అద్దాలను తాకుతూ వెళ్లిందని వెల్లడైంది.

దాడులకు భయపడం..ప్రజలకు తోడుగా ఉంటాం : రాహుల్
ఘటన తరువాత కూడా చెక్కుచెదరని ధైర్యంతో రాహుల్ తమ పర్యటనను కొనసాగించారు. థారా తాలూకాలోని రూనీ గ్రామంలో ఏర్పాటు చేసిన సభలో మాట్లాడారు. ఇలాంటి చర్యలకు భయపడేది లేదని, నరేంద్ర మోడీ జిందాబాద్ నినాదాలకు, రాళ్లు ఇటుకలకు పారిపోయ్యేవాడిని కానని స్పష్టం చేశారు. నల్లజెండాలు ప్రదర్శించి తన యాత్రను ఆపలేరని తెలిపారు. లాల్‌చౌక్ ప్రాంతంలో బిజెపి మద్దతుదార్లు రాహుల్ ప్రసంగాన్ని అడ్డుకోవడమే కాకుండా, ఆయనను నెట్టివేసే యత్నాలకు దిగారు. గ్రామాలు వరదలలో మునిగిపోయినప్పుడు వారికి తోడుగా ఉండటం తన విధి బాధ్యత అని, వరద తాకిడితో దిక్కులేని పేదలు చనిపోయినప్పుడు వారిని పరామర్శించడం, వారిని అక్కున చేర్చుకోవడం కోసం తాను వచ్చానని, తనను ఎవరూ ఆపలేరని రాహుల్ తెలిపారు. తాను తమ కాంగ్రెస్ పార్టీ బాధితుల పక్షాన నిలుస్తుందని చెప్పారు. కేంద్రంలో కానీ రాష్ట్రంలో కానీ కాంగ్రెస్ ప్రభుత్వం లేకపోవచ్చునని అయితే అవసర సమయంలో ప్రజలకు చేదోడువాదోడుగా నిలిచేందుకు కాంగ్రెస్ పార్టీ సిద్ధంగా ఉందని తెలిపారు. నిరసనల పేరిట బిజెపి వారు దూరంగా ఉండి నల్లజెండాలు ప్రదర్శించడం కాదు, ధైర్యముంటే తన ముందుకు వచ్చి నల్ల జెండాలు పాతమనండి చూద్దాం అని రాహుల్ సవాలు విసిరారు.

బిజెపి గూండాల దాడి : కాంగ్రెస్
బిజెపి గూండాలు జరిపిన పైశాచిక దాడి ఇదని కాంగ్రెస్ ప్రతినిధి అభిషేక్ మనూ సింఘ్వీ విమర్శించారు. కాన్వాయ్‌లో పలు వాహనాలు దెబ్బతిన్నాయన, కిటికీల అద్దాలు పగిలాయని,ఎస్‌పిజి వ్యక్తి ఒకరికి గాయాలు అయ్యాయని ఆయన ఢిల్లీలో విలేకరులతో చెప్పారు. వరద ప్రాంతాలకు వెళ్లిన కాంగ్రెస్ నేతను అడ్డుకునేందుకు బిజెపి వారు ఈ విధంగా చేయడం దారుణం అని అభిషేక్ స్పందించారు. కష్టాలలో ఉన్న వారిని పలకరించేందుకు వచ్చిన నేతను అడ్డుకోవడం ఎంతవరకు సబబని ఆయన ప్రశ్నించారు. భీకరస్థాయిలోనే దాడి జరిగిందని తెలిపారు.

రాహుల్ ప్రచారఆర్భాట రాజకీయాలు :బిజెపి
ప్రచార ఆర్బాటంలో భాగంగానే రాహుల్ గాంధీ ఫోటోలు దిగేందుకు గుజరాత్ పర్యటనకు వచ్చారని బిజెపి వ్యాఖ్యానించింది. అవకాశం వచ్చినప్పుడల్లా ఫోటోలకు ఫోజులు ఇవ్వడం రాహుల్‌కు ఆనవాయితీగా మారిందని ఢిల్లీలో బిజెపి అధికార ప్రతినిధి సంబిత్ పాత్రా విమర్శించారు. ప్రతిపక్ష పార్టీ ప్రజల భావోద్వేగాలను గుర్తించాల్సి ఉందన్నారు. వరదలతో దెబ్బతిని ఉన్న ప్రజలు రాహుల్ రాజకీయాలతో విసిగిపొయ్యారని వారి చర్యలకు కాంగ్రెస్ వేరే విధంగా చిత్రీకరించడం తగదని పాత్రా తెలిపారు. బిజెపి గూండాలే రాహుల్ కారుపై రాళ్ల దాడికి దిగారనే వాదనపై బిజెపి స్పందించింది. ప్రజలను గూండాలుగా ,రౌడీలుగా అభివర్ణిస్తారా? నిరసనలను వేరే విధంగా చిత్రీకరిస్తారా? అని బిజెపి ప్రతినిధి ప్రశ్నించారు. గుజరాత్‌లో దెబ్బతిన్న ప్రజలను ఆదుకునేందుకు ఓవైపు బిజెపి ఎమ్మెల్యులు పాటుపడుతూ ఉంటే, కాంగ్రెస్ ఎమ్మెల్యేలు బెంగళూరులో రిసార్ట్‌లో ఖుషీ చేసుకుంటున్నారని వ్యాఖ్యానించారు. రాహుల్ గాంధీ అవకాశవాద దుందుడుకు, దూకుడు రాజకీయాలు గురించి అందరికీ విదితమే అన్నారు.

లీకేజీ అపోహ: వి.సి. వివరణ

మనతెలంగాణ/హైదరాబాద్ : పొట్టిశ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయంలో గురువారం జరిగిన ఎం.ఫిల్,పిహెచ్‌డి ప్రవేశ పరీక్షల ప్రశ్నపత్రాలు లీకైనట్లు విద్యార్థులు అపోహ పడ్డారని వర్సిటీ తెలిపింది. 'తెలుగు వర్సిటీ పిహెచ్‌డి ప్రశ్నాపత్రం లీక్..?' అనే శీర్షికతో 'మన తెలంగాణ'లో శుక్రవారం ప్రచురితమైన వార్తపై వర్సిటీ రిజిస్ట్రార్ ఆచార్య వి.సత్తిరెడ్డి ఒక ప్రకటన ద్వారా వివరణ ఇచ్చారు. పరీక్షలకు హాజరైన ఒక విద్యార్థి రాసుకొచ్చిన ప్రశ్నలు, సమాధానాలు పేపర్‌లోని వాటితో జతకావడంతో పేపర్ లీకైనట్లు విద్యార్థులు అపోహ చెందారని అన్నారు. వాస్తవానికి ఆ విద్యార్థి పరీక్ష రాస్తున్న గదిలో అప్పటికీ పరీక్ష పత్రాలను పంపిణీ చేయలేదని, కేవలం ఆ విద్యార్థి చేతిపై ఉన్న రాతలను గుర్తించి పరీక్ష పత్రం లీకైందని విద్యార్థులు భావించారని పేర్కొన్నారు. విషయం తెలిసిన వెంటనే వర్సిటీ ఉపాధ్యక్షులు విచారణ కమిటీతో పూర్తి స్థాయిలో విచారణ జరిపించారని, అందులో ప్రశ్నాపత్రం లీకు కాలేదని ఆ కమిటీ నిర్ధారించినట్లు చెప్పారు.

కాంగ్రెస్‌లోకి టిఆర్‌ఎస్ సర్పంచ్

మన తెలంగాణ/హైదరాబాద్: కొల్లాపూర్ నియోజకవర్గంలోఅధికార టిఆర్‌ఎస్‌కు చెందిన సర్పంచ్ కాంగ్రెస్ పార్టీలో చేరారు. కొండ్రోవుపల్లి గ్రామ సర్పంచ్ రాజేశ్ తన అనుచరులతో కలిసి మాజీ మంత్రి డి.కె.అరుణ సమక్షంలో శుక్రవారం కాంగ్రెస్‌లో చేరారు. హైదరాబాద్‌లోని అరుణ స్వగృహంలో జరిగిన ఈ కార్యక్రమంలో వారికి కాంగ్రెస్ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కొల్లాపూర్ కాంగ్రెస్ ఇన్‌చార్జి హర్షవర్ధన్ రెడ్డి ఆధ్వర్యంలో వారు కాంగ్రెస్‌లో చేరారు.

తెలంగాణ ప్రభుత్వము, రెవెన్యూ (భూసేకరణ) శాఖ

కలెక్టరు, రంగారెడ్డి జిల్లా

ఫారం-సి

ఫైల్ నెం. G1/3276/2017 (సెక్షన్ 11 క్రింద 10ఎ మినహాయింపు ఇచ్చినప్పుడు) తేది: 04.08.2017

గెజిట్ నెం. 16

ప్రాథమిక ప్రకటన తేది: 04.08.2017

హైదరాబాద్ గ్రీన్‌ఫార్మాసిటీ కొరకు మేడిపల్లి గ్రామము, యాచారం మండలము, రంగారెడ్డి జిల్లాలో 2088-03½ ఎకరముల భూమి అవసరమైనదిగా కలెక్టరు, రంగారెడ్డి జిల్లావారు భావించుచున్నారు.

కావున రంగారెడ్డి జిల్లా, యాచారం మండలము, మేడిపల్లి గ్రామములోని పైన పేర్కొన్న పనరు ప్రాజెక్టు కొరకు దిగువ వివరించబడిన విధంగా గుర్తించిన ప్రామాణిక కొలతలు ఎ 186.33½ గుంటలు ఎక్కువ లేదా తక్కువ విస్తీర్ణపు భూమి యొక్కభాగము భూసేకరణ క్రింద కలదని ప్రకటించవమైనది.

షెడ్యూలు

జిల్లా రంగారెడ్డి మండలము యాచారం గ్రామము మేడిపల్లి

క్రమసంఖ్య	సర్వే నెంబర్	భూమి స్వభావం: టైటిల్	భూమి స్వభావం: రకం	సేకరణ విస్తీర్ణం ఎ.గు.	ఆసక్తి గల వ్యక్తుల పేర్లు చిరునామా	సరిహద్దులు సర్వే నెంబర్ ప్రకారం: ఉ	ద	తూ	ప	చెట్లు రకం/సంఖ్య	నిర్మాణములు రకం/విస్తీర్ణం	
1	2	3		4	5	6				7	8	
1	168/అ	పట్టా	మెట్ట	3.03	బి. రాములు తండ్రి నారాయణ గ్రా॥ మేడిపల్లి	జల రాములు	మల్లమ్మ	పంగిం భరత్	చీత సత్తయ్య	-	-	-
2	168/ఆ	పట్టా	మెట్ట	0.22	మక్కపల్లి మైసయ్య తండ్రి ముత్తయ్య గ్రా॥ మేడిపల్లి; సి.హెచ్. మాధవరెడ్డి తండ్రి జంగారెడ్డి గ్రా॥ మేడిపల్లి	నర్సింహ	యం. రాములు	మైసయ్య	రాములు	-	-	-
3	168	పట్టా	మెట్ట	0.22	మక్కపల్లి చంద్రయ్య గ్రా॥ మేడిపల్లి; సి.హెచ్. మాధవరెడ్డి తండ్రి జంగారెడ్డి గ్రా॥ మేడిపల్లి	నర్సింహ	యం. రాములు	మైసయ్య	రాములు	-	-	-
4	168	పట్టా	మెట్ట	0.23	మక్కపల్లి జంగయ్య గ్రా॥ మేడిపల్లి; సి.హెచ్. మాధవరెడ్డి తండ్రి జంగారెడ్డి గ్రా॥ మేడిపల్లి	నర్సింహ	యం. రాములు	మైసయ్య	రాములు	-	-	-
5	168/ఇ	పట్టా	మెట్ట	2.03	మక్కపల్లి రాములు గ్రా॥ మేడిపల్లి	మైసయ్య	యం. రాములు	నర్సింహ	యస్.సి. భూములు	-	-	-
6	168	పట్టా	మెట్ట	0.30 1/2	పుష్పా, మక్కపల్లి రాములు	168	167	169	167	-	-	-
7	168	పట్టా	మెట్ట	0.08 1/4	అమరాధ భర్త డి.వి.ఆర్. సూర్య బాబు, మక్కపల్లి రాములు	168	167	169	167	-	-	-
8	168/ఈ	పట్టా	మెట్ట	2.03	మక్కపల్లి నర్సింహ గ్రా॥ మేడిపల్లి	బి. రాములు	చీత సత్తయ్య	బుర్ర సత్తయ్య	యం. అనసూయ	-	-	-
9	168	పట్టా	మెట్ట	0.33	మక్కపల్లి మల్లమ్మ భర్త రామయ్య మక్కపల్లి నర్సింహ తండ్రి జంగయ్య	చంద్రయ్య	యం. రాములు	మైసయ్య	యస్.సి. భూములు	-	-	-
10	168	పట్టా	మెట్ట	0.16 1/2	వి. లక్ష్మీనారాయణ, మక్కపల్లి నర్సింహ తండ్రి జంగయ్య గ్రా॥ మేడిపల్లి	168	167	169	167	-	-	-
11	168	పట్టా	మెట్ట	0.08 1/4	డి. రమేష్ బాబు మక్కపల్లి నర్సింహ తండ్రి జంగయ్య గ్రా॥ మేడిపల్లి	168	167	169	167	-	-	-
12	168	పట్టా	మెట్ట	0.16 1/2	వి. కాశీ విశ్వేశ్వరరావు మక్కపల్లి నర్సింహ తండ్రి జంగయ్య గ్రా॥ మేడిపల్లి	168	167	169	167	-	-	-
13	169/అ	పట్టా	మెట్ట	5.00	కె. తిరుపతమ్మ, లిక్కి, కౌసల్యరెడ్డి భర్త నర్సింహ రెడ్డి గ్రా॥ మేడిపల్లి	169	168	184, 185	170	-	-	-
14	169	పట్టా	మెట్ట	1.29	కె. రమణి, లిక్కి, కౌసల్యరెడ్డి భర్త నర్సింహ రెడ్డి గ్రా॥ మేడిపల్లి	169	168	184, 185	170	-	-	-
15	169	పట్టా	మెట్ట	2.10	మక్కపల్లి యాదయ్య తండ్రి మైసయ్య గ్రా॥ మేడిపల్లి	సత్తయ్య	మైసయ్య	యస్.సి. భూమి	సత్తయ్య	-	-	-
16	169/అ/2	పట్టా	మెట్ట	2.10	మక్కపల్లి సత్తయ్య తండ్రి మైసయ్య గ్రా॥ మేడిపల్లి	యం. యాదయ్య	మక్కపల్లి రాములు	యస్.సి. భూమి	యస్.సి. భూములు	-	-	-
17	169	పట్టా	మెట్ట	2.10	మక్కపల్లి నర్సింహ తండ్రి మైసయ్య గ్రా॥ మేడిపల్లి	దేవదాసు	యం. రాములు	క్రిష్ణ	సత్తయ్య	-	-	-
18	169	పట్టా	మెట్ట	2.10	మక్కపల్లి సహదేవ్ తండ్రి మైసయ్య గ్రా॥ మేడిపల్లి	నర్సింహ	యం. చంద్రయ్య	యస్.సి. భూమి	సత్తయ్య	-	-	-
19	169/అ	పట్టా	మెట్ట	2.00	పాలమోని కృష్ణయ్య తండ్రి మల్లయ్య గ్రా॥ మేడిపల్లి	సత్తయ్య	నర్సింహ	ఆరెపల్లి రాంచంద్రి	యస్.సి. భూములు	-	-	-
20	169/ఇ	పట్టా	మెట్ట	2.00	పాలమోని జలయ్య తండ్రి మల్లయ్య (పాలమోని సురేష్, పాలమోని రాఘవేంద్ర పాలమోని మహేందర్) గ్రా॥ మేడిపల్లి	సత్తయ్య	నర్సింహ	ఆరెపల్లి రాంచంద్రి	యస్.సి. భూములు	-	-	-
21	170/ఈ	పట్టా	మెట్ట	0.13	లిక్కి కిషన్ రెడ్డి తండ్రి పాపిరెడ్డి గ్రా॥ మేడిపల్లి	169	166	188	171	-	-	-
22	170/రు	పట్టా	మెట్ట	0.07	లిక్కి యాదవరెడ్డి తండ్రి రంగారెడ్డి గ్రా॥ మేడిపల్లి	169	166	188	171	-	-	-
23	170/రూ	పట్టా	మెట్ట	0.07	లిక్కి క్రిష్ణారెడ్డి తండ్రి రంగారెడ్డి గ్రా॥ మేడిపల్లి	169	166	188	171	-	-	-
24	171/అ	పట్టా	మెట్ట	3.00	మక్కపల్లి మల్లయ్య తండ్రి ముత్తయ్య గ్రా॥ మేడిపల్లి	యస్.సి. భూములు	184	వెంకటయ్య	ప్రభుత్వ భూమి	-	-	-
25	171/ఆ	పట్టా	మెట్ట	0.19	మెరవత్ వెంకటయ్య తండ్రి లక్ష్మా గ్రా॥ మేడిపల్లి	శంకర్	మోతీరాం	లాఫ్వని పల్లి	మోతీరాం	మామిడి-1 కొబ్బరి-1	-	-
26	171/ఇ	పట్టా	మెట్ట	1.01	గొదాసు సంధ్య భర్త నర్సింహ గ్రా॥ మేడిపల్లి	వెంకటయ్య	శంకర్	ప్రభుత్వ భూమి	సర్రి	-	-	-
27	171	పట్టా	మెట్ట	2.04	మెరవత్ వెంకటయ్య తండ్రి లక్ష్మా గ్రా॥ మేడిపల్లి	శంకర్	వెంకటయ్య	ప్రభుత్వ భూమి	శంకర్	తాటిచెట్లు 10	-	-
28	171/ఈ	పట్టా	మెట్ట	2.04	మెరవత్ శంకర్ తండ్రి సేవ్య గ్రా॥ మేడిపల్లి	సేవా	184	హన్య	వెంకటయ్య	తాటి-17 చింత-1 కొబ్బరి-1	-	-
29	171/ఉ	పట్టా	మెట్ట	1.20	మెరవత్ వెంకటయ్య తండ్రి లక్ష్మా గ్రా॥ మేడిపల్లి	శంకర్	మోతీరాం	లాఫ్వని పల్లి	మోతీరాం	-	-	-
30	171/ఊ	పట్టా	మెట్ట	1.20	ఇస్లావత్ హన్మ తండ్రి దేవ్య గ్రా॥ మేడిపల్లి	యస్.సి. భూములు	మల్లయ్య	శంకర్	శంకర్	-	-	-
31	171	పట్టా	మెట్ట	2.03	జి. సుగుణ భర్త భాస్కర్‌రెడ్డి గ్రా॥ మేడిపల్లి	యస్.సి. భూములు	మల్లయ్య	శంకర్	శంకర్	-	-	-
32	171/రు	పట్టా	మెట్ట	3.23	మెరవత్ శంకర్ తండ్రి సేవ్య గ్రా॥ మేడిపల్లి	హన్య	మల్లయ్య	వెంకటయ్య	వెంకటయ్య	-	-	-
33	171/రూ	పట్టా	మెట్ట	0.03	మెరవత్ శంకర్ తండ్రి సేవ్య లిక్కి, కౌసల్య రెడ్డి, గ్రా॥ మేడిపల్లి	హన్య	మల్లయ్య	వెంకటయ్య	వెంకటయ్య	-	-	-
34	171/లు	పట్టా	మెట్ట		లిక్కి, యాదవ రెడ్డి, గ్రా॥ మేడిపల్లి							
35	171/లూ	పట్టా	మెట్ట	0.03	మెరవత్ వెంకటయ్య తండ్రి లక్ష్మా లిక్కిమోహన్ రెడ్డి, గ్రా॥ మేడిపల్లి	హన్య	మల్లయ్య	వెంకటయ్య	వెంకటయ్య	-	-	-
36	171/ఎ	పట్టా	మెట్ట		లిక్కి క్రిష్ణా రెడ్డి, గ్రా॥ మేడిపల్లి							
37	172/అ	పట్టా	మెట్ట	1.30	మెరవత్ వెంకటయ్య తండ్రి లక్ష్మా లిక్కిమోహన్ రెడ్డి, గ్రా॥ మేడిపల్లి	వెంకటయ్య	మల్లయ్య	మోతీరాం	శంకర్	-	-	-
38	172/ఆ	పట్టా	మెట్ట		లిక్కి క్రిష్ణా రెడ్డి, గ్రా॥ మేడిపల్లి							
39	172/ఇ	పట్టా	మెట్ట	1.29	మెరవత్ శంకర్ తండ్రి సేవ్య లిక్కికౌసల్య రెడ్డి, గ్రా॥ మేడిపల్లి	వెంకటయ్య	మల్లయ్య	మోతీరాం	శంకర్	-	-	-
40	172/ఈ	పట్టా	మెట్ట		లిక్కి, యాదవ్ రెడ్డి, గ్రా॥ మేడిపల్లి							
41	172/ఉ	పట్టా	మెట్ట	0.24	మెరవత్ వెంకటయ్య తండ్రి లక్ష్మా గ్రా॥ మేడిపల్లి	వెంకటయ్య	మల్లయ్య	మోతీరాం	శంకర్	-	-	-
42	172/ఊ	పట్టా	మెట్ట	0.12	మెరవత్ వెంకటయ్య తండ్రి లక్ష్మా మెరవత్ లాల్య తండ్రి లక్ష్మా	వెంకటయ్య	మల్లయ్య	మోతీరాం	శంకర్	-	-	-
43	172	పట్టా	మెట్ట	0.12	మెరవత్ శంకర్, మెరవత్ లాల్య తండ్రి లక్ష్మా	వెంకటయ్య	మల్లయ్య	మోతీరాం	శంకర్	-	-	-
44	172/రు	పట్టా	మెట్ట	0.25	ఇస్లావత్ హన్య తండ్రి దేవ్య గ్రా॥ మేడిపల్లి	వెంకటయ్య	మల్లయ్య	మోతీరాం	శంకర్	-	-	-
45	172/రూ	పట్టా	మెట్ట	0.25	మెరవత్ శంకర్ తండ్రి సేవ్య గ్రా॥ మేడిపల్లి	వెంకటయ్య	మల్లయ్య	మోతీరాం	శంకర్	-	-	-
46	174/అ	పట్టా	మెట్ట	1.07	దోస రమేష్ తండ్రి మల్లయ్య కె. నాగరత్నమ్మ భర్త బలవంత్ రావు గ్రా॥ మేడిపల్లి	వెంకటయ్య	గుండాలు	సర్రి	జమ	-	-	-
47	174	పట్టా	మెట్ట	1.30 1/2	దోస వెంకటయ్య తండ్రి రామయ్య, కె. నాగరత్నమ్మ భర్త బలవంత్ రావు గ్రా॥ మేడిపల్లి	శంకర్	బుచ్చయ్య	రమేష్	బాలయ్య	-	-	-
48	174	పట్టా	మెట్ట	1.30 1/2	దోస గుండాలు తండ్రి రామయ్య, కె. నాగరత్నమ్మ భర్త బలవంత్ రావు గ్రా॥ మేడిపల్లి	శంకర్	బుచ్చయ్య	రమేష్	బాలయ్య	-	-	-
49	174	పట్టా	మెట్ట	1.01	దోస పాలయ్య తండ్రి రెడ్డయ్య కె. నాగరత్నమ్మ భర్త బలవంత్ రావు గ్రా॥ మేడిపల్లి	గుండలు	గిరప్	చంద్రయ్య	జాన్	-	-	-
50	174	పట్టా	మెట్ట	1.01	దోస మల్లయ్య తండ్రి రెడ్డయ్య కె. నాగరత్నమ్మ భర్త బలవంత్ రావు గ్రా॥ మేడిపల్లి	బుచ్చయ్య	గిరప్	గుండలు	జాన్	-	-	-
51	174	పట్టా	మెట్ట	1.01	దోస బుచ్చయ్య తండ్రి జంగయ్య కె. నాగరత్నమ్మ భర్త బలవంత్ రావు గ్రా॥ మేడిపల్లి	గుండలు	గిరప్	గుండలు	జాన్	-	-	-
52	174	పట్టా	మెట్ట	1.07	దోస లక్ష్మా తండ్రి మల్లయ్య కె. నాగరత్నమ్మ భర్త బలవంత్ రావు గ్రా॥ మేడిపల్లి	గుండలు	గిరప్	గుండలు	జాన్	-	-	-
53	174	పట్టా	మెట్ట	1.07	దోస మహేశ్ తండ్రి మల్లయ్య కె. నాగరత్నమ్మ భర్త బలవంత్ రావు గ్రా॥ మేడిపల్లి	గుండలు	గిరప్	గుండలు	జాన్	-	-	-
54	175/అ	పట్టా	మెట్ట	0.25	దోస రమేశ్ తండ్రి మల్లయ్య కె. నాగరత్నమ్మ భర్త బలవంత్ రావు గ్రా॥ మేడిపల్లి	వెంకటయ్య	గుండలు	సర్రి	జమ	-	-	-
55	175	పట్టా	మెట్ట	0.35	దోస వెంకటయ్య తండ్రి రామయ్య కె. నాగరత్నమ్మ భర్త బలవంత్ రావు గ్రా॥ మేడిపల్లి	శంకర్	బుచ్చయ్య	రమేశ్	బాలయ్య	-	-	-
56	175	పట్టా	మెట్ట	0.35	దోస గుండాలు తండ్రి రామయ్య కె. నాగరత్నమ్మ భర్త బలవంత్ రావు గ్రా॥ మేడిపల్లి	శంకర్	బుచ్చయ్య	రమేశ్	బాలయ్య	-	-	-
57	175	పట్టా	మెట్ట	1.04	దోస పాలయ్య తండ్రి రెడ్డయ్య కె. నాగరత్నమ్మ భర్త బలవంత్ రావు గ్రా॥ మేడిపల్లి	గుండాలు	గిరప్	చంద్రయ్య	జాన్	తాటి-12	-	-
58	175	పట్టా	మెట్ట	1.10	దోస మల్లయ్య తండ్రి రెడ్డయ్య కె. నాగరత్నమ్మ భర్త బలవంత్ రావు గ్రా॥ మేడిపల్లి	బుచ్చయ్య	గిరప్	గుండాలు	జాన్	-	-	-
59	175	పట్టా	మెట్ట	1.05	దోస బుచ్చయ్య తండ్రి జంగయ్య కె. నాగరత్నమ్మ భర్త బలవంత్ రావు గ్రా॥ మేడిపల్లి	గుండాలు	గిరప్	గుండాలు	జాన్	-	-	-
60	175	పట్టా	మెట్ట	1.02	దోస లక్ష్మా తండ్రి మల్లయ్య కె. నాగరత్నమ్మ భర్త బలవంత్ రావు గ్రా॥ మేడిపల్లి	గుండాలు	గిరప్	గుండాలు	జాన్	-	-	-
61	175	పట్టా	మెట్ట	1.02	దోస మహేశ్ తండ్రి మల్లయ్య కె. నాగరత్నమ్మ భర్త బలవంత్ రావు గ్రా॥ మేడిపల్లి	గుండాలు	గిరప్	గుండాలు	జాన్	-	-	-
62	176/అ	పట్టా	మెట్ట	0.33	కె. అరుణ, మంద చెన్నమ్మ, మంద రాములమ్మ, మంద లాలమ్మ, మొరుగు రాంచంద్రయ్య, మొరుగు లక్ష్మయ్య, మొరుగు రాములు, మొరుగు వెంకటయ్య, మొరుగు చిన్నజంగయ్య నడిపి జంగయ్య, నడిపి జంగమ్మ, నడిపి నారయ్య,	184	184	184	177	-	-	-
63	176	పట్టా	మెట్ట	0.33	వ్రు సునిత మంద చెన్నమ్మ, మంద రాములమ్మ, మంద లాలమ్మ, మొరుగు రాంచంద్రయ్య, మొరుగు లక్ష్మయ్య, మొరుగు రాములు, మొరుగు వెంకటయ్య, మొరుగు చిన్నజంగయ్య నడిపి జంగయ్య, నడిపి జంగమ్మ, నడిపి నారయ్య,	184	184	184	177	-	-	-
64	176	పట్టా	మెట్ట	6.13	కె. ఫణి భాస్కర్ మంద చెన్నమ్మ, మంద రాములమ్మ, మంద లాలమ్మ, మొరుగు రాంచంద్రయ్య, మొరుగు లక్ష్మయ్య, మొరుగు రాములు, మొరుగు వెంకటయ్య, మొరుగు చిన్నజంగయ్య నడిపి జంగయ్య, నడిపి జంగమ్మ, నడిపి నారయ్య,	184	184	184	177	వేప-10	-	-
65	177/అ	పట్టా	మెట్ట	0.04	కె. అరుణ కుమారి భర్త కెహెచ్ పేరరాజు, మంద చంద్రమ్మ యం. తిరుపతయ్య, యం. రాములు, యం. పోచయ్య, యం. లాలమ్మ మొరుగు పెద్దజంగయ్య నడిపి జంగమ్మ, ఎన్. చిన్నజంగయ్య, ఎన్. జంగయ్య, మంద పాపమ్మ, మంద లక్ష్మమ్మ, మంద జంగయ్య, నల్లోల్ల మల్లయ్య నల్లోల్ల రాములు, నల్లోల్ల క్రిష్ణయ్య నల్లోల్ల వెంకటయ్య,	176	184	184	178	-	-	-
66	177	పట్టా	మెట్ట	0.03	సి. భారతి, మంద చంద్రమ్మ యం. తిరుపతయ్య, యం. రాములు, యం. పోచయ్య, యం. లాలమ్మ మొరుగు పెద్దజంగయ్య నడిపి జంగమ్మ, ఎన్. చిన్నజంగయ్య, ఎన్. జంగయ్య, మంద పాపమ్మ, మంద లక్ష్మమ్మ, మంద జంగయ్య, నల్లోల్ల మల్లయ్య నల్లోల్ల రాములు, నల్లోల్ల క్రిష్ణయ్య నల్లోల్ల వెంకటయ్య,	176	184	184	178	-	-	-
67	177	పట్టా	మెట్ట	0.10	యం. శ్రీనివాస్ రావు మంద చంద్రమ్మ యం. తిరుపతయ్య, యం. రాములు, యం. పోచయ్య, యం. లాలమ్మ మొరుగు పెద్దజంగయ్య నడిపి జంగమ్మ, ఎన్. చిన్నజంగయ్య, ఎన్. జంగయ్య, మంద పాపమ్మ, మంద లక్ష్మమ్మ, మంద జంగయ్య, నల్లోల్ల మల్లయ్య నల్లోల్ల రాములు, నల్లోల్ల క్రిష్ణయ్య నల్లోల్ల వెంకటయ్య,	176	184	184	178	-	-	-
68	177	పట్టా	మెట్ట	1.27	కె. ఫణి భాస్కర్ మంద చంద్రమ్మ యం. తిరుపతయ్య, యం. రాములు, యం. పోచయ్య, యం. లాలమ్మ మొరుగు పెద్దజంగయ్య నడిపి జంగమ్మ, ఎన్. చిన్నజంగయ్య, ఎన్. జంగయ్య, మంద పాపమ్మ, మంద లక్ష్మమ్మ, మంద జంగయ్య, నల్లోల్ల మల్లయ్య నల్లోల్ల రాములు, నల్లోల్ల క్రిష్ణయ్య నల్లోల్ల వెంకటయ్య,	176	184	184	178	-	-	-
69	186/అ	పట్టా	మెట్ట	2.20	బొమ్మిడి సత్య నారాయణ తండ్రి దానయ్య గ్రా॥ మేడిపల్లి	పలమోని సత్య నారాయణ	మోతి క్రిష్ణ	పరికొండ రోడ్	ఇతరుల భూమి	-	-	-
70	186/అ	పట్టా	మెట్ట	2.20	జిల్లెల్ల అరుణ, కె. మోహన్‌దాస్ తండ్రి జంగయ్య, డి. సత్యనారాయణ తండ్రి కిష్టయ్య డి. క్రిష్ణారెడ్డి తండ్రి వెంకట్ రెడ్డి, ధర్మారెడ్డి తండ్రి వెంకట్ రెడ్డి	సత్య నారాయణ	రోడ్	సైరాన్	యస్.సి. భూములు	-	-	-
71	186/ఇ	పట్టా	మెట్ట	2.20	మోతి క్రిష్ణ తండ్రి మల్లయ్య గ్రా॥ మేడిపల్లి	సత్య నారాయణ	సైరాన్	రోడ్	యస్.సి. భూములు	-	-	-
72	186/ఈ	పట్టా	మెట్ట	2.19	విస్లావత్ లోక్య తండ్రి పూల్య గ్రా॥ మేడిపల్లి	మోతి క్రిష్ణ	సైరాన్	రోడ్	సైరాన్	-	-	-
73	186/ఉ	పట్టా	మెట్ట	2.19	బి. సుదర్శన్ రెడ్డి తండ్రి నారాయణరెడ్డి గ్రా॥ మేడిపల్లి	మోతి క్రిష్ణ	సైరాన్	రోడ్	సైరాన్	-	-	-
74	186/రు	పట్టా	మెట్ట	1.26	విస్లావత్ పూల్య తండ్రి హనుమ గ్రా॥ మేడిపల్లి	వెంకటయ్య	రోడ్	మోతి లక్ష్మయ్య	బి. సత్య నారాయణ	-	-	-
75	186/రూ	పట్టా	మెట్ట	0.33	బొగ్గుల మాధవరెడ్డి తండ్రి మల్లారెడ్డి గ్రా॥ మేడిపల్లి	రమేష్	రోడ్	అల్లయ్య	పూల్య	-	-	-
76	186/ఎ	పట్టా	మెట్ట	4.39	సబావత్ చందర్ తండ్రి పూల్య గ్రా॥ మేడిపల్లి	సర్రి	రోడ్	అమర జలీక్	సైరాన్	-	-	-
77	187/అ	పట్టా	మెట్ట	0.19	పూల్య, బొగ్గుల పాపిరెడ్డి తండ్రి వెంకటరెడ్డి	ముచ్చర్ల వెంకటయ్య	పరికొండ రోడ్	మోతి లక్ష్మయ్య	సత్య నారాయణ	-	-	-
78	187/ఆ	పట్టా	మెట్ట	0.25	బొగ్గుల అశోక్ రెడ్డి తండ్రి మల్లారెడ్డి గ్రా॥ మేడిపల్లి	వెంకటయ్య	పరికొండ రోడ్	లక్ష్మయ్య	సత్య నారాయణ	-	-	-
79	187/ఇ	పట్టా	మెట్ట	2.00	పాలి లక్ష్మయ్య తండ్రి పెద్దపుల్లయ్య గ్రా॥ మేడిపల్లి	సిందం జంగయ్య	చంద్రయ్య	రోడ్	గణేష్	-	-	-
80	187/ఈ	పట్టా	మెట్ట	1.31	జిల్లెల్ల అరుణ భర్త ప్రభాకర్ రెడ్డి గ్రా॥ మేడిపల్లి	సత్య నారాయణ	సైరాన్	రోడ్	యస్.సి భూములు	-	-	-
81	187/రు	పట్టా	మెట్ట	3.20	పలమోని సత్తమ్మ భర్త సత్యనారాయణ గ్రా॥ మేడిపల్లి	గణేష్	అశోక్ రెడ్డి	ఆరెపల్లి రాంచంద్రి	జిల్లెల్ల జంగారెడ్డి	-	-	-
82	187/ఎ	పట్టా	మెట్ట	0.23	బొగ్గుల మాధవరెడ్డి తండ్రి మల్లారెడ్డి గ్రా॥ మేడిపల్లి	వెంకటయ్య	రోడ్	మోతి లక్ష్మయ్య	బి. సత్య నారాయణ	-	-	-
83	187/రూ	పట్టా	మెట్ట	1.20	పలమోని సత్యనారాయణ,తండ్రి జంగయ్య గ్రా॥ మేడిపల్లి	గణేష్	ఆరెపల్లి రాంచంద్రి	అశోక్ రెడ్డి	జిల్లెల్ల పాపిరెడ్డి	-	-	-
84	187/లు	పట్టా	మెట్ట	1.14	ఇస్లావత్ పూల్య తండ్రి హనుమ గ్రా॥ మేడిపల్లి	వెంకటయ్య	రోడ్	మోతి లక్ష్మయ్య	బి. సత్య నారాయణ	-	-	-
85	187/లూ	పట్టా	మెట్ట	0.20	బొమ్మిడి సత్యనారాయణ, తండ్రి దానయ్య గ్రా॥ మేడిపల్లి	పూల్య	జలీక్	రోడ్	సర్రి	-	-	-
86	188/అ/1	పట్టా	మెట్ట	3.19	గొదాసు బుచ్చయ్య తండ్రి అంజయ్య గ్రా॥ మేడిపల్లి	ఆరెపల్లి రాంచంద్రి	యస్.సి. భూములు	కవమోని సత్యనారాయణ	వెంకటేశ్	-	-	-
87	188/అ/2	పట్టా	మెట్ట	1.00	చెవమోని ఉమ భర్త జగన్ గ్రా॥ మేడిపల్లి	ఆరెపల్లి రాంచంద్రి	యస్.సి. భూములు	కవమోని సత్యనారాయణ	వెంకటేశ్	-	-	-
88	188/ఇ	పట్టా	మెట్ట	4.19	గొదాసు నర్సింహ తండ్రి అంజయ్య గ్రా॥ మేడిపల్లి	వెంకటేశ్	యస్.సి. భూములు	బుచ్చయ్య	రాంచంద్రి	-	-	-
89	188/ఈ	పట్టా	మెట్ట	2.00	ఆరెపల్లి వెంకటమ్మ భర్త రాంచంద్రి గ్రా॥ మేడిపల్లి	బుగ్గ రాములు	యస్.సి. భూములు	సత్యనారాయణ	గొదాసు నర్సింహ	-	-	-
90	189/అ	పట్టా	మెట్ట	2.00	ఆరెపల్లి రాంచంద్రి తండ్రి లింగయ్య గ్రా॥ మేడిపల్లి	గొల్లోండ రాములు	పలమోని క్రిష్ణ	కె. సత్యనారాయణ	గొదాసు బుచ్చయ్య	తుమ్మ-3 వేప-1 మామిడి-3 కొబ్బరి-3 నిమ్మ-2 జామ-2 యుకలిప్టస్-14	-	-
91	189/ఆ	పట్టా	మెట్ట	3.00	గొల్లోండ రాములు తండ్రి మైసయ్య గ్రా॥ మేడిపల్లి	ముచ్చర్ల చంద్రయ్య	గొల్ల ఎల్లమ్మ	లక్ష్మయ్య	ఆరెపల్లి రాంచంద్రి	మామిడి-5 పనస-1 కొబ్బరి-1 తుమ్మ-5 దానిమ్మ-1 బాదం-1	-	-
92	189/ఇ	పట్టా	మెట్ట	4.27	ఆరెపల్లి రాంచంద్రి తండ్రి లింగయ్య గ్రా॥ మేడిపల్లి	గొల్లోండ రాములు	పలమోని క్రిష్ణ	పాలమోని సత్యనారాయణ	గొదాసు బుచ్చయ్య	-	-	-
93	189/ఈ	పట్టా	మెట్ట	3.00	ముచ్చర్ల చంద్రయ్య తండ్రి సత్తయ్య గ్రా॥ మేడిపల్లి	సిందం క్రిష్ణ	ప్రభుత్వ భూమి	పాలి లక్ష్మయ్య	ముచ్చర్ల చంద్రయ్య	వేప-4	-	-
94	189/ఉ	పట్టా	మెట్ట	3.00	మొరుగు చంద్రయ్య తండ్రి మైసయ్య గ్రా॥ మేడిపల్లి	సిందం జంగయ్య	సైరన్	పాలి లక్ష్మయ్య	యం. చంద్రయ్య	-	-	-
95	189/ఊ	పట్టా	మెట్ట	0.04	శశిభూషన్ రావు తండ్రి వరాంకుశ రావు గ్రా॥ మేడిపల్లి	-	-	-	-	-	-	-
96	190/అ	పట్టా	మెట్ట	0.10	బొగ్గుల మహేశ భర్త జంగారెడ్డి బొగ్గుల అచ్చి రెడ్డి తండ్రి జంగారెడ్డి	మొరుగు రవి	పాలి లక్ష్మయ్య	బొగ్గుల మాధవ రెడ్డి	పలమోని సత్యనారాయణ	-	-	-
97	190/ఆ	పట్టా	మెట్ట	0.10	పరికొండ రోడ్, బొగ్గుల మాధవరెడ్డి తండ్రి మల్లారెడ్డి	-	-	-	-	-	-	-
98	190/ఇ	పట్టా	మెట్ట	0.15	పాలి లక్ష్మయ్య తండ్రి పుల్లయ్య గ్రా॥ మేడిపల్లి	సిందం జంగయ్య	మొరుగు చంద్రయ్య	పరికొండ రోడ్	కావలి గణేష్	కొబ్బరి-4	-	-
99	190/ఈ	పట్టా	మెట్ట	0.19	బొల్లపల్లి లలిత్‌కుమారి భర్త వెంకటరాజారెడ్డి, బొగ్గుల పాపిరెడ్డి తండ్రి వెంకట్ రెడ్డి	మొరుగు రవి	కవమోని సత్యనారాయణ	ముచ్చర్ల జంగయ్య	పూల్య	-	-	-
100	190/ఉ	పట్టా	మెట్ట	0.19	బొగ్గుల అశోక్ రెడ్డి తండ్రి వెంకట్ రెడ్డి గ్రా॥ మేడిపల్లి	మొరుగు రవి	కవమోని సత్యనారాయణ	ముచ్చర్ల జంగయ్య	పూల్య	-	-	-
101	190/ఊ	పట్టా	మెట్ట	0.38	ముచ్చర్ల వెంకటయ్య, జిల్లెల్ల ప్రభాకర్ రెడ్డి తండ్రి జంగారెడ్డి	మొరుగు రవి	బి. మాధవ రెడ్డి	మోతి క్రిష్ణ	పూల్య	-	-	-
102	190/ఎ	పట్టా	మెట్ట	0.12	బొగ్గుల అచ్చిరెడ్డి తండ్రి మల్లారెడ్డి గ్రా॥ మేడిపల్లి	మొరుగు రవి	పి. సత్య నారాయణ	యం. అబ్బయ్య	పూల్య	-	-	-
103	190/ఏ	పట్టా	మెట్ట	0.13	బొగ్గుల అశోక్ రెడ్డి తండ్రి మల్లారెడ్డి గ్రా॥ మేడిపల్లి	మొరుగు రవి	పి. సత్య నారాయణ	యం. అబ్బయ్య	పూల్య	-	-	-
104	190/ఐ	పట్టా	మెట్ట	0.13	బొగ్గుల మాధవ రెడ్డి తండ్రి మల్లారెడ్డి గ్రా॥ మేడిపల్లి	మొరుగు రవి	పి. సత్య నారాయణ	యం. అబ్బయ్య	పూల్య	-	-	-
105	190/రు	పట్టా	మెట్ట	0.19	వెంటయ్య, అబ్బయ్య, జంగయ్య, జిల్లెల్ల శ్రీనివాస్ రెడ్డి తండ్రి పాపిరెడ్డి గ్రా॥ మేడిపల్లి	మొరుగు రవి	బి. అశోక్ రెడ్డి	మోతి బాలయ్య	పూల్య	-	-	-
106	190/రూ	పట్టా	మెట్ట	0.19	వెంటయ్య, అబ్బయ్య, జంగయ్య, జిల్లెల్ల యాదవ రెడ్డి తండ్రి పాపిరెడ్డి గ్రా॥ మేడిపల్లి	మొరుగు రవి	బి. అశోక్ రెడ్డి	మోతి బాలయ్య	పూల్య	-	-	-
107	190/లు	పట్టా	మెట్ట	1.36	పాలమోని సత్తమ్మ భర్త సత్యనారాయణ గ్రా॥ మేడిపల్లి	సిందం జంగయ్య	పరికొండ రోడ్	బి. అచ్చి రెడ్డి	పూల్య	-	-	-
108	190/లూ	పట్టా	మెట్ట	1.20	పాలమోని సత్యనారాయణ, తండ్రి జంగయ్య గ్రా॥ మేడిపల్లి	సిందం జంగయ్య	పరికొండ రోడ్	బి. అచ్చి రెడ్డి	పూల్య	-	-	-
109	191/అ	పట్టా	మెట్ట	1.10	బొల్లపల్లి లలిత్‌కుమారి భర్త వెంకట రాజ రెడ్డి, బొగ్గుల పాపిరెడ్డి తండ్రి వెంకట్ రెడ్డి	యం. రవి	పలమోని సత్యనారాయణ	ముచ్చర్ల వెంకటయ్య	పూల్య	-	-	-
110	191/ఆ	పట్టా	మెట్ట	1.09	పూల్య, బి. కొండారెడ్డి తండ్రి వెంకట్ రెడ్డి	ముచ్చర్ల వెంకటయ్య	పరికొండ రోడ్	మోతి లక్ష్మయ్య	బొడ్డు సత్యనారాయణ	-	-	-
111	191/ఇ/1	పట్టా	మెట్ట	1.05	బొగ్గుల శేఖర్ రెడ్డి తండ్రి జంగారెడ్డి, బి. జంగారెడ్డి	పి. సత్య నారాయణ	బి. మాధవ రెడ్డి	మొరుగు చంద్రయ్య	సిందం జంగయ్య	-	-	-
112	191/ఇ/2	పట్టా	మెట్ట	0.15	బి. అచ్చిరెడ్డి తండ్రి జంగారెడ్డి గ్రా॥ మేడిపల్లి	సిందం జంగయ్య	బి. అశోక్ రెడ్డి	మొరుగు చంద్రయ్య	కవమోని సత్యనారాయణ	-	-	-
113	191/ఈ	పట్టా	మెట్ట	2.19	వెంటయ్య, అబ్బయ్య, జంగయ్య, జిల్లెల్ల ప్రభాకర్ రెడ్డి, తండ్రి జంగారెడ్డి గ్రా॥ మేడిపల్లి	యం. రవి	బి. అచ్చి రెడ్డి	మోతి క్రిష్ణ	పూల్య	-	-	-
114	191/ఉ	పట్టా	మెట్ట	1.09 1/2	వెంటయ్య, అబ్బయ్య, జంగయ్య, జిల్లెల్ల యాదవ్ రెడ్డి, తండ్రి పాపిరెడ్డి గ్రా॥ మేడిపల్లి	యం. రవి	బి. అచ్చి రెడ్డి	మోతి క్రిష్ణ	పూల్య	-	-	-
115	191/ఊ	పట్టా	మెట్ట	1.09 1/2	వెంటయ్య, అబ్బయ్య, జంగయ్య, జిల్లెల్ల శ్రీనివాస్ రెడ్డి, తండ్రి పాపిరెడ్డి గ్రా॥ మేడిపల్లి	యం. రవి	బి. అచ్చి రెడ్డి	మోతి క్రిష్ణ	పూల్య	-	-	-
116	191/ఎ	పట్టా	మెట్ట	0.33	బొగ్గుల మాధవరెడ్డి తండ్రి మల్లారెడ్డి గ్రా॥ మేడిపల్లి	యం. రవి	సత్యనారాయణ	ముచ్చర్ల జంగయ్య	పూల్య	-	-	-
117	191/ఏ	పట్టా	మెట్ట	1.38	ముచ్చర్ల అంజమ్మ భర్త లక్ష్మయ్య గ్రా॥ మేడిపల్లి	పాలి లక్ష్మయ్య	చంద్రయ్య	పరికొండ రోడ్	కవమోని సత్యనారాయణ	కొబ్బరి-6 తాటి-1	-	-
118	191/రు/1	పట్టా	మెట్ట	1.37	పాలమోని సత్తమ్మ భర్త సత్యనారాయణ గ్రా॥ మేడిపల్లి	యం. గణేష్	బుగ్గ రాములు	అశోక్ రెడ్డి	జిల్లెల్ల జంగారెడ్డి	-	-	-
119	191/రు/2	పట్టా	మెట్ట	3.00	పి. లీలావతి భర్త బుగ్గ రాములు గ్రా॥ మేడిపల్లి	యం. గణేష్	బుగ్గ రాములు	అశోక్ రెడ్డి	జిల్లెల్ల జంగారెడ్డి	-	-	-
120	191/రూ	పట్టా	మెట్ట	1.20	పాలమోని సత్యనారాయణ తండ్రి జంగయ్య గ్రా॥ మేడిపల్లి	యం. గణేష్	బుగ్గ రాములు	అచ్చి రెడ్డి	జిల్లెల్ల పాపిరెడ్డి	-	-	-
121	191/లు	పట్టా	మెట్ట	0.33	బొగ్గుల అచ్చిరెడ్డి తండ్రి మల్లారెడ్డి గ్రా॥ మేడిపల్లి	యం. రమేశ్	సత్య నారాయణ	యం. జంగయ్య	పూల్య	-	-	-
122	191/లూ	పట్టా	మెట్ట	0.32	బొగ్గుల అశోక్ రెడ్డి తండ్రి మల్లారెడ్డి గ్రా॥ మేడిపల్లి	యం. రమేశ్	సత్య నారాయణ	యం. జంగయ్య	పూల్య	-	-	-
123	193/అ	పట్టా	మెట్ట	2.20	మండగలకల చంద్రయ్య తండ్రి పెంటయ్య గ్రా॥ మేడిపల్లి	మక్కపల్లి బుచ్చయ్య	మోతి నర్సింహ	మక్కపల్లి బుచ్చయ్య	మోతి శ్రీశైలం	వేప-1	-	-
124	193/ఆ	పట్టా	మెట్ట	4.04	మక్కపల్లి చంద్రయ్య తండ్రి ముత్తయ్య	కల్లూరి వెంకటరెడ్డి ఇతరులు	192	దొంక	మోతి శ్రీశైలం	తుమ్మ-18 కొబ్బరి-2 వేప-2 జామ-8 నిమ్మ-7 యుకలిప్టస్-3	-	-
125	193/1	పట్టా	మెట్ట	1.10	యం. క్రిష్ణయ్య తండ్రి రాములు, మోతి మల్లమ్మ, యం. శ్రీశైలం, తండ్రి రాములు, మోతి మల్లమ్మ	యం. బుచ్చయ్య	191	దొంక	194	చింత-1	-	-
126	193/ఈ	పట్టా	మెట్ట	0.12 1/2	మోతి నర్సింహ తండ్రి మోతి మల్లయ్య	యం. రాములు	191	దొంక	194	-	-	-
127	194	పట్టా	మెట్ట	2.18	మోతి రాములు తండ్రి రాజయ్య గ్రా॥ మేడిపల్లి	192 & ఇతరులు	పూల్య ఇతరులు	196, దొంక	195, 197	-	-	-
128	194/అ/1	పట్టా	మెట్ట	1.00	ముచ్చర్ల కళమ్మ భర్త జంగయ్య గ్రా॥ మేడిపల్లి	192 & ఇతరులు	పూల్య ఇతరులు	196, దొంక	195, 197	-	-	-
129	194/అ/1	పట్టా	మెట్ట	0.25	మోతి నర్సింహ తండ్రి మల్లయ్య గ్రా॥ మేడిపల్లి	192 & ఇతరులు	పూల్య ఇతరులు	196, దొంక	195, 197	-	-	-
130	194/అ/4	పట్టా	మెట్ట	1.00	ముచ్చర్ల కళమ్మ భర్త జంగయ్య గ్రా॥ మేడిపల్లి	192 & ఇతరులు	పూల్య ఇతరులు	196, దొంక	195, 197	-	-	-
131	194/ఇ/1	పట్టా	మెట్ట	1.00	ముచ్చర్ల కళమ్మ భర్త జంగయ్య గ్రా॥ మేడిపల్లి	192 & ఇతరులు	పూల్య ఇతరులు	196, దొంక	195, 197	-	-	-
132	195/అ	పట్టా	మెట్ట	4.18	మోతి మల్లమ్మ భర్త మల్లయ్య కల్లూరి మల్లారెడ్డి తండ్రి సాయిరెడ్డి అవిన జలయ్య అవిన మల్లయ్య	మోతి లక్ష్మయ్య	బొడ్డు సత్యనారాయణ	195/అ	ఎరుపుల రాములు	-	-	-
133	195/ఆ	పట్టా	మెట్ట	2.20	పి. అలివేలు భర్త భాష	మోతి లక్ష్మయ్య	బొడ్డు సత్యనారాయణ	195/అ	ఎరుపుల రాములు	-	-	-
134	195/ఇ	పట్టా	మెట్ట	2.20	అర్ర జంగమ్మ భర్త మల్లయ్య	మోతి లక్ష్మయ్య	బొడ్డు సత్యనారాయణ	195/అ	ఎరుపుల రాములు	-	-	-

మొత్తము 186.33½

భూసేకరణలో పారదర్శకం న్యాయబద్ధమైన నష్టపరిహారం రిహాబిలిటేషన్ మరియు రీసెటిల్‌మెంట్ చట్టం 2013 (కేంద్రప్రభుత్వ చట్టం 30/2013లోని సెక్షన్11(1) క్రింద మరియు సవరించిన న్యాయ బద్ధమైన నష్టపరిహారం మరియు భూసేకరణలో పారదర్శకం, రిహాబిలిటేషన్ మరియు రీసెటిల్‌మెంట్ (తెలంగాణ సవరణ) చట్టం 2016 (చట్టం నెం. 21/2017) ప్రకారం ఆసక్తి గల వ్యక్తులందరికీ తెలియ చేయుడమైనది.

సేకరణ భూమి యొక్క ప్లాన్ మరియు వివరములు భూసేకరణ అధికారి/రెవెన్యూ డివిజనల్ అధికారి ఇబ్రహీంపట్నం డివిజన్ కార్యాలయములో అందుబాటులో ఉండును. ఆసక్తి గల వ్యక్తులెవరైనను ప్రభుత్వ పనిదినములలో మరియు పనివేళలలో తనిఖీ చేసుకోవచ్చును. తెలంగాణ ప్రభుత్వము/కలెక్టర్, రంగారెడ్డి జిల్లాగారు చట్టంలో సెక్షన్ 12 ప్రకారం కల్పించిన మరియు పేర్కొన్నట్లుగా వారి పనిని నిర్వహించుటకు అవసరమైన అన్ని ఇతర పనులు అనగా భూమి సర్వే భూమి పరిశీలన కొరకు భూమి పొరలను త్రవ్వుటకు మరియు సంబంధిత పనులు చేయుటకు కావలసిన అన్ని చర్యలు నిర్వహించుటకు భూసేకరణ అధికారి/రెవెన్యూ డివిజనల్ అధికారి ఇబ్రహీంపట్నం డివిజన్, రంగారెడ్డి జిల్లా గారిని నియమించినారు.

చట్టం యొక్క సెక్షన్ 11(4) క్రింద కలెక్టరు గారి ముందస్తు అనుమతి లేకుండా ఈ ప్రకటన ప్రచురణ తేది నుండి పదరు స్థలములో ఏ వ్యక్తి కూడా భూమి యొక్క ఏదేని లావాదేవీలు అనగా అమ్మకం/కొనుగోలు/లేదా ఏదేని తాకట్టు రుణభారాలను చేయరాదు.

భూసేకరణ సంబంధించి ఏదైనా అభ్యంతరాలు ఉన్నట్టయితే భూసేకరణ అధికారి/రెవెన్యూ డివిజనల్ అధికారి, ఇబ్రహీంపట్నం డివిజన్, రంగారెడ్డి జిల్లా ముందు చట్టం యొక్క సెక్షన్ 15 క్రింద పేర్కొన్నట్లుగా ఈ ప్రకటన ప్రచురణ తేది నుండి 60 (అరవైరోజులు)లోపు ఆసక్తిగల వ్యక్తులు దాఖలు చేసుకోవచ్చును.

తహసీల్దారు, యాచారం మండలం, రంగారెడ్డి జిల్లా.	భూసేకరణ అధికారి/ రెవెన్యూ డివిజనల్ అధికారి ఇబ్రహీంపట్నం డివిజన్, రంగారెడ్డి	జాయింట్ కలెక్టర్ రంగారెడ్డి	జిల్లా కలెక్టర్ రంగారెడ్డి

పి.ఎం.భార్గవకు కన్నీటి వీడ్కోలు



↑ భార్గవ భౌతిక కాయానికి నివాళి అర్పిస్తున్న సిపిఐ నేతలు కె.నారాయణ, పల్లా వెంకటరెడ్డి, అజీజ్ పాషా.



← భార్గవకు గౌరవ వందనం సమర్పిస్తున్న పోలీసులు

మన తెలంగాణ/హైదరాబాద్ సిటీ బ్యూరో: ప్రముఖ శాస్త్రవేత్త, సిసిఎంబి వ్యవస్థాపక డైరెక్టర్ డాక్టర్ పుష్పమిత్ర (పి.ఎం) భార్గవ అంత్యక్రియలు శుక్రవారం అధికార లాంఛనాలతో జూబ్లీహిల్స్‌లోని మహాప్రస్థానంలో జరిగాయి. ఉదయం ఉప్పల్ ప్రశాంతి నగర్‌లోని ఆయన స్వగృహం నుంచి ప్రారంభమైన భార్గవ అంతిమ యాత్ర మధ్యాహ్నం 2.30 గంటలకు మహా ప్రస్థానానికి చేరుకుంది. అక్కడ జరిగిన భార్గవ అంత్యక్రియల్లో పలువురు శాస్త్రవేత్తలు, డాక్టర్లతో పాటు ఆయన సమ కాలికులు హాజరయ్యారు. అంత్యక్రియల ఏర్పాట్లను జిఎడి (ప్రొటో కాల్) సెక్రటరీ అర్విందర్ సింగ్, జిల్లా ఇంఛార్జీ కలెక్టర్ ఎం.ప్రశాంతి పర్యవేక్షించగా, గౌరవ సూచకంగా పోలీసులు గాలి లోకి రౌండ్లు కాల్పులు జరిపి గౌరవ వందనం సమర్పించారు. భార్గవ పార్థివ దేహానికి చివరి సారిగా సహచరులు కుటుంబ సభ్యులు నివాళ్లు అర్పించిన అనంతరం అంతక్రియలను పూర్తి చేశారు. అంతకు ముందు సిపిఐ జాతీయ కార్యదర్శి డాక్టర్ కె.నారాయణ, సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి పల్లా వెంకట రెడ్డి, మాజీ ఎం.పి. సయ్యద్ అజీజ్ పాషా, కల్పనా కన్నాభిరావ్ , బయెమాటిక్ ఎం.డి వరప్రసాద్‌రెడ్డి, సిసిఎంబి డైరెక్టర్ రాకేశ్ మిశ్రా, మాజీ డైరెక్టర్ లాల్‌జాన్ పాషా, ప్రొఫెసర్ రమామాల్కెటే ప్రముఖ వైద్యులు కాకర్ల సుబ్బా రావు, డాక్టర్ వినయ్, ఫోరం ఫర్ ఎ బెటర్ హైదరాబాద్ అధ్యక్షులు ఎం. వేదకుమార్, రంగారావుతో పాటు పలువురు ప్రముఖులు భార్గవ భౌతికకాయాన్ని సందర్శించినివాళ్లు అర్పించి, కుమారుడు మోహిత్ భార్గవ, కూతురు వనిత భట్టాచార్యలను పరామర్శించారు. భార్గవ పార్థివ దేహంపై ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఎస్‌పి.సింగ్ పుష్పగుచ్ఛం ఉంచి నివాళులు అర్పించారు.


సిఎం సంతాపం : భార్గవ మృతిపట్ల సిఎం సంతాపం వ్యక్తం చేశారు. సిసిఎంబి ఏర్పాటు చేయడంతో పాటు కణజీవ శాస్త్రంలో భార్గవ చేసిన కృషి అపారమని కొనియాడారు.

బాలీవుడ్ చాలా బెటర్


నదియా

ఒకప్పటి సూపర్ హీరోయిన్ అయిన నదియా ఇప్పుడు సూపర్ మామ్ అయ్యారు. అయితే అందమైన అమ్మగా తమిళంలో రీ ఎంట్రీనిచ్చిన ఆమె ఇప్పుడు తెలుగులోనే ఎక్కువగా కనిపిస్తున్నారు. 40 ఏళ్లు మీద పడ్డ నదియాకు అంత వయసు ఉందని అనిపించదు. ఈ గ్లామర్ రహస్యం ఏమిటోగానీ తన క్రేజ్‌తో ఇప్పటికీ వాణిజ్య ప్రకటనల్లోనూ నటిస్తున్నారు. అలాంటి నదియా కోలీవుడ్‌పై ఆరోపణలు చేస్తున్నారు. తనలాంటి 40 ఏళ్ల మహిళలకు ఇక్కడ పాత్రలు తక్కువేనని... ఈ విషయంలో బాలీవుడ్ చాలా బెటర్ అని పేర్కొన్నారు. అక్కడ నటీమణుల కోసం మంచి పాత్రలు రూపొందిస్తున్నారని అన్నారు. మీరు కూడా హిందీ సినిమాల్లో నటించవచ్చు కదా అని అడుగుతున్నారని... అక్కడ తనకు అవకాశాలు వస్తున్నాయని, ఇటీవల కూడా ఒక తమిళ చిత్రం రీమేక్‌లో నటించమని అడిగారని తెలిపారు. అయితే ఆ చిత్రంలో పాత్ర తనకు నచ్చకపోవడంతో నిరాకరించినట్లు చెప్పారు. దక్షిణాదిలో తనకు అవకాశాలు బాగా వస్తున్నాయని, అయితే 'ఎం.కుమరన్ సన్ ఆఫ్ మహాలక్ష్మీ' చిత్రం తర్వాత తనను అందరూ అందమైన అమ్మగానే చిత్రీకరించడానికి ఆసక్తి చూపుతున్నారన్నారు. వేరేవిధంగా చూపిస్తే బాగుంటుందని... 40 ఏళ్ల స్త్రీ గురించి పాత్రలు సృష్టించడానికి ఎన్నో విషయాలు ఉన్నాయన్నారు. ఈ విషయాన్ని దర్శకులు దృష్టిలో పెట్టుకోవాలని నదియా సూచించారు.

స్వాతంత్ర్య దినోత్సవ కానుకగా ఫస్ట్‌లుక్


పవన్‌కళ్యాణ్

ఈ ఏడాది వేసవి ఆరంభంలో మూడు భారీ తెలుగు సినిమాలు సెట్స్‌పైకి వెళ్లాయి. అందులో ఒకటైన 'పైసా వసూల్' షూటింగ్ పూర్తిచేసుకొని విడుదలకు కూడా సిద్ధమైపోయింది. ఇప్పటికే ఫస్ట్‌లుక్, స్టంపర్ రిలీజయ్యాయి. త్వరలోనే ఆడియో ఆవిష్కరణ కూడా జరుగనుంది. ఇక రెండో సినిమా 'జై లవకుశ'కు సంబంధించి లోగో, ఫస్ట్‌లుక్స్, ఒక టీజర్ కూడా వచ్చాయి. ఇంకో రెండు టీజర్ల విడుదలకు సన్నాహాలు చేస్తున్నారు. కానీ ఈ సినిమాలతో పాటే సెట్స్‌పైకి వెళ్లిన పవన్‌కళ్యాణ్‌త్రివిక్రమ్ సినిమాకు సంబంధించి మాత్రం ఇప్పటిదాకా ఏవీ రిలీజ్ కాలేదు. దీని టైటిల్ కూడా ఇప్పటిదాకా ప్రకటించలేదు. ఫస్ట్‌లుక్ కూడా రాలేదు. దీంతో పవన్ అభిమానులు నిరాశచెందుతున్నారు. అయితే త్వరలోనే పవన్ తన అభిమానులను మురిపించబోతున్నారని తెలిసింది. ఆగస్టు 15న స్వాతంత్ర్య దినోత్సవ కానుకగా పవన్‌త్రివిక్రమ్ సినిమా ఫస్ట్‌లుక్ పోస్టర్ లాంచ్ చేస్తారట. అప్పుడే టైటిల్ కూడా ప్రకటిస్తారని సమాచారం. దీనిపై రెండు, మూడు రోజుల్లో అధికారిక ప్రకటన వచ్చే అవకాశముంది. ఈ చిత్రానికి ఇంజనీర్ బాబు, గోపాలకృష్ణ, పరదేశ ప్రయాణం వంటి టైటిల్లను పరిశీలిస్తున్నట్టు తెలిసింది. మరి వీటిలో ఏదైనా ఒక టైటిల్‌ను త్రివిక్రమ్ ఫైనల్ చేస్తాడా లేదా కొత్త టైటిల్ ఎంచుకుంటాడా అనేది చూడాలి. ఈ చిత్రంలో పవన్ సరసన కీర్తి సురేష్, అను ఇమాన్యుయల్ హీరోయిన్లుగా నటిస్తున్నారు.

త్రిష అంటే చాలా ఇష్టం

నితిన్ హీరోగా 14 రీల్స్ ఎంటర్‌టైన్‌మెంట్ ప్రై. లిమిటెడ్ పతాకంపై హను రాఘవపూడి దర్శకత్వంలో రామ్ ఆచంట, గోపీ ఆచంట, అనీల్ సుంకర నిర్మించిన భారీ చిత్రం 'లై'. ఈ చిత్రం ద్వారా హీరోయిన్‌గా మేఘా ఆకాష్ తెలుగు ప్రేక్షకులకు పరిచయమవుతోంది. ఈ చిత్రం ఈనెల 11న రిలీజ్‌కానుంది. ఈ సందర్భంగా మేఘా ఆకాష్‌తో ఇంటర్వ్యూ విశేషాలు..


మేఘా ఆకాష్



చెన్నైలో పెరిగాను...
మా నాన్న ఆకాష్‌రాజా తెలుగు వారు కాగా అమ్మ బిందు రాజా మలయాళీ. చెన్నైలో పెరిగిన నేను అక్కడే విజువల్ కమ్యునికేషన్స్‌లో డిగ్రీ పూర్తిచేశాను. చిన్నప్పటి నుంచి నాకు సినిమాలంటే ఎంతో ఇష్టం.

గౌతమ్‌మీనన్ సినిమా చేస్తుండగా...
గౌతమ్ మీనన్ దర్శకత్వంలో సినిమా షూటింగ్ జరుగుతుండగా ఈ స్క్రిప్ట్ నా దగ్గరకు వచ్చింది. కథ వినగానే నచ్చి ఈ సినిమాకు ఒప్పుకున్నాను. అయితే తమిళంలో ప్రస్తుతం రెండు సినిమాలు చేస్తున్నాను. వాటిలో గౌతమ్ మీనన్, ధనుష్‌ల సినిమా ఒకటి. అలాగే బాలాజీ డైరెక్షన్‌లో మరో సినిమా చేస్తున్నాను. అవి రెండు చివరి దశల్లో ఉన్నాయి.

'లై' చిత్రమే ముందుగా...
నా తమిళ సినిమాలకంటే ముందుగా 'లై' చిత్రం ముందుగా రిలీజవుతుంది. ఒక తెలుగు సినిమా నా మొదటి సినిమా కావడం చాలా సంతోషంగా ఉంది. ఈ సినిమా ఖచ్చితంగా విజయం సాధిస్తుందన్న నమ్మకముంది.

ఎనర్జిటిక్ క్యారెక్టర్...
సినిమాలో నా క్యారెక్టర్ పేరు చైత్ర. చాలా ఎనర్జిటిక్‌గా ఉంటుంది. ఎప్పుడు హుషారుగా మాట్లాడుతుండే క్యారెక్టర్ నాది. నిజానికి రియల్ లైఫ్‌లో నేను అలా ఉండను. నా క్యారెక్టర్ కేవలం పాటల కోసం మాత్రమే కాదు. నాకు కూడా కథలో ప్రాధాన్యత ఉంటుంది.

ఎంతో ఆనందంగా ఉంది...
నితిన్‌తో కలిసి పనిచేయడం ఎంతో ఆనందంగా ఉంది. అతను నాకు అర్థం కాని విషయాల్ని చాలా ఓపికగా వివరించేవాడు. ఇలా చేస్తే బాగుంటుంది అని సలహాలు ఇచ్చేవాడు. అతను సెట్స్‌లో డౌన్ టు ఎర్త్‌గా ఉంటాడు. కష్టపడి పనిచేస్తాడు. ఎప్పుడూ సరదాగా మాట్లాడుతుంటాడు.

ఆయన వర్క్ డిఫరెంట్‌గా...
హను రాఘవపూడి మంచి డైరెక్టర్. ఆయన వర్క్ చాలా డిఫరెంట్‌గా ఉంటుంది. నా నుంచి మంచి నటనను రాబట్టుకున్నారు. ఆయన వల్లే ఎంతో ఆత్మ విశ్వాసంగా ఈ సినిమాను చేయగలిగాను.

అద్భుతంగా తెరకెక్కింది...
'లై' కోసం 75 రోజుల పాటు యుఎస్‌లోని లాస్‌వెగాస్, శాన్ ఫ్రాన్సిస్కో, చికాగో వంటి ప్రాంతాల్లో షూటింగ్ చేశాం. ఎంతో కష్టమైన షెడ్యూల్ ఇది. అయినా మంచి టీమ్ అవడం వల్ల సినిమా అద్భుతంగా తెరకెక్కింది.

అలియాభట్ నటన నచ్చుతుంది...
నాకు త్రిష అంటే చాలా ఇష్టం. బాలీవుడ్‌లో అలియాభట్ నటన నచ్చుతుంది. ఎందుకంటే చిన్న వయసులోనే ఎన్నో విభిన్నమైన పాత్రలు తను చేస్తోంది కాబట్టి. ఇక హీరోల విషయానికొస్తే తెలుగులో పవన్‌కళ్యాణ్ అంటే ఇష్టం.

నెక్స్ట మూవీ...
పవన్‌నితిన్ సినిమాలో హీరోయిన్‌గా చేసేందుకు ఓకే అన్నాను. ఈ సినిమా స్క్రిప్ట్ నాకెంతగానో నచ్చింది. అయితే గౌతమ్ మీనన్ సినిమాతో బిజీగా ఉండడం వల్ల రామ్ సినిమాను వదులుకోవాల్సి వచ్చింది.

కామెడీ హైలైట్‌గా 'నేను కిడ్నాప్ అయ్యాను'



మధురం మూవీ క్రియేషన్స్ పతాకంపై కిడ్నాప్ డ్రామా నేపథ్యంలో దగ్గుబాటి వరుణ్ సమర్పణలో మాధవి అద్దంకి నిర్మించిన చిత్రం 'నేను కిడ్నాప్ అయ్యాను'.

ఈ చిత్రం సెన్సార్ కార్యక్రమాలను పూర్తిచేసుకొని క్లీన్ 'యు' సర్టిఫికెట్ అందుకుంది. బ్రహ్మానందం, పోసాని కృష్ణమురళి, తాగుబోతు రమేష్ హాస్య సన్నివేశాలు హైలైట్‌గా సినిమా తెరకెక్కింది. ఈ చిత్రాన్ని ఈనెల రెండో వారంలో విడుదల చేయడానికి సన్నాహాలు చేస్తున్నారు. ఈ సందర్భంగా నిర్మాత మాధవి అద్దంకి మాట్లాడుతూ ''మా చిత్రం ఫస్ట్ కాపీ రెడీ అయింది. సెన్సార్ బోర్డు సభ్యులు సినిమా చూసి బాగా ఎంజాయ్ చేసి క్లీన్ 'యు' సర్టిఫికెట్ ఇచ్చారు. బ్రహ్మానందం, పోసాని కృష్ణమురళి, తాగుబోతు రమేష్, రఘుబాబు, కృష్ణభగవాన్, పృథ్వీల కామెడీ ప్రేక్షకులను కడుపుబ్బ నవ్విస్తుంది. ఆగస్టు రెండో వారంలో సినిమాను విడుదల చేయడానికి సన్నాహాలు చేస్తున్నాం''అని అన్నారు.

దర్శకుడు శ్రీకర్ బాబు మాట్లాడుతూ ''సినిమా అవుట్‌పుట్ చాలా బాగా వచ్చింది. నిర్మాత ఏమాత్రం రాజీపడకుండా ఈ చిత్రాన్ని తెరకెక్కించారు. సినిమా తప్పకుండా మంచి విజయాన్ని అందుకుంటుందన్న నమ్మకముంది''అని తెలిపారు.

ప్రారంభమైన 'మాస్ పవర్'


'మాస్ పవర్' చిత్ర ప్రారంభోత్సవంలో సారిపల్లి కొండలరావు, శివ జొన్నలగడ్డ, ప్రియచైతన్య

సర్వేశ్వర మూవీస్ పతాకంపై శివ జొన్నలగడ్డ హీరోగా నటిస్తూ స్వీయ దర్శకత్వంలో గుద్దేటి బసవప్ప మేరు నిర్మిస్తున్న 'మాస్ పవర్' చిత్రం హైదరాబాద్ ఫిలిం ఛాంబర్‌లో ప్రారంభమైంది. ముహూర్తపు సన్నివేశానికి పారిశ్రామికవేత్త సారిపల్లి కొండలరావు క్లాప్‌నివ్వగా... నిర్మాత తుమ్మలపల్లి రామసత్యనారాయణ కెమెరా స్విచ్చాన్ చేశారు. తొలి సన్నివేశానికి ముత్యాల రామదాసు గౌరవ దర్శకత్వం వహించారు. స్క్రిప్టును ప్రసన్నకుమార్, వి. సాగర్ అందించారు. అనంతరం చిత్ర దర్శకుడు, హీరో శివ జొన్నలగడ్డ మాట్లాడుతూ ''ఇటీవల బసవప్ప, నా కాంబినేషన్‌లో తెరకెక్కిన 'పోలీస్ పవర్' పెద్ద విజయం సాధించింది. మళ్లీ మా కాంబినేషన్‌లో 'మాస్ పవర్' తెరకెక్కుతుండడం సంతోషంగా ఉంది. ఓ కాలనీలోని ఒక ఇంటిని ఓ రాజకీయ నాయకుడు కబ్జా చేస్తే ఎలాంటి పరిణామాలు చోటు చేసుకుంటాయి? తిరిగి ఆ ఇంటిని హీరో ఎంత క్షేమంగా నివాసితులకు అప్పగించాడన్నదే చిత్ర కథ. నా స్టైల్లో పక్కా మాస్ ఎంటర్‌టైనర్‌గా సినిమాను తెరకెక్కిస్తున్నాం. టెక్నికల్‌గానూ సినిమా హైలైట్‌గా ఉంటుంది. యాక్షన్ సన్నివేశాలు ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తాయి''అని అన్నారు. చిత్ర నిర్మాత గుద్దేటి బసవప్ప మేరు మాట్లాడుతూ ''పక్కా మాస్ అంశాలున్న మూవీ ఇది. ఐదు ఫైట్లు, పాటలను ఐదుగురు ఫైట్ మాస్టర్లు, కొరియోగ్రాఫర్లతో కంపోజ్ చేయిస్తున్నాం. ఈనెల 10 నుంచి రెగ్యులర్ షూటింగ్‌కు వెళ్తాం. అన్ని పనులు పూర్తిచేసి వీలైనంత త్వరగా సినిమాను విడుదల చేస్తాం''అని తెలిపారు. తుమ్మలపల్లి రామసత్యనారాయణ మాట్లాడుతూ ''సినిమా ఇండస్ట్రీ బాగుపడాలంటే చిన్న సినిమాలు విజయం సాధించాలి. అప్పుడే ఇండస్ట్రీలో సక్సెస్ రేటు పెరుగుతుంది. ఈ చిత్రం కూడా మంచి సక్సెస్‌ను అందుకోవాలని కోరుకుంటున్నాను''అని చెప్పారు. ఇందులో హీరోయిన్‌గా ప్రియచైతన్య నటిస్తోంది. ఈ కార్యక్రమంలో ప్రసన్నకుమార్‌తో పాటు చిత్ర యూనిట్ సభ్యులు పాల్గొన్నారు. ఈ చిత్రానికి కెమెరా: కె.శివ, ఫైట్స్: మల్లేష్ యాదవ్, సభా, కొరియోగ్రఫీ: బాలకృష్ణ, రామారావు, పాటలు: రుద్రంగి రమేష్, శివ జొన్నలగడ్డ.

అభిమానుల ప్రేమాభిమానాల వల్లే


హన్సిక

అందాల తార హన్సిక చిన్న వయసులోనే 'దేశముదురు' సినిమాలో హీరోయిన్‌గా నటించి తన సినీ ప్రయాణాన్ని ప్రారంభించింది. కొన్ని సినిమాల తర్వాత ఈ ముద్దుగుమ్మ బరువు పెరిగి... ఆతర్వాత క్రమేణా టాలీవుడ్ నుంచి దూరమైంది. కోలీవుడ్‌లో బొద్దుగుమ్మలకు ఉన్న క్రేజ్ హన్సికకు ప్లస్ అయి అక్కడ అగ్ర నాయికగా రాణించేందుకు తోడ్పడింది. ప్రస్తుతం కోలీవుడ్‌లో టాప్ హీరోయిన్‌గా రాణిస్తున్న హన్సిక వరుసగా సినిమాలు చేస్తూ ఎంతో బిజీగా ఉంది. తమిళ ప్రేక్షకులు ఈ భామను 'చిన్న ఖుష్బూ'గా ఆరాధిస్తున్నారు. ఇటీవల హన్సికకు తమిళ ఇండస్ట్రీలో మరో పేరు కూడా వచ్చింది. ఆమెను 'టైమ్ బాంబు'గా అభివర్ణిస్తున్నారు. ఇలా ఎందుకు తనను అంటున్నారో హన్సికనే స్వయంగా చెప్పింది. సినిమా షూటింగ్‌లకు తాను కరెక్ట్ టైమ్‌కు వస్తానంటోంది. షూటింగ్ షెడ్యూల్‌కంటే 10 నిమిషాల ముందే సెట్స్‌కు వచ్చి అందరినీ ఆశ్చర్యపరుస్తుందట. దీంతో హన్సికను కోలీవుడ్‌లో అందరూ 'టైమ్ బాంబు' అని అంటున్నారట. ఇక ట్విట్టర్‌లో తన అభిమానులకు ఎల్లప్పుడు అందుబాటులో ఉంటోంది ఈ భామ. తన సినిమాల అప్‌డేట్స్‌ను ఎప్పటికప్పుడు షేర్ చేసుకుంటూ వారిని పలకరిస్తోంది. అభిమానుల ప్రేమాభిమానాలతోనే కోలీవుడ్‌లో తాను కథానాయికగా అగ్రస్థానానికి చేరుకోగలిగానని హన్సిక చెబుతోంది. తెలుగులో ఇటీవల 'గౌతమ్ నంద' చిత్రంతో ప్రేక్షకుల ముందుకు వచ్చింది ఈ భామ. అయితే ఇటీవలకాలంలో ఎక్కువగా డబ్బింగ్ సినిమాల ద్వారా తెలుగు ప్రేక్షకుల ముందుకొస్తోంది.

ప్రేమ గురించి ఎప్పుడూ ఆలోచించలేదు


రకుల్‌ప్రీత్ సింగ్

ఇప్పుడు సినిమాల్లో హీరోయిన్స్ అంటే హీరోతో ప్రేమ వ్యవహారాల కోసమే అన్నట్లుంటారు. తమ కెరీర్ మొత్తంలో ఒకటీ అరా మినహాయిస్తే... మంచి రోల్స్ దొరికే ఛాన్సులు తక్కువ. అందరూ ఇదే దారిలో లేకపోయినా... మెజారిటీ హీరోయిన్ల తీరు ఇదే. కానీ రకుల్‌ప్రీత్ సింగ్ డిఫరెంట్ రోల్స్ చేస్తూ స్టార్ హీరోయిన్‌గా మంచి పేరుతెచ్చుకుంది. ఈ భామకు 'ప్రేమ' అంటే చిన్నచూపట. ''నా దృష్టిలో ప్రేమ అంటే చాలా చిన్న విషయం. అసలు నేను ఇలాంటి చిన్న చిన్న విషయాలకు ఏమాత్రం ప్రాధాన్యం ఇవ్వను''అని చెబుతోంది రకుల్. ప్రస్తుతం తెలుగుతో పాటు తమిళ్ సినిమాలు చేస్తూ బిజీగా ఉంది ఈ బ్యూటీ. ఈ భామను ప్రేమపై మీ అభిప్రాయమేంటి అని అడిగితే... ''అసలు ప్రేమ గురించి నేనెప్పుడూ ఆలోచించలేదు. స్కూల్లో చదివే సమయంలో ఓ కుర్రాడు ఐ లవ్ యూ చెప్పాడు. నేనేంటి... ప్రేమించడమేంటి... అంటూ పెద్ద క్లాస్ తీసుకున్నాను. అయితే కాలేజీ రోజుల్లో మాత్రం నా వెంటపడే ధైర్యం ఎవ్వరూ చేయలేదు. ఒకవేళ ఎవరైనా వెంటబడ్డా నేను పట్టించుకోలేదు''అని అంటోంది రకుల్. అసలు సమయాన్ని వృథా చేయడం తనకు నచ్చదని... స్కూల్లో చదివే టైంలో అయితే... చదువులోనే కాదు ఆట పాటల్లోనూ నాకు ఫస్ట్ ర్యాంక్ అని అంటోంది ఈ భామ. అందరికంటే ముందుండాలి అని కోరుకునే తత్వమే... తనను ఈ స్థాయికి చేర్చిందని గర్వంగా చెప్పిన రకుల్‌ప్రీత్ సింగ్... ప్రేమలో మాత్రం తనది చివరి స్థానం అని అంటోంది.

మాయామాల్ హీరో మాలాకా స్పైస్



మాయామాల్ హీరో దిలీప్ 'మాలాకా స్పైస్' ఆగ్నేసియా వంటల రుచులను ఆస్వాదించండంటూ ప్రచారం చేశాడు. శుక్రవారంనాడు హైదరాబాద్‌లో ఆయన 'మాలాకా స్పైస్' థీమ్ రెస్టారెంట్‌ను ప్రారంభించాడు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, తనకు ప్రయాణాలు అంటే అమితమైన ఇష్టమని, అంతేకాకుండా తాను భోజన ప్రియుడునని చెప్పాడు. సరికొత్త రుచులను ఆస్వాదించేందుకే ఇక్కడకు వచ్చినట్లు తెలిపాడు. మాయామాల్ సినిమా తర్వాత తన జీవితమే మారిపోయిందన్నాడు. కాగా, దేశంలోని ఆరు మాలాకా స్పైస్ రెస్టారెంట్లలో హైదరాబాద్‌లోని రెస్టారెంటే అతి పెద్దదని నిర్వాహకులు తెలిపారు.



78 శాతం పడిపోయిన ఎంఆర్ఎఫ్ లాభం

చెన్నై: జూన్ 30 ముగింపునాటి తొలి త్రైమాసిక ఫలితాల్లో టైర్ల తయారీ దిగ్గజం ఎంఆర్ఎఫ్ నికర లాభం భారీగా 78 శాతం పడిపోయింది. అత్యధిక వ్యయాల కారణంగా నష్టాలు వచ్చినట్టు కంపెనీ వెల్లడించింది. కంపెనీ నికర లాభం రూ.106.53 కోట్లు నమోదైంది. ఉత్పత్తి ఖర్చులు పెరగడం మూలంగా కంపెనీ లాభాలు క్షీణించాయని మార్కెట్ ఫైలింగ్‌లో కంపెనీ తెలిపింది. గత ఏడాది ఇదే సమయంలో కంపెనీ నికర లాభం రూ.490.93 కోట్లుగా ఉంది. అలాగే ఈ త్రైమాసికంలో మొత్తం ఆదాయం రూ.4,060.93 కోట్లు కాగా గత ఏడాది ఇదే కాలంలో రూ .3,955.93 కోట్లు ఆర్జించింది. గత ఆర్థిక సంవత్సరంలో మొత్తం వ్యయం 21.01 శాతం పెరిగి రూ .3,926.31 కోట్లకు చేరింది. గత ఏడాది ఇదే కాలంలో రూ .3,244.45 కోట్లుగా ఉంది. బాంబే స్టాక్ ఎక్స్ఛేంజ్‌లో కంపెనీ షేరు 2.82 శాతం నష్టపోయి రూ.67,200 వద్ద ముగిసింది.

కోలుకున్న మార్కెట్లు: రెండు రోజుల నష్టపోతూ వస్తున్న ఈక్విటీ మార్కెట్లు శుక్రవారం కోలుకున్నాయి. ట్రేడింగ్ ముగిసే సమయానికి సెన్సెక్స్ 88 పాయింట్ల లాభంతో 32325 వద్ద స్థిరపడింది. ఇక నిఫ్టీ 53 పాయింట్ల లాభంతో 10,070 వద్ద ముగిసింది. ఆఖరి నిమిషంలో కొనుగోళ్లు ఊపందుకున్నాయి. భారత్–22 పేరుతో కొత్త ఇటిఎఫ్ ఇండెక్స్‌ను జైట్లీ ప్రకటించడంతో బ్యాంకులు, ఆయిల్ షేర్లకు డిమాండ్ పెరిగింది.



లాజిస్టిక్ పార్క్‌ను ప్రారంభించిన సేఫెక్స్‌ప్రెస్

మన తెలంగాణ/హైదరాబాద్ : అతి పెద్ద సప్లయ్ చైన్, లాజిస్టిక్స్ కంపెనీ సేఫెక్స్‌ప్రెస్ నగరంలో అత్యాధునిక 32వ లాజిస్టిక్స్ పార్క్‌ను ప్రారంభించింది. నగరంలో 4,00,000 చదరపు అడుగుల విస్తీర్ణంలో ప్రపంచ స్థాయి సదుపాయాలను అందించేలా ఏర్పాటు చేశారు. ప్రారంభోత్సవం సందర్భంగా సేఫెక్స్‌ప్రెస్ మేనేజింగ్ డైరెక్టర్ రూబల్ జైన్ మాట్లాడుతూ, హైదరాబాద్‌లో లాజిస్టిక్స్ పార్క్‌ను ఏర్పాటు చేయడం ద్వారా సప్లై చైన్, లాజిస్టిక్స్ పరిశ్రమలో తమ నాయకత్వ స్థానాన్ని మరింత సుస్థిరం చేసుకున్నామన్నారు. హైదరాబాద్ బహుళ వ్యాపార విభాగాల్లో ప్రపంచ వాణిజ్య కేంద్రంగా భాసిల్లుతున్నప్పటికీ తగిన స్థాయిలో గిడ్డంగులు, లాజిస్టిక్స్ మౌలిక సదుపాయాలు లేన్నారు. సేఫెక్స్‌ప్రెస్ లాజిస్టిక్స్ పార్క్ మైలిక సదుపాయాల అంతరా ల ఖాళీల లోటును భర్తీ చేయడంలో సహాయపడుతుందన్నారు. దీని ద్వారా రాష్ట్రం మొత్తానికి సప్లయ్ చైన్ అండ్ లాజిస్టిక్స్ సేవలను అందిస్తుందన్నారు. 80 ట్రక్కుల లోడ్, అన్‌లోడ్ చేసే సామర్థ్యం ఉందని, ప్రతి రోజు దేశంలోని 50 వరకు వివిధ ప్రాంతాలకు ప్రతి రోజు బయలుదేరి వెళతాయన్నారు. కేంద్రం మౌలిక అవసరాలకు రూ.30 కోట్లు పెట్టుబడి పెట్టామన్నారు. ఇప్పటి వరకు 32 లాజిస్టిక్స్ పార్కుల కోసం రూ.1000 కోట్ల వరకు పెట్టుబడి పెట్టామన్నారు. ఇప్పటి వరకు మూడు వేర్వేరు మూడు గిడ్డంగులు ఉండేవని, వీటిని కలిపేయాలని భావిస్తున్నామన్నారు. తమ ఆదాయంలో 5 శాతం హైదరాబాద్ నుండి వస్తుందన్నారు. జిఎస్‌టి పరిధిలో డీజిల్ లేకపోయినప్పటికీ వ్యయం 10 శాతం నుంచి 15 శాతం వరకు పెరగవచ్చని, 15 శాతం నుండి 20 సాతం వరకు సి2సి వ్యాపారం ద్వారా వస్తుందన్నారు.

రక్షా బంధన్ కోసం హానర్ ఫిట్‌నెట్ బ్యాండ్స్

మన తెలంగాణ /హైదరాబాద్ : భారతీయ సంప్రదాయంలో సోదరీ సోదరిల మధ్య విలువైన అనుబంధానికి ప్రతీకగా నిలిచే రక్షా బంధన్‌ను మరింతగా గుర్తుంచుకునేలా నిర్వహించుకునేందుకు ఫిట్‌నెస్ బ్యాండ్ హానర్ బ్యాండ్ 3తో ముందుకు వచ్చింది. హెవావే ట్రూ స్లీప్ ట్రాకింగ్ టెక్నాలజీతో రూపొందించిన ఈ బ్యాండ్‌లో ఈ మెయిల్స్, క్యాలెండర్, సోషల్ మీడియా, ట్రూ కాలర్ ఐడిలను కూడా గుర్తించేలా రూపొందించింది. స్నేహ బంధాన్ని మరింత పునరుద్ధరించే ఈ బ్యాండ్‌లను తీర్చిదిద్దినట్లు హానర్ పేర్కొంది.




స్టాక్ మార్కెట్

ఈరోజు మార్కెట్	ముగింపు	మార్పు	%
సెన్సెక్స్	32325.41	87.53	(0.27%)
నిఫ్టీ	10066.40	52.75	(0.53%)

కరెన్సీ మారక రేట్లు

అమెరికన్ డాలర్	64.4700
యూరో	70.4270
బ్రిటిష్ పౌండ్	83.4957
ఆస్ట్రేలియన్ డాలర్	47.4050
కెనడియన్ డాలర్	47.0500
ఎమిరైట్ దిర్హామ్	17.5040
స్విస్ ఫ్రాంక్	64.5500
చైనీస్ యువాన్	9.3344
మలేషియన్ రింగిట్	14.8460
న్యూజిలాండ్ డాలర్	44.4990
హాంగ్‌కాంగ్ డాలర్	8.2824
జపనీస్ యెన్	0.5688
కువైట్ దినార్	212.0888
సౌతాఫ్రికన్ రాండ్	4.7209

బులియన్




బంగారం ధర

నగరం	ధర (రూ / 10 గ్రాములు)		
	22క్యారట్	24క్యారట్	మార్పు(%)
చెన్నై	27230	29122.99	0.44%
ముంబై	27920	29860.96	0.29%
ఢిల్లీ	27400	29304.81	0.9%
కోల్‌కతా	28010	29957.22	0.21%
కేరళ	26600	28449.20	0.38%
బెంగళూరు	26640	28491.98	0.41%
హైదరాబాద్	27230	29122.99	0.37%
గల్ఫ్	1344.06	1437.50	0.17%

వెండి ధర (రూ./ కిలో)

నగరం	శుక్రవారం	గురువారం	మార్పు (%)
చెన్నై	40800.00	40600.00	0.49
ముంబై	40800.00	40600.00	0.49
ఢిల్లీ	40800.00	40600.00	0.49
కోల్‌కత్తా	40800.00	40600.00	0.49
హైదరాబాద్	40800.00	40600.00	0.49




కోడిగుడ్లు (100కు) నెక్ రేటు

హైదరాబాద్	313	విశాఖపట్నం	318
వరంగల్	312	చిత్తూరు	365
విజయవాడ	308	చెన్నై	372
గోదావరి	308	బెంగళూరు	360

ఆస్తుల విక్రయం కోసం

భారత్–22 ఇటిఎఫ్

- ప్రారంభించిన కేంద్ర ఆర్థికమంత్రి అరుణ్ జైట్లీ
- ఇండెక్స్‌లో ఆరు రంగాలకు చెందిన కంపెనీలు



న్యూఢిల్లీ : భారత్–22 పేరుతో ఇటిఎఫ్ (ఎక్స్ఛేంజ్ ట్రేడెడ్ ఫండ్)ను శుక్రవారం కేంద్ర ఆర్థికమంత్రి అరుణ్ జైట్లీ ప్రారంభించారు. ముందు ముందు డిజిన్వెస్ట్‌మెంట్(పెట్టుబడుల ఉపసంహరణ) కోసం వాహకంగా ఇటిఎఫ్‌ను వినియోగిస్తామని జైట్లీ 2017–18 బడ్జెట్ ప్రసంగంలో హామీ ఇచ్చిన విషయం తెలిసిందే. 2017–18లో సిపిఎస్‌ఇ డిజిన్వెస్ట్‌మెంట్ లక్ష్యాన్ని రూ.72,500 కోట్లుగా నిర్ణయించారు. ఇప్పటివరకు తొమ్మిది పెట్టుబడుల ఉపసంహరణ లావాదేవీల ద్వారా సుమారు రూ.9300 కోట్లు ప్రభుత్వం గుర్తించిందని ఆర్థిక మంత్రిత్వశాఖ వెల్లడించింది. ఈ ఇండెక్స్‌లో పభుత్వ రంగ బ్యాంకులు, ఆయిల్, ఎనర్జీ, ఇండస్ట్రీ, ఎఫ్‌ఎంసిజి వంటి 22 కంపెనీలు ఉన్నాయి. మొత్తం డిజిన్వెస్ట్‌మెంట్ లక్ష్యం రూ.72,500 కోట్ల గా ఉండనుందని జైట్లీ ప్రకటించారు. భారత్–22 ఇటిఎఫ్‌లో రంగాల వారీగా బ్యాంకులు అత్యధికంగా 20.3 శాతం వాటాను కల్గి ఉన్నాయి. వీటిలో ఎస్‌బిఐ(స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా), యాక్సిస్ బ్యాంక్, బ్యాంక్ ఆఫ్ బరోడా, రూరల్ ఎలక్ట్రిఫికేషన్ కార్పోరేషన్, పవర్ ఫైనాన్స్ కార్పొరేషన్, ఇండియన్ బ్యాంక్ ఉన్నాయి. 17.5 శాతం వాటాతో ఇంధన రంగం రెండవ స్థానంలో ఉంది. వీటిలో నాల్కో, ఒఎన్‌జిసి, ఇండియన్ ఆయిల్ కార్పోరేషన్, బిపిసిఎల్, కోల్ ఇండియా ఎనర్జీ వంటి కంపెనీలు ఉన్నాయి. ఆ తర్వాత ఎఫ్‌ఎంసిజి 22.6 శాతం వాటాను కల్గి ఉండగా, దీనిలో ఐటిసి, భారత్ ఎలక్ట్రానిక్స్, ఇంజనీర్స్ ఇండియా, ఎన్‌బిసిసి ఉన్నాయి. ఆ తర్వాత 20 శాతం వాటాతో ఆరు యుటిలిటీ కంపెనీలు.. పవర్ గ్రిడ్ కార్పోరేషన్, ఎన్‌టిపిసి లిమిటెడ్, గెయిల్ ఇండియా, ఎన్‌హెచ్‌పిసి, ఎన్‌ఎల్‌సి ఇండియా, ఎస్‌విజెఎన్‌లు ఉన్నాయి. జైట్లీ ఈ ప్రకటన వెంటనే శుక్రవారం నాటి మార్కెట్ ముగింపులో పిఎస్‌యు బ్యాంకింగ్, ఆయిల్ అండ్ గ్యాస్ రంగాలు భారీగా లాభపడ్డాయి. ఫ్యూచర్స్ ట్రేడింగ్‌లో 90 శాతం ఈక్విటీలు ఉంటాయని, ఫండ్ మేనేజర్‌గా ఐసిఐసిఐ ప్రుడెన్షియల్ వ్యవహరిస్తుంది. అంతర్జాతీయంగా ఇటిఎఫ్ ఆస్తులు గణనీయంగా వృద్ధిని సాధిస్తున్నాయి. అంతర్జాతీయంగా ఎయుఎం (అసెట్స్ అండర్ మేనేజ్‌మెంట్) 4 ట్రిలియన్లు ఉన్నాయి. ఇవి 2021 నాటికి 7 ట్రిలియన్ డాలర్లను చేరుకోనున్నాయి.

నాలుగు రక్షణశాఖ సంస్థల్లో 25 శాతం వాటా విక్రయం!



ప్రభుత్వరంగ కంపెనీల నుంచి 25 శాతం వాటాలను విక్రయించాలని ప్రభుత్వం భావిస్తోంది. ఐపిఒ(ఇనిషియల్ పబ్లిక్ ఆఫర్) ద్వారా రక్షణ శాఖ నియంత్రణ పరిధిలో ఉన్న నాలుగు ప్రభుత్వరంగ కంపెనీల్లో వాటాలను సేల్ చేయాలని కేంద్ర ప్రతిపాదించింది. ఆగస్టు 18న సాయంత్రం 3 గంటలకు ఐపిఒ ప్రతిపాదనలను ప్రభుత్వం ఆహ్వానించనుంది. మజగాన్ డాక్ లిమిటెడ్, భారత్ డైనమిక్స్, గార్డెన్ రీచ్ షిప్‌బిల్డర్స్ అండ్ ఇంజినీర్స్ లిమిటెడ్, మిశ్ర దాతు నిగమ్ వంటి సంస్థల్లో వాటాలను విక్రయించాలని ప్రభుత్వం యోచిస్తోంది. 2018 మార్చి నాటికి సుమారు రూ.72,500 కోట్లు (11.38 బిలియన్ డాలర్లు) పెట్టుబడుల ఉపసంహరణ లక్ష్యాన్ని మోడీ ప్రభుత్వం నిర్ణయించుకుంది.

ఎయిర్ ఇండియా జీతాలు ఆలస్యం



న్యూఢిల్లీ: అప్పుల భారంతో సతమతమవుతున్న ప్రభుత్వ విమానయాన సంస్థ ఎయిర్ ఇండియా ఉద్యోగులకు జీతాలు ఆలస్యమయ్యాయి. జులై వేతనాలు ఈసారి ఆలస్యమైనట్టు కంపెనీకి చెందిన ఓ అధికారి వెల్లడించారు. అప్పుల భారంతో ఉన్న సంస్థను ప్రయివేటుపరం చేసేందుకు కేంద్రప్రభుత్వం కసరత్తు చేస్తోంది. మరో వైపు సంక్షోభంలో ఉన్న సంస్థ ఖర్చులు తగ్గించుకునేందుకు అష్టకష్టాలుపడుతోంది. ఈ పరిస్థితుల్లో ఉద్యోగులకు వేతనాలు చెల్లించలేని స్థితికి చేరుకుంది. జూలై నెలలో ఎయిర్ ఇండియా ఉద్యోగులకు జీతాలు చెల్లింపును ఆలస్యం చేసిందని సమాచారం. వీటిని వచ్చే వారం చెల్లించే అవకాశం ఉందని భావిస్తున్నామన్నారు. అయితే ఈ ఆలస్యానికి గల కారణాలపై ఇప్పటివరకు అధికారికంగాఎలాంటి ప్రకటన లేదు.

ఇ-సిగరెట్ నిషేధంతో అక్రమ రవాణా పెరుగనుంది: టిఐఐ

న్యూఢిల్లీ: దేశంలో ఎలక్ట్రానిక్ సిగరెట్ల నిషేధం వల్ల స్మగ్లింగ్(అక్రమ రవాణా) పెరిగే అవకాశముందని టిఐఐ(టొబాకో ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఇండియా) పేర్కొంది. వీటి నిషేధంతో అక్రమ రవాణా పెరుగుతుందని, దీంతో ఆ తర్వాత వచ్చే నాణ్యతలేని ఉత్పత్తులతో పెను ముప్పు పొంచి ఉందని వెల్లడించింది. ఇ–సిగరెట్‌ను ఎలక్ట్రానిక్ నికోటిన్ డెలివరీ సిస్టమ్(ఎండ్స్)గా పేర్కొంటారు. దీనిని టొబాకో సిగరెట్ కంటే సురక్షితమైందిగా పరిగణిస్తారు. దీనికి ఎలక్ట్రానిక్ డివైజ్‌ను వినియోగించి రూపొందిస్తారు.

నేడు ఇండియన్ ఆయిల్ నుంచి 5 కెజిల సిలిండర్

మన తెలంగాణ/హైదరాబాద్ : ఇండియన్ ఆయిల్ నుంచి 5 కెజిల ఎల్‌పిజి సిలిండర్‌ను అందుబాటులోకి తీసుకురానుంది. ఈ సిలిండర్‌ను శనివారం హైటెక్ సిటీలో ప్రారంభించనున్నట్లు ఇండియన్ ఆయిల్ వర్గాలు తెలిపాయి.

జిడిపిలో 10 శాతం వాటా వారిదే..

ఏడు నెలల్లో భారీగా పెరిగిన 20 మంది భారతీయ బిలియనీర్ల సంపద



న్యూఢిల్లీ : దేశ ఆర్థిక వ్యవస్థలో 10 శాతం సంపద 20 మంది కుభేరుల చేతిలోనే ఉన్నాయని ఓ సర్వే వెల్లడించింది. ఈ ఏడాది తొలి ఏడు నెలల్లో 20 మంది భారత పారిశ్రామికవేత్తల ఆస్తులు మరో 50 బిలియన్ డాలర్లు పెరిగాయి. దీంతో వారి మొత్తం సంపద విలువ 200 బిలియన్ డాలర్లకు చేరుతుంది. అంటే 2 ట్రిలియన్ల దేశీయ ఆర్థిక వ్యవస్థలో 10 శాతం వాటా వారిదే ఉంటుంది. ఈమేరకు బ్లూమ్‌బర్గ్ బిలియనీర్ ఇండెక్స్ నివేదిక వెల్లడించింది. 2 ట్రిలియన్ డాలర్లు అంటే దాదాపు కోటి కోట్లకు పై ఉంటుంది. ఏడు నెలల కాలంలో 18 మంది భారతీయ బిలీనియర్లలో ప్రతి ఒక్కరూ తమ సంపదను 1 బిలియన్ డాలర్లు (రూ.6400 కోట్లు) పెంచుకుంటున్నారని నివేదిక తెలిపింది. ఆయిల్ నుంచి టెలికాం వరకు పలు వ్యాపారాలతో మార్కెట్‌లో సంచలనాలు సృష్టిస్తున్న రిలయన్స్ ఇండస్ట్రీస్ అధినేత ముఖేష్ అంబానీ తన సంపదను అదనంగా ఏకంగా 13 బిలియన్ డాలర్లను పెంచుకున్నారు. అదే సమయంలో అదానీ గ్రూప్‌నకు చెందిన గౌతమ్ అదానీ, విప్రో అజిమ్ ప్రేమ్‌జీ, ఆర్‌కే దమానీ వంటి వారు బ్లూమ్‌బర్గ్ జాబితాలో స్థానం దక్కించుకుంది. వీరి సంపద 3–4 బిలియన్ డాలర్ల మధ్యలో పెరిగిందని నివేదిక పేర్కొంది. ఇక రిలయన్స్ ఇండస్ట్రీస్ షేర్లు తొమ్మిదేళ్ల గరిష్ఠానికి చేరుకున్నాయి. ఈ సంస్థ మార్కెట్ మూలధనం రూ.5,25,000 కోట్లకు చేరుకుని దేశంలోనే నంబర్ వన్ సంస్థగా అవతరించింది.

విప్రో ప్రమోట్‌చేస్తున్న అజీమ్ ప్రేమ్‌జీ ఐసిఐసిఐ ప్రుడెన్షియల్ లైఫ్ ఇన్సూరెన్స్‌లో 4 శాతం వాటాను కలిగి ఉన్నారు. ఎన్‌సిసి, జుబిలెంట్ ఫుడ్ వర్క్స్, క్రాంప్టన్ గ్రీవ్స్, కన్స్యూమర్ ఎలక్ట్రానిక్స్, జెఎం ఫైనాన్సియల్ సంస్థల్లో అజీమ్ ప్రేమ్‌జీ ట్రస్ట్ వాటాలను కలిగి ఉంది. వీటితో ప్రేమ్‌జీ సంపద మొత్తం 3.8 బిలియన్ డాలర్లు పెరిగి 16 బిలియన్ డాలర్లకు చేరుకుంది. దమానీ, గౌతమ్ అదానీ, ఉదయ్ కొటక్, కుమార్ మంగళం బిర్లా, పంకజ్ పటేల్, విక్రమ్ లాల్, లక్ష్మీ మిట్టల్, కెపి సింగ్, అజయ్ పిరామిళ్, పల్లోజి మిస్త్రీ వంటి వారు ప్రతి ఏడాది 2 బిలియన్ డాలర్లను పెంచుకుంటున్నారు.

పేరు	నికర ఆస్తులు + పెరిగింది(డాలర్లలో)	రంగం
ముఖేష్ అంబానీ	36.2 బిలియన్ + 13.4 బిలియన్	ఎనర్జీ
లక్ష్మీ మిట్టల్	16.6 బిలియన్ + 2.18 బిలియన్	కమోడిటీస్
అజీమ్ ప్రేమ్జీ	15.9 బిలియన్ + 3.63 బిలియన్	టెక్నాలజీ
పల్లోంజి మిస్త్రీ	15.6 బిలియన్ + 1.93 బిలియన్	ఇండస్ట్రియల్
శివ్ నాడార్	13.4 బిలియన్ + 1.42 బిలియన్	టెక్నాలజీ
దిలీప్ సంఘ్వి	11.4 బిలియన్ + 1.38 బిలియన్ల	ఆరోగ్య సంరక్షణ
ఉదయ్ కోటక్	10.2 బిలియన్ + 3.08 బిలియన్	ఫైనాన్స్
కుమార్ బిర్లా	9.16 బిలియన్ + 3.13 బిలియన్	ఇండస్ట్రియల్
సైరస్ పూనవాల	9.02 బిలియన్ + 1.02 బిలియన్ల	హెల్త్‌కేర్
గౌతమ్ అదానీ	8.83 బిలియన్ + 4.20 బిలియన్	ఇండస్ట్రియల్
విక్రమ్ లాల్	6.96 బిలియన్ + 2.20 బిలియన్	ఇండస్ట్రియల్
పంకజ్ పటేల్	6.67 బిలియన్ + 2.55 బిలియన్ల	హెల్త్‌కేర్
బెను గోపాల్ బంగుర్	6.50 బిలియన్ + 1.53 బిలియన్	కమోడిటీస్
రాధాకిషన్ దమాని	5.31 బిలియన్ + 3.40 బిలియన్	రిటైల్
మిక్కీ జగ్తియాని	5.18 బిలియన్ + 185 మిలియన్	రిటైల్
ఇందు జైన్	5.09 బిలియన్ + 987 మిలియన్	మీడియా అండ్ టెలికాం
కె పి సింగ్	4.94 బిలియన్ + 1.93 బిలియన్	రియల్ ఎస్టేట్
అజయ్ పిరమల్	4.93 బిలియన్ + 1.91 బిలియన్	ఫైనాన్స్
ప్రకాష్ హిందూజా	4.89 బిలియన్ + 1.13 బిలియన్ల	డైవర్సిఫైడ్
అశోక్ హిందూజ	4.89 బిలియన్ + 1.13 బిలియన్ల	డైవర్సిఫైడ్
రాహుల్ బజాజ్	4.46 బిలియన్ + 1.33 బిలియన్ల	డైవర్సిఫైడ్
కళానిధి మారన్	3.95 బిలియన్ + 1.56 బిలియన్	మీడియా, టెలికామ్

ఆంధ్రాబ్యాంకు మెరుగైన ఫలితాలు

- క్యూ1లో 30 శాతం వృద్ధితో రూ. 40.42 కోట్ల నికర లాభాలు



మన తెలంగాణ / హైదరాబాద్ : ఆంధ్రాబ్యాంక్ ప్రస్తుత ఆర్థిక సంవత్సరం జూన్‌తో ముగిసిన తొలి త్రైమాసికం (క్యూ1)లో 30.07 శాతం వృద్ధితో రూ. 40.42 కోట్ల నికర లాభాలను ఆర్చించింది. బ్యాంకుకు మొండి బాకీలు భారీగా నే పెరిగినా మెరుగైన ఫలితాలను ప్రకటించింది. గత ఏడాది ఇదే త్రైమాసికంలో రూ. 31.09 కోట్ల లాభాలు నమోదు చేసుకుంది. క్రితం క్యూ 1లో బ్యాంకు మొత్తం ఆదాయం రూ. 5,155.21 కోట్లకు చేరింది. 2016 జూన్‌తో ముగిసిన త్రైమాసికంలో రూ. 4,855.50 కోట్ల ఆదాయం ఆర్జించింది. బ్యాంకు నిర్వహణ లాభాలు 37 శాతం వృద్ధితో రూ. 1,000 కోట్లుగా నమోదైనాయి. క్రితం జూన్ ముగింపు నాటికి బ్యాంకు స్థూల మొండి బాకీలు 13.22 శాతానికి ఎగిసి రూ. 19.428 కోట్లకు చేరాయి. గత ఏడాది ఇదే త్రైమాసికం నాటికి జిఎన్‌పిఎ 10.30 శాతంతో రూ. 14,137 కోట్లుగా నమోదయ్యాయి. క్రితం క్యూ1లో బ్యాంకు నికర నిరర్థక ఆస్తులు 8.09 శాతానికి పెరిగాయి. గత ఏడాది ఇదే కాలంలో రూ. 6.21 శాతంగా నమోదైనాయి. క్రితం క్యూ1లో మొండి బాకీల కోసం ఏకంగా రూ.1,301.11 కోట్ల కేటాయింపులు చేసింది. గత ఏడాది ఇదే త్రైమాసికంలో రూ. 943.77 కోట్ల కేటాయింపులు జరిగాయి. క్రితం జూన్ ముగింపు నాటికి ఆంధ్రాబ్యాంకు మొత్తం శాఖలు 2908, ఏటిఎం కేంద్రాలు 3929కి చేరినట్లు వెల్లడించింది.

ప్రధానాంశాలు ఇలా ఉన్నాయి..

- బ్యాంకు వ్యాపారం 5.89 శాతం పెరిగి రూ. 3,34.073 కోట్లుగా నమోదు
- మొత్తం డిపాజిట్లు 5.61% వృద్ధితో రూ. 1,88.272 కోట్లు
- కాసా డిపాజిట్లు 24% పెరిగి రూ. 58,615 కోట్లకు చేరిక
- అడ్వాన్సులు 6 శాతం వృద్ధితో రూ. 1,45,801 కోట్లు
- వడ్డీపై ఆదాయం 6 శాతం పెరిగి రూ.4,4402 కోట్లకు చేరిక
- వ్యవసాయ రుణాలు 11.82 శాతం పెరిగి రూ. 27, 919 కోట్లుగా నమోదు
- ఎంఎస్‌ఎంఈ రుణాలు 23% పెరిగి రూ.28,637 కోట్లు
- రిటైల్ రుణాలు 19 శాతం వృద్ధితో రూ. 29,327 కోట్లు

జియోకు టాటా టెలికామ్ విక్రయం?

న్యూఢిల్లీ : దేశంలో అతిపెద్ద సంస్థ టాటా గ్రూప్‌కు చెందిన టాటా టెలికామ్ తీవ్రం నష్టాలతో సతమతమవుతోంది. ఈ నేపథ్యంలో టాటా టెలికామ్ సేవలను కొనుగోలు చేసేందుకు ఇప్పటికే భారతీ ఎయిర్‌టెల్ వంటి సంస్థలు ముందుకొచ్చాయి. అయితే టాటా సంస్థ రిలయన్స్ జియో వైపు ఆసక్తి చూపుతున్నట్టు సమాచారం. దీంతో దేశంలో మరో అతి పెద్ద డీల్ కుదరనుందని అంతా అంచనా వేస్తున్నారు. మార్కెట్‌లో వస్తున్న ఊహాగానాలపై టాటా గ్రూప్, మరోవైపు రిలయన్స్ ఇండస్ట్రీస్ సంస్థలు ఎలాంటి ప్రకటనా చేయలేదు. గతంలో ఈ రెండు దిగ్గజ కార్పొరేట్ సంస్థలు ఎలాంటి ఒప్పందాలను చేసుకోలేదు. ఇటీవల ఆర్‌ఐఎల్ నిర్వహిస్తున్న పురుషుల ప్రొఫెషనల్ ఫుట్‌బాల్ లీగ్‌లో ఇండియన్ సూపర్ లీగ్‌కు చెందిన జంషెడ్‌పూర్ ఫ్రాంచైజ్‌ను టాటా సొంతం చేసుకున్న విషయం తెలిసిందే. గత దశాబ్దం కాలంగా టెలికాం వ్యాపారాల్లో టాటాలు, అంబానీలు తీవ్రంగానే పోటీ పడుతూ వస్తున్నాయి. అయితే గత కొంతకాలంగా టాటాల టెలికాం వ్యాపారాలు నష్టాల్లో కూరుకుపోయాయి. ఇప్పటికే టాటా గ్రూప్ టెలికాం, ఓవర్‌సీస్ కేబుల్, ఎంటర్‌ప్రైజ్ సర్వీసెస్, డిటిహెచ్ టీవి వ్యాపారాలను విక్రయించాలని చూస్తోంది. దీని కోసం టాటా గ్రూప్ అన్వేషణ ప్రారంభించి.. టెలికాం దిగ్గజం ఎయిర్‌టెల్‌తో ఒప్పందం చేసుకోబోతున్నట్టు తెలిసింది. అయితే ఈ ఒప్పందాన్ని భారతీ ఎంటర్‌ప్రైజ్ రద్దుచేసుకున్నట్టు నివేదికలు పేర్కొన్నాయి. దీంతో ఎయిర్‌టెల్‌కు గట్టి పోటీగా ఉన్న రిలయన్స్ జియోకి వీటిని విక్రయించాలని టాటాలు ప్లాన్ చేస్తున్నట్టు తెలుస్తోంది. జియో, టాటా టెలి ఈ డీల్ కోసం ఆప్షన్లను అన్వేసిస్తున్నాయి.

హుందయ్ వెర్నా ప్రి-బుకింగ్ షురూ..

చెన్నై: ఎంతగానో వేచిచూస్తున్న కార్ల తయారీ దిగ్గజం హుందయ్ 2017 వెర్నా మోడల్‌ను ఈ నెల 22న లాంఛ్ చేయనుంది. కంపెనీ ఇప్పటికే ప్రి బుకింగ్‌ను ప్రారంభించింది. ఐదో తరం వెర్నా కారును అడ్వాన్స్ హై స్ట్రెంగ్త్ స్టీల్ బాడీతో తయారు చేశారు. దీనిలో స్టాంపింగ్ అప్లికేషన్స్ ఉంటాయి. ఫ్యూచరిస్టిక్ డిజైన్, డైనమిక్ పర్ఫార్మెన్స్, సూపర్ సేఫ్టీ అంశాలతో ఈ కారును రూపొందించారు.

'అయోధ్య' విచారణ

న్యూఢిల్లీ: అయోధ్య కేసులో సుప్రీంకోర్టులో ఈ నెల 11న విచారణ జరుగుతుంది. త్రిసభ్య ధర్మాసనం ఈ కేసులో విచారణ నిర్వహిస్తుందని వెల్లడైంది. ఈ కేసులో బిజెపి సీనియర్ నేత అద్వానీతో పాటు ఆ పార్టీ నేతలు పలువురు నిందితులుగా ఉన్నారు.

తల్లి పాల బ్యాంకు వసతి విస్తృతికి కేంద్రం యోచన



న్యూఢిల్లీ: ఢిల్లీ నగరంలో ఇటీవల ప్రారంభించిన తల్లి పాల బ్యాంకు వసతిని మరింత విస్తృతం చేసేందుకు కేంద్ర ప్రభుత్వం యోచిస్తోంది. ఈ విషయాన్ని శుక్రవారం కేంద్ర ఆరోగ్య శాఖా మంత్రి జెపి నడ్డా లోక్‌సభకు తెలిపారు. ఇలాంటి బ్యాంకులు మరిన్ని ఏర్పాటు చేసే యోచన ప్రభుత్వానికి ఉందా అన్న అనుబంధ ప్రశ్నకు ఆయన సమాధానమిస్తూ కేవలం ఈ వసతిని విస్తృతం చేసే యోచన ఉన్నట్టు తెలిపారు. ప్రస్తుతం నగరంలోని లేడీ హార్డింగె మెడికల్ కాలేజీలో ఉన్న ఈ బ్యాంకు తల్లి పాలను సేకరించి, నిల్వ చేస్తుంది. అవసరమైన శిశువులకు అందిస్తుంది. ప్రభుత్వ పెద్దాసుపత్రుల్లో వైద్యం కోసం రోగులు వేచి చూడాల్సివస్తు పరిస్థితిపై ఆయన మాట్లాడుతూ ఎయిమ్స్‌లో త్వరలోనే 1563 అదనపు బెడ్‌ను ఏర్పాటు చేస్తున్నట్టు తెలిపారు. అధిక సంఖ్యలో రోగులు వస్తున్న కేంద్ర ప్రభుత్వ ఆసుపత్రుల్లో వాటి సామర్థ్యానికి మించి బెడ్‌లు, వైద్య సిబ్బంది, వసతులు ఉన్నాయని తెలియజేశారు. పురుషుల ఓపిడి విభాగంలో ఏ రోజు రోగులకు ఆ రోజు వైద్యులు చికిత్స అందిస్తున్నారని తెలిపారు.

కశ్మీర్‌లో హిజ్బుల్ మిలిటెంట్ హతం

శ్రీనగర్ : జమ్ము–కశ్మీర్‌లో ఉగ్రవాదుల ఏరివేత కార్యక్రమాన్ని భద్రతా సిబ్బంది కొనసాగిస్తోంది. రెండ్రోజుల కిందట లష్కరే తోయిబా ఉగ్రవాద సంస్థ టాప్ కమాండర్ అబు దుజానాను హతమార్చిన భారత బలగాలు.. తాజాగా దక్షిణ కశ్మీర్‌లోని అనంత్‌నాగ్ జిల్లాలో గురువారం రాత్రి పొద్దుపోయాక జరిపిన ఎన్‌కౌంటర్‌లో ఒక హిజ్బుల్ ముజాహిద్దీన్ ఉగ్రవాదిని మట్టుబెట్టాయి. ఈ ఘటనలో ఒక సాధారణ పౌరుడు కూడా ప్రాణాలు కోల్పోయినట్లు భద్రతా అధికారులు శుక్రవారం వెల్లడించారు. ఇక్కడికి దాదాపు 55 కిలోమీటర్ల దూరంలో ఉన్న బిజ్‌బెహారాలోని కన్నిబాల్ ప్రాంతం వద్ద ఈ ఎన్‌కౌంటర్ జరిగింది. ఉగ్రవాదుల ఉనికికి సంబంధించి నిఘా వర్గాల నుండి సమాచారం అందుకున్న పోలీసులు.. సైన్యం, సిఆర్‌పిఎఫ్ సాయంతో సదరు గ్రామంలో గాలింపు చర్యలు చేపట్టారు. రెండు గంటల పాటు జరిగిన ఎన్‌కౌంటర్‌లో హతమైన ఉగ్రవాదిని అనంత్‌నాగ్ జిల్లాకు చెందిన యావర్‌గా గుర్తించారు.

జర్నలిస్టు ఆర్నబ్, రిపబ్లిక్ టివి ఛానెల్‌కు ఢిల్లీ హైకోర్టు తాఖీదులు

న్యూఢిల్లీ: రిపబ్లిక్ టివి ఛానెల్, జర్నలిస్టు ఆర్నాబ్ గోస్వామిలకు ఢిల్లీ హైకోర్టు శుక్రవారం తాఖీదులు జారీ చేసింది. తన భార్య సునంద పుష్కర్ మరణానికి సంబంధించి వస్తున్న తప్పుడు వార్తలను ఆపాలని, మౌనంగా హక్కును గౌరవించాలని కోరుతూ కాంగ్రెస్ ఎంపి శశి థరూర్ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. దీనికి స్పందించిన కోర్టు గోస్వామి వివరణ కోరుతూ తాఖీదులు పంపించింది. మే 29న కోర్టు తమకు హామీ ఇచ్చినప్పటికీ గోస్వామి తన ప్రతిష్టకు భంగం కలిగించేలా వార్తలు ప్రసారం చేస్తున్నారని శశిథరూర్ వేసి పిటిషన్‌పై విచారణ జరిపిన అనంతరం జస్టిస్ మన్మోహన్ వివరణ కోరుతూ గోస్వామి, రిపబ్లిక్ టివి ఛానెల్‌లకు నోటీసులు జారీ చేశారు. 'మీరు (గోస్వామి, ఛానెల్) శశిథరూర్ 'మౌనంగా ఉండే హక్కు'ను గౌరవించాలి' అని ధర్మాసనం పేర్కొంది. సునందది హత్య అని కోర్టు నిర్ధారించనందున ఆమె మరణాన్ని గోస్వామి, రిపబ్లిక్ టివి ఛానెల్‌లు 'హత్య'గా పేర్కొనరాదని థరూర్ తరపున వాదించిన సీనియర్ అడ్వకేట్ సల్మాన్ ఖుర్షీద్ కోరారు.

కార్తీ చిదంబరానికి నోటీసులు

న్యూఢిల్లీ: కేంద్ర మాజీ మంత్రి చిదంబరం కుమారుడు కార్తీ చిదంబరానికి సిబిఐ లుక్‌ఔట్ నోటీసులు జారీ చేసింది. అవినీతి ఆరోపణలు ఎదుర్కొంటున్న కార్తీ దేశం విడిచి వెళ్లకుండా ఉండేందుకు ఈ నోటీసులు జారీ చేశారు. అయితే వీటిపై కార్తీ మద్రాసు హైకోర్టును ఆశ్రయించారు. ఐఎన్‌ఎక్స్ మీడియా కేసులో కార్తీపై అవినీతి ఆరోపణలు వస్తున్న విషయం తెలిసిందే. చిదంబరం ఆర్థికమంత్రిగా ఉన్న సమయంలో ఐఎన్‌ఎక్స్ మీడియాకు రూ. 4.62 కోట్ల వరకు మాత్రమే విదేశీ పెట్టుబడులు పెట్టేందుకు అనుమతులుండగా, ఆ కంపెనీ మాత్రం రూ. 305కోట్లు పెట్టింది. ఈ కంపెనీని ప్రముఖ వ్యాపార వేత్త పీటర్ ముఖర్జియా, ఆయన భార్య ఇంద్రాణి నడిపేవారు. ప్రస్తుతం వారిద్దరూ జైల్లో ఉన్నారు. కార్తీ తన తండ్రి పరపతిని ఉపయోగించి.. ఐఎన్‌ఎక్స్ మీడియాకు అనుమతులు ఇప్పించినట్లు ఆరోపణలు ఉన్నాయి. ఈ కేసులో సిబిఐ, ఇడి విచారణ చేపడుతోంది.

విషమంగానే దిలీప్‌కుమార్ ఆరోగ్యం

ముంబై: అలనాటి బాలీవుడ్ దిగ్గజ నటుడు దిలీప్ కుమార్ (94) ఆరోగ్యం విషమంగానే ఉంది. ఆయన కిడ్నీలు సక్రమంగా పని చేయడం లేదని, చికిత్స జరుగుతోందని లీలావతి ఆసుపత్రి వర్గాలు తెలిపాయి. ప్రస్తుతం ఆయన వెంటిలేటర్‌పై లేరని, డయాలసిస్ చేయడం లేదని పేర్కొన్నాయి. దిలీప్ కుమార్ డీ హైడ్రేషన్, మూత్ర సంబంధిత ఇబ్బందులతో సబర్బన్ బాంద్రాలోని లీలావతి ఆసుపత్రిలో బుధవారం చేరారు. ఆయన మూత్ర పిండాలు సరిగా పనిచేయడం లేదని, ఏం చేయాలో ఆలోచిస్తున్నామని, డా.నిఖిల్ గోఖలే నేతృత్వంలో వైద్య బృందం ఆయనకు చికిత్స అందిస్తున్నదని, తర్వాత ఏం చేయాలనేది బృందం నిర్ణయిస్తుందని ఆసుపత్రి యాజమాన్యం వెల్లడించింది.

రాజకీయ హింసపై బిజెపి రెండు నాల్కల ధోరణి: సిపిఐ(ఎం)

న్యూఢిల్లీ: కేరళలోని రాజకీయ హింసపై బిజెపి రెండు నాల్కల ధోరణి అవలంబిస్తోందని సిపిఎం విమర్శించింది. ఓ వైపు రాజకీయ హింసను అరికట్టాలని కేంద్ర హోంశాఖ మంత్రి రాజ్‌నాథ్‌సింగ్ కోరుతుండగా, ఆయన సహచరులు ప్రశాంతత నెలకొనేందుకు రాష్ట్ర ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలను ప్రశ్నిస్తున్నారని సిపిఎం పేర్కొంది. బిజెపి జనరల్ సెక్రటరీ భూపేంద్ర యాదవ్, కేంద్రమంత్రి స్మృతి ఇరానీ ముఖ్యమంత్రి తీసుకుంటున్న చర్యలను విమర్శిస్తున్నారని తెలిపింది. రాష్ట్రంలో ప్రశాంతత ఉండ కూడదనే వ్యూహాన్ని బిజెపి అనుసరిస్తున్నట్లు స్పష్టమైందని పేర్కొంది. జులై 31న వామపక్ష, బిజెపి, ఆర్‌ఎస్‌ఎస్ నేతలతో సమావేశం నిర్వహించి హింసకు గల కారణాలను చర్చించినట్లు సిపిఎం తెలిపింది. 6న మరోసారి అఖిలపక్షం ఏర్పాటు చేస్తునారు.

కర్నాటక మంత్రి డికె ఇంట్లో మూడో రోజూ ఐటి దాడులు

బెంగళూరు: కర్నాటక మంత్రి డికె శివకుమార్ ఇళ్లలో ఆదాయ పన్ను శాఖ అధికారులు మూడు రోజులుగా సోదాలు నిర్వహిస్తున్నారు. పన్ను ఎగవేశారనే ఆరోపణలతో ఆయన ఆస్తులపై దేశ వ్యాప్తంగా 66 చోట్ల దాడులు నిర్వహించారు. ఇప్పటి వరకు రూ.15 కోట్ల ఆస్తులను అధికారులు స్వాధీనం చేసుకున్నారు. పలు ప్రదేశాల్లో సోదాలు నిర్వహించిన ఐటి శాఖ శివకుమార్‌ను వేర్వేరు ప్రదేశాలకు తీసుకెళ్లి విచారిస్తోంది. గుజరాత్ కాంగ్రెస్ పార్టీకి చెందిన 41 మంది ఎంఎల్‌ఎలకు శివకుమార్ తన ఫాంహౌజ్‌లో ఆశ్రయం కల్పించడంతో దాడులు జరుగుతున్నట్లు కాంగ్రెస్ ఆరోపించింది. రాజ్యసభ ఎన్నికల్లో ఓటు వేసేందుకు తమ ఎంఎల్‌ఎలను బిజెపి ప్రలోభాలకు గురి చేస్తుందని కాంగ్రెస్ భావిస్తోంది. మంత్రి ఇళ్లపై కేంద్ర ప్రభుత్వం రాజకీయ దురుద్దేశంతోనే ఐటి దాడులు నిర్వహిస్తోందని కర్నాటక ముఖ్యమంత్రి సిద్ధరామయ్య అరోపించారు. తాను ఐటి దాడులకు వ్యతిరేకం కాదని, ఇలాంటి సమయంలో ఐటి దాడులు జరగడం రాజకీయ దురుద్దేశంతో జరిగినట్లు స్పష్టమవుతోందన్నారు.

పిఒకెలో పాక్ ప్రాజెక్టులు

న్యూఢిల్లీ: పాకిస్థాన్ ఆక్రమిత కశ్మీర్ (పిఒకె)లోని అత్యంత పెద్దదైన సింధునదిపై పొరుగుదేశమైన చైనా సహాయంతో పాకిస్థాన్ ఆరు డ్యామ్‌లను నిర్మిస్తోందని శుక్రవారం పార్లమెంటులో విదేశాంగ మంత్రిత్వ శాఖ విమర్శించింది. ఈ ప్రాజెక్టుల నిర్మాణానికి సంబంధించి గతంలోనే చైనా తమ మద్దతును తెలపడంతో పాక్ డ్యామ్‌ల నిర్మాణానికి ఆ దేశం నుంచి సాయం తీసుకుంటుందని విదేశాంగ శాఖ సహాయ మంత్రి వికె సింగ్ చెప్పారు. కశ్మీర్‌లోని కొన్ని భూభాగాలను పాకిస్థాన్ ఆక్రమించుకుందని సింగ్ ఆరోపించారు. సరిహద్దు దేశమైన చైనాతో సహకార కార్యకలాపాలకు యత్నించడం భారత దేశ సార్వభౌమత్వాన్ని, ప్రాదేశిక సమగ్రతను ఉల్లంఘించడమే అవుతుందని ఆయన అన్నారు. కశ్మీర్ భూభాగాలను పాక్ ఆక్రమించుకుందనే విషయంలో భారత్ స్పష్టమైన వైఖరిని కలిగివుందన్నారు.



డ్యామ్ నిర్వాసితుల పక్షాన 9రోజులుగా నిరాహార దీక్ష
మద్దతుపలికిన సిపిఐ, జెడియు

క్షీణిస్తున్న మేధాపాట్కర్ ఆరోగ్యం

ధర్(మధ్యప్రదేశ్): సర్దార్ సరోవర్ డ్యామ్‌తో ప్రభావితమవుతున్న వేలాది కుటుంబాలకు న్యాయమైన పరిహారాన్ని అందజేయాలన్న డిమాండ్‌తో గత నెల 27వ తేదీ నుంచి ఇక్కడ నిరవధిక నిరాహార దీక్షకు పూనుకున్న నర్మదా బచావో ఆందోళనకారిణి మేధా పాట్కర్ ఆరోగ్యం గురువారంనాడు మరింత క్షీణించింది. ఆమెకు రక్తపోటు అధికం కావడమే కాకుండా షుగర్ స్థాయి పడిపోయిందని వైద్యులు వెల్లడించారు. ఇలాంటి పరిస్థితుల్లో దీక్షను విరమించడమే మంచిదని, లేకపోతే మరింత ప్రమాదకర స్థితిలోకి ఆమె వెళ్లినట్లవుతుందని వైద్యులతో పాటు మేధాపాట్కర్ శ్రేయోభిలాషులు అభిప్రాయపడుతున్నారు. అయితే ఎవరూ చెప్పిన దీక్షను విరమించబోనని ఆమె స్పష్టం చేశారు. పాట్కర్‌తో పాటు మరో 9మంది ధర్ జిల్లాలోని చిఖల్దాలో ఈ నిరాహార దీక్షకు పూనుకున్నారు. పొరుగునవున్న గుజరాజత్‌లోని డ్యామ్ గేట్లను మూసివేస్తే ఇక్కడ వేలాది మంది పేదల ఇళ్లు మునిగిపోవడమే కాకుండా మేధా పాట్కర్ ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఆరోగ్యకారణాల రీత్యా వెంటనే దీక్షను విరమించాలని జెడియు సీనియర్ నేత శరద్ యాదవ్ కోరారు. మేధాపాట్కర్ చేస్తున్న న్యాయమైన డిమాండ్లను తీర్చి, వెంటనే ఆమె దీక్షను విరమింప జేయాలని సిపిఐ డిమాండ్ చేసింది. ఆమె ఆరోగ్యం దినదినం క్షీణిస్తోందని, ఈ నేపథ్యంలో ప్రభుత్వాలు వెంటనే స్పందించాలని సిపిఐ జాతీయ ప్రధాన కార్యదర్శి సురవరం సుధాకర్‌రెడ్డి ఒక ప్రకటనలో కోరారు. డ్యామ్ ఎత్తు పెంచడం వల్ల 72వేల మంది ప్రభావితులవుతున్నారని, అందులో 15వేల మందికి ఇప్పటికీ పరిహారం అందలేదని గుర్తు చేశారు. పాట్కర్ పోరాటానికి తాము సంఘీభావం తెలుపుతున్నట్లు సిపిఐ జాతీయ కార్యదర్శి డి.రాజా వెల్లడించారు. దీక్షపై ఆమె పునరాలోచించుకోవాలని, ప్రస్తుత సవాళ్ల సమయంలో దేశానికి ఆమె అవసరం ఎంతో ఉందని పేర్కొన్నారు.

రామగుండానికి మళ్లీ రెక్కలు

- ఏడాది చివరలో ఎరువుల ఉత్పత్తి
- రాజ్యసభలో మంత్రి అనంత్‌కుమార్ ప్రకటన



న్యూఢిల్లీ: తెలంగాణలోని రామగుండం ఎరువుల ఫ్యాక్టరీ పునరుద్ధరణకు కేంద్రం చర్యలు చేపట్టింది. ఈ విషయాన్ని శుక్రవారం రాజ్యసభలో కేంద్ర ఎరువులు, రసాయనాల, పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి అనంత్‌కుమార్ తెలిపారు. ఈ ఏడాది చివరిలోనే ఈ ఫ్యాక్టరీ ప్రారంభం అవుతుంది. దేశంలో ఐదు ఎరువుల ఫ్యాక్టరీల పునరుద్ధరణకు ప్రభుత్వం అన్ని చర్యలు తీసుకొంటోందని తెలిపిన మంత్రి ఈ ఫ్యాక్టరీల పేర్లను వెల్లడించారు. రామగుండం, గోరఖ్‌పూర్, బరౌనీ,తల్చేర్, సింద్రీలలోని ఫ్యాక్టరీలలో తిరిగి ఉత్పత్తి ప్రారంభం అయితే మొత్తం మీద 65 లక్షల మెట్రిక్ టన్నుల ఉత్పత్తి సామర్థ్యం ఏర్పడుతుంది. దీనితో దేశంలో ఎరువుల కొరత లేకుండా పోవడంతో పాటు మనమే యూరియా ఇతర ఎరువుల ఎగుమతి దశకు చేరుతామని మంత్రి తెలిపారు. శుక్రవారం ప్రశ్నోత్తరాల సమయంలో మంత్రి ఈ అంశంపై స్పందించారు. ప్రస్తుతం వ్యవసాయ రంగానికి అవసరమైన ఎరువులను దిగుమతి చేసుకోవల్సి వస్తోంది. ఐదు ఎరువుల కర్మాగారాలలో ఉత్పత్తి మొదలైతే, అదనంగా 65 లక్షల మెట్రిక్ టన్నుల ఎరువులు అందుబాటులోకి వస్తాయి. ఇప్పుడు దేశానికి 310 లక్షల మెట్రిక్ టన్నుల ఎరువుల అవసరం ఉంది. ఇప్పుడున్న ఉత్పత్తి మేరకు చూస్తే 55 లక్షల ఎంటిల మేరకు కొరత ఉంది. దీనిని భర్తీ చేసుకునేందుకు మనం ఇతర దేశాలపై ఆధార పడాల్సి వస్తోంది. భారతీయ ఎరువుల సంస్థ (ఎఫ్‌సిఐఎల్) ఆధ్వర్యంలో ఉంటూ వచ్చిన రామగుండం ఎరువుల ఫ్యాక్టరీని 1999లో సాంకేతిక, ఆర్థిక కారణాలతో మూసివేయాల్సి వచ్చింది. వచ్చే కొద్ది సంవత్సరాలలో మన దేశం నుంచి ఎరువులను ఎగుమతి చేసే పరిస్థితి ఉంటుందని, ఈ దిశలో ప్రభుత్వం చర్యలు చేపట్టిందని మంత్రి తెలిపారు. సింద్రీ ఎరువుల కర్మాగారాన్ని 2020 సెప్టెంబర్ నాటికి పునః ప్రారంభించాలని తలపెట్టారు. ఇక కొంతకాలంగా మూసిఉన్న రామగుండం ఎరువుల ఫ్యాక్టరీలో ఉత్పత్తి ఈ ఏడాది చివరికే మొదలవుతుందని మంత్రి వివరించారు. వచ్చే మూడు సంవత్సరాల వ్యవధిలో అన్ని ఐదు ఫ్యాక్టరీలూ పనిచేసేలా చూస్తామని తెలిపారు. సింద్రీ, బరౌనీ, గోరఖ్‌పూర్ ఎరువుల ఫ్యాక్టరీలను హిందూస్థాన్ ఉర్వరక్ రాశ్యన్ లిమిటెడ్ (హెచ్‌యుఆర్‌ఎల్) ఆధ్వర్యంలో పునరుద్ధరిస్తారు. ఈ ఫ్యాక్టరీల పునరుద్ధరణ కార్యక్రమం ఘనత ఎన్‌డిఎ ప్రభుత్వానిది కాదని, ఈ ప్రభుత్వం అధికారంలోకి రావడానికి ముందే పునరుద్ధరణ పనులు జరుగుతున్నాయని కాంగ్రెస్ సభ్యులు జైరాం రమేష్ తెలిపారు.

సంక్షేమ పథకాలపై జిఎస్‌టి మోపొద్దు : టిఆర్‌ఎస్

మన తెలంగాణ/న్యూఢిల్లీ: వస్తు సేవల పన్ను (జిఎస్‌టి)తో ప్రభుత్వ సంక్షేమ పథకాలపై ప్రభావం పడుతోందని తెలంగాణ రాష్ట్ర సమితి (టిఆర్‌ఎస్) సభ్యులు ఆందోళన వ్యక్తం చేశారు. లోక్‌సభలో శుక్రవారం టిఆర్‌ఎస్ సభ్యులు ఈ అంశాన్ని ప్రస్తావించారు. ప్రభుత్వ పథకాలపై పన్నుల భారాన్ని ఇప్పుడున్న ఐదు శాతం నుంచి 18 శాతానికి పెంచారని,దీనితో వీటి అమలు కుంటుపడే ప్రమాదం ఉందని టిఆర్‌ఎస్ సభ్యులు జితేందర్ రెడ్డి తెలిపారు. ప్రభుత్వ పథకాలపై జిఎస్‌టి భారం మోపడం తగదని సూచించారు. ఆర్థిక మంత్రి అరుణ్ జైట్లీ సమాధానమిస్తూ టిఆర్‌ఎస్ ప్రస్తావించిన అంశాన్ని శనివారం జరిగే జిఎస్‌టి మండలి సమావేశంలో తెలియచేస్తామని వెల్లడించారు. తెలంగాణలో అమలు అవుతోన్న పలు ప్రజా సంక్షేమ పథకాలపై జిఎస్‌టితో ఆర్థిక భారం ఎక్కువవుతోందని ఇతర సభ్యులు లేచి నిలబడి ఉండగా జితేందర్ రెడ్డి తెలిపారు. గృహ నిర్మాణ పథకాలు దెబ్బతింటున్నాయని, వాటి వ్యయ అంచనాలు తారుమారు అవుతున్నాయని, పేదల ఇళ్ల నిర్మాణాలు నిలిచిపోతున్నాయని మంత్రి దృష్టికి తెచ్చారు. ఈ జిఎస్‌టి భారం గురించి ఇప్పటికే ముఖ్యమంత్రి కెసిఆర్ ఓ లేఖలో ప్రధాని మోడీ దృష్టికి తెచ్చారని వివరించారు. ఐదు శాతం వరకూ ఉన్న పన్నుల భారం 18 శాతానికి చేరడం ఎంతటి స్థాయిలో ఇబ్బంది కల్గిస్తుందో గమనించాలన్నారు.

మరణ నమోదుకూ 'ఆధార్' తప్పనిసరి

అక్టోబరు 1 నుండి అమల్లోకి

న్యూఢిల్లీ : గుర్తింపు మోసాలకు అడ్డుకట్ట వేసే దిశగా మరణాల నమోదుకు ఆధార్ కార్డును తప్పనిసరి చేస్తూ కేంద్ర హోం శాఖ శుక్రవారం ఒక నోటిఫికేషన్‌ను జారీ చేసింది. ఈ ప్రక్రియ ఈ ఏడాది అక్టోబరు 1 నుండి అమల్లోకి వస్తుంది. జమ్ము–కశ్మీర్, అసోం, మేఘాలయ రాష్ట్రాలకు మినహా మిగిలిన అన్ని రాష్ట్రాల వారికి ఈ నిబంధన వర్తిస్తుంది. ఆ మూడు రాష్ట్రాలకు తేదీని వేరుగా ప్రకటిస్తామని హోం శాఖ తెలిపింది. 'మృతుల గుర్తింపును ధ్రువీకరించే దిశగా మరణ నమోదు ప్రక్రియ కోసం ఆధార్ సంఖ్యను అక్టోబరు 1 నుండి తప్పనిసరి చేస్తున్నాం' అని హోం మంత్రిత్వ శాఖ తన నోటిఫికేషన్‌లో పేర్కొంది. 'మృతుల బంధువులు లేదా పరాధీనులు లేదా సన్నిహితులు తెలిపిన వివరాల ఖచ్చితత్వ నిర్ధారణకు ఆధార్ నంబరు ఉపయోగపడుతుంది. గుర్తింపు మోసానికి అడ్డుకట్ట వేసేందుకు ఇది సమర్థవంతంగా ఉపయోగపడుతుంది. మృతుల గుర్తింపు నమోదుకు కూడా ఇది ఎంతగానో దోహదపడుతుంది. అంతేకాక మృతుడి గుర్తింపు కోసం అనేక రకాల పత్రాలను పొందుపరచాల్సిన అవసరం కూడా ఉండదు' అని హోం శాఖ పరిధిలోని రిజిస్ట్రార్ జనరల్ కార్యాలయం వెల్లడించింది.

'ఆధార్' లేకుండానే రైల్ టికెట్ల బుకింగ్

రైల్ టికెట్ల బుకింగ్‌కు ఆధార్ నంబరు అవసరం లేదని కేంద్ర ప్రభుత్వం శుక్రవారం రాజ్యసభలో వెల్లడించింది. రైల్వే టికెట్ల బుకింగ్‌కు సంబంధించి ప్రస్తుతానికైతే ఆధార్ నంబరును తప్పనిసరి చేసే యోచనేదీ తమకు లేదని రైల్వేశాఖ సహాయ మంత్రి రాజెన్ గోహైన్ రాజ్యసభలో ఒక ప్రశ్నకు రాతపూర్వకంగా సమాధానమిచ్చారు.

బిగ్‌బాస్‌ను నిలిపివేయండి

మద్రాస్ హైకోర్టులో పిటిషన్లు, నోటీసు

చెన్నై: తమిళ బిగ్‌బాస్ రియాల్టీ షోను నిలిపివేయాలని మద్రాస్ హైకోర్టులో శుక్రవారం మరో పిటిషన్ దాఖలు అయింది. నటుడు కమల్‌హాసన్ హోస్ట్‌గా ఉన్న ఈ షోలో మహిళా పోటీదార్ల వస్త్రధారణ, వారి వెకిలిచేష్టలు అసభ్యంగా ఉన్నాయని, తమిళుల సంస్కృతి సంప్రదాయాన్ని కించపరిచేలా ఉన్న ఈ షోను వెంటనే నిలిపివేయాలని పిటిషనర్ శరవణనన్ పేర్కొన్నారు. కుటుంబ సభ్యులు అంతా కూర్చుని చూసే విధంగా షో లేదని పిటిషనర్ తెలిపారు. పోటీదార్లు మూడు కోట్ల మంది తమిళుల భావోద్వేగాలతో ఆడుకుంటున్నారని విమర్శించారు. పిటిషన్‌పై స్పందించిన హైకోర్టు షో సారథి కమల్ హాసన్‌కు, టీవీ ఛానల్ వారికి నోటీసులు పంపించింది. బిగ్ బాస్ షోలో ఓ పోటీదారు నటుడు శక్తి షోలో భాగంగా సంగీత నాదస్వరాన్ని అవమానించే విధంగా వ్యవహరించారని, కళాకారులకు నాదస్వరం దైవంతో సమానం అని మరో పిటిషన్ దాఖలు అయింది.

ఆ భాషల్లో 10 శాతం భారత్‌వే

న్యూఢిల్లీ: రానున్న యాభై ఏళ్లలో అంతర్థాన ముప్పును ఎదుర్కొంటున్న ప్రపంచంలోని సుమారు 4 వేల భాషల్లో పదిశాతం భారత్‌లో మాట్లాడుతున్నవే ఉన్నాయని ప్రముఖ భాషావేత్త గణేష్ ఎన్ దేవి అన్నారు. ప్రధాన భారతీయ భాషలకు ఆంగ్లం నుండి నిజంగా ముప్పు లేదనే అభిప్రాయాన్ని ఆయన వ్యక్తం చేశారు. పీపుల్స్ లింగ్విస్టిక్ సర్వే ఆఫ్ ఇండియా (పిఎల్ఎస్ఐ) ఛైర్మన్ అయిన గణేష్ మాట్లాడుతూ...దేశంలోని తీరప్రాంతల్లోని భాషలే ఎక్కువగా అంతరించిపోయే ప్రమాదముందని ఆయన చెప్పారు. 'పలు భాషలు అంతరించిపోయే దశకు చేరుకున్నాయి. వాటిలో తీరప్రాంత భాషలే అధికం. అందుకు కారణం, తీరప్రాంతాల్లో జీవనాధారం ఎంత మాత్రం సురక్షితం కాకపోవడం. కార్పొరేట్ కంపెనీలు సముద్రంలోని సుదూరాల్లోకెళ్లి చేపలను వేటాడుతున్నాయి. మరోవైపు సంప్రదాయ పద్ధతుల్లో చేపలను పట్టే జాతులు తీరాల నుండి సమీప ప్రాంతాల్లోకి వలసలు వెళ్తున్నాయి. దాంతో వారి భాషలు కనుమరుగైపోతున్నాయి' అని పిటిఐ వార్తా సంస్థకిచ్చిన ఇంటర్వ్యూలో ఆయన వివరించారు. మరోవైపు ఇటీవల కాలంలో కొన్ని గిరిజన భాషలు అభివృద్ధి చెందాయన్నారు.



ప్రాణం తీసిన సరదా

లోయలో పడి ఇద్దరు యువకుల దుర్మరణం

ముంబయి(సింధుదుర్గ్): మహారాష్ట్రలోని సింధుదుర్గ్‌లో విహారయాత్ర స్థలంగా పేరొందిన అంబోలి ఘాట్ వద్ద ఓ విషాదం చోటుచేసుకుంది. దాదాపు 2వేల అడుగుల లోతైన లోయలోపడి ఇద్దరు వ్యక్తులు దుర్మరణం పాలయ్యారు. ఈ ఘటనకు సంబంధించిన వీడియో ఒకటి ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. వివరాల్లోకి వెళితే.. కోల్హాపూర్ పౌల్ట్రీ ఫాంలో పనిచేస్తున్న ఏడుగురు స్నేహితులు కలిసి కవేల్ సాద్ పాయింట్ వద్ద అత్యంత ప్రమాదకరమైన లోయను సందర్శించేందుకు వెళ్లారు. కొంతసమయం గడిపిన తరువాత వారు అక్కడి నుంచి వెళ్లిపోగా, వారిలో ఇద్దరు మిత్రులు ఇమ్రాన్ గరడి (26), ప్రతాప్ రాథోడ్ (21)లు వెనకబడిపోయారు. ఈ క్రమంలో వారికోసం వెతికినప్పటికీ కనిపించకపోవడంతో మిగతా ఐదుగురు స్నేహితులు సావంత్వాడి పోలీసులను ఆశ్రయించారు. దీంతో అప్రమత్తమైన పోలీసులు పర్వతాధిరోహకులు, స్థానికుల సహాయంతో ఘటనా స్థలికి చేరుకుని గాలింపు చర్యలు చేపట్టారు. ఇమ్రాన్, రాథోడ్‌ల మృతదేహాలను గుర్తించారు. అయితే లోయలో భారీ వర్షం కారణంగా వారి మృతదేహాలను వెలికితీయలేకపోయామని సీనియర్ ఎస్‌పి సునీల్ ధన్వాదే వెల్లడించారు. కాగా, సోషల్ మీడియాలో వైరల్ అయిన ఈ వీడియోలో ఇద్దరు వ్యక్తులు లోయ అంచును ఎక్కే క్రమంలో తమ చేతుల్లో బాటిల్స్ ఉంచుకుని కనిపిస్తారు. అప్పుడు లోయ అంచుల చుట్టూ ఉన్న కంచెను ఎక్కి అంచుపై భాగాన నిలబడి జారిపోతున్నట్టుగా ఆ వీడియోలో రికార్డు అయింది.

గ్యాస్ ధరలపై వెనక్కి తగ్గాల్సిందే

- లోక్‌సభలో పట్టువీడని విపక్షాలు



న్యూఢిల్లీ: ప్రతినెలా వంటగ్యాస్ (ఎల్‌పిజి) ధర రూ.4 పెంచుతూ ఇటీవల కేంద్రం తీసుకున్న నిర్ణయాన్ని వెంటనే ఉపసంహరించుకోవాలని శుక్రవారం లోక్‌సభలో విపక్ష సభ్యులు డిమాండ్ చేశారు. ఇండియన్ ఇన్సిటిట్యూట్ ఆఫ్ పెట్రోలియం, ఎనర్జీ బిల్లు 2017 పై లోక్‌సభలో చర్చ జరుగుతున్న సమయంలో ఈ డిమాండ్‌ను తెరపైకి తెచ్చారు. ఎల్‌పిజి సబ్సిడీని క్రమక్రమంగా తొలగించే దిశగా నిర్ణయం తీసుకోవడాన్ని వ్యతిరేకిస్తూ...కాంగ్రెస్ సభ్యుడు అధిర్ రంజన్ చౌదరి ప్రభుత్వంపై తీవ్రస్థాయిలో విరుచుకపడ్డారు. దేశంలో ఎల్‌పిజి సబ్సిడీ పొందుతున్న 18 కోట్ల మంది ప్రభుత్వం నిర్ణయంతో తీవ్ర అన్యాయానికి గురికానున్నారని దుయ్యబట్టారు. రాత్రికి రాత్రే వారంతా ధనవంతులైపోతారని ప్రభుత్వం భావిస్తుందా అని చౌదరి ప్రశ్నించారు. ఒకవైపు ప్రపంచ వ్యాప్తంగా ముడిచమురు ధరలు పడిపోతున్న నేపథ్యంలో తగ్గిన ధరల వల్ల కలిగే ప్రయోజనాలను మాత్రం కేంద్ర పెట్రోలియం శాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ చెప్పడం లేదని విమర్శించారు. చమురు ధరలు తగ్గుతుంటే ఆ మేరకు తగ్గించి ప్రజలకు లాభం చేకూర్చాల్సిందిపోయి సబ్సిడీ ఎత్తివేస్తూ నిర్ణయం తీసుకోవడమేంటన్నారు. తృణమూల్ కాంగ్రెస్ నేత సౌగత రాయ్ కూడా ప్రతినెలా ఎల్‌పిజి రూ. 4 పెంపుపై ప్రభుత్వాన్ని నిందించారు. వంటగ్యాస్‌పై పెంచిన ధరలను వెంటనే ఉపసంహరించుకోవాలిన రాయ్ డిమాండ్ చేశారు. రాయ్‌తో పాటు మరో టిఎంసి సభ్యుడు కూడా పెంపు నిర్ణయాన్ని ఉపసంహరించు కోవాలని డిమాండ్ చేశారు. అంతర్జాతీయ మార్కెట్‌లో ముడిచమురు ధరలు చాలా తగ్గాయి కానీ, దేశంలో ప్రజలు మాత్రం వీటి నుంచి ఎలాంటి ప్రయో జనాలను పొందలేకపోతున్నారని జెడి(యు) సభ్యుడు కౌసలేంద్ర వాపోయారు. చర్చా సమయంలో కొందరు సభ్యులు ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ పెట్రోలియం తమ రాష్ట్రాల్లో కూడా ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు.

14 నుంచి దినకరన్ పర్యటన

చెన్నై: తమిళనాడులో అధికార ఎఐఎడిఎంకె (అమ్మ) ఉప ప్రధాన కార్యదర్శి, శశికళ మేనల్లుడు టిటివి దినకరన్ ఈ నెల 14 నుంచి రాష్ట్ర వ్యాప్త పర్యటన చేపట్టనున్నారు. ఎన్నికల సంఘానికి ముడుపుల కేసులో అరెస్టు అయి విడుదల అయిన దినకరన్ రెండు నెలల విరామం తరువాత ఆయన శుక్రవారం పత్రికా ప్రకటన వెలువరించారు. తాను తిరిగి చురుకుగా రాజకీయాలలో పాల్గొంటానని తెలిపారు. పార్టీ పటిష్టతకు రాష్ట్ర వ్యాప్త పర్యటన తలపెట్టినట్లు, రాష్ట్ర మంత్రులు, సీనియర్ నేతలు తనతో పాటు పర్యటనలో పాల్గొంటారని ఆశిస్తున్నట్లు దినకరన్ విశ్వాసం వ్యక్తం చేశారు. ఓ వైపు ముఖ్యమంత్రి పళనీస్వామి వర్గం వారు దినకరన్‌ను పార్టీకి, ప్రభుత్వానికి దూరంగా పెడుతున్నట్లు ప్రకటించారు. ఆయనతో పార్టీకి ఎలాంటి సంబంధం లేదని స్పష్టం చేసిన తరుణంలో దినకరన్ పార్టీ కోసం పర్యటనకు దిగుతాననడం కీలకంగా మారింది. పార్టీ వ్యవస్థాపక నేత ఎంజిఆర్ శతజయంతి ఉత్సవాల సందర్భంగా తన రాష్ట్రవ్యాప్త పర్యటన తలపెట్టినట్లు దినకరన్ తెలిపారు.

మన తెలంగాణ
11 హైదరాబాద్ శనివారం 5, ఆగస్టు 2017
www.manatelangana.news



హరితహారంలో మొక్కల రక్షణకు ప్రత్యేక చర్యలు

మన తెలంగాణ/హైదరాబాద్: పట్టణ ప్రాంతాల్లో సుందరమైన అర్బన్ పార్కుల ఏర్పాటుకు ప్రాధాన్యత ఇవ్వాలని అటవీశాఖ ఉన్నతాధికారులు తెలిపారు. ఇప్పటి వరకు నాటినమొక్కల రక్షణకు, వాటి నీటి సౌకర్యానికి ప్రత్యేక చర్యలు తీసుకోవాలని సూచించారు. సచివాలయంలో శుక్రవారం హరితహారం పనులపై జిల్లా అధికారులతో వీడియోకాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. ఈ సమావేశంలో అటవీ సంరక్షణ ప్రధాన అధికారి డాక్టర్ మనోరంజన్ భాంజా, అదనపు అటవీ సంరక్షణ అధికారులు పృథ్వీ రాజ్, రఘువీర్, మునీంద్ర, డోబ్రియల్, లోకేష్ జైస్వాల్, సునీల్ కుమార్ గుప్తా, శోభ, స్వర్గం శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లాలో హరితహారం పనులపై ఆరా తీశారు. వర్షాభావ పరిస్థితులు మరి కొద్ది రోజులు కొనసాగే అవకాశం ఉన్నందున హరితహారంలో నాటిన మొక్కలను రక్షణకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని జిల్లా అధి కారులను ఆదేశించారు. వివిధ ప్రాజెక్టుల భూసేకరణ, వర్షకాలంలో జంతువుల రక్షణకు తీసుకోవల్సిన చర్యలు, అటవీ సంపద, సంరక్షణ, కంపా నిధులతో చేపట్టిన పనులు తదితర అంశాలపై ఉన్నతాధికారులు సమీక్షించారు. ఇప్పటి వరకు హరితహారం మూడవ విడతలో 17 కోట్లకు పైగా మొక్కలు నాటినట్లు అధికారులు వెల్లడించారు.

శాంతియుతంగానే కశ్మీర్ సమస్యకు పరిష్కారం : పాక్

ఇస్లామాబాద్ : కశ్మీర్ సమస్యకు తాము శాంతియుతమైన పరిష్కారాన్నే ఆకాంక్షిస్తున్నామని పాకిస్తాన్ శుక్రవారం వెల్లడించింది. కశ్మీర్‌లోయలోని ప్రజలకు తమ దేశం రాజకీయ పరమైన, దౌత్యపరమైన మద్దతును కొనసాగిస్తుందని తెలిపింది. పాకిస్తాన్ విదేశీ కార్యాలయం (ఫారిన్ ఆఫీస్–ఎఫ్ఒ) ఈ మేరకు ఒక ప్రకటనను విడుదల చేసింది. కశ్మీరీలపై భారత భద్రతా దళాలు పేలుడు పదార్థాలను, పెల్లెట్లను ప్రయోగిస్తోందని ఆరోపించింది. కశ్మీర్‌లో మానవ హక్కుల ఉల్లంఘన వల్ల ప్రాంతీయ శాంతిభద్రతలపై ప్రతికూల ప్రభావం పడుతుందని ఆవేదన వ్యక్తం చేసింది. ఐరాస భద్రతా మండలి తీర్మానాలకు అనుగుణంగా జమ్ము–కశ్మీర్ సమస్యకు శాంతియుతమైన పరిష్కారానికి పాకిస్తాన్ కట్టుబడి ఉందని...జమ్ము–కశ్మీర్‌లోని ప్రజలకు నైతిక, రాజకీయ, దౌత్యపరమైన మద్దతును కొనసాగిస్తామని ఎఫ్ఒ తన ప్రకటనలో పేర్కొంది.

దుబాయ్‌లోని ఆకాశహర్మ్యంలో మంటలు



దుబాయ్ : ప్రపంచంలోనే అత్యంత ఎత్తయిన ఆకాశహర్మ్యాల్లో ఒకటైన ఇక్కడి 86 అంతస్తుల 'టార్చ్ టవర్'లో గురువారం అర్థరాత్రి మంటలు చెలరేగాయి. భవంతిలోని దాదాపు 40 అంతస్తులకు పైగా ఒకవైపు అగ్నిజ్వాలలను విరజిమ్మాయని మంటలను కళ్లారా చూసిన ఒక అసోసియేటెడ్ ప్రెస్ (ఎపి) పాత్రికేయుడు వెల్లడించారు. ఈ ప్రమాదంతో భవంతిలో నివాసముండే చాలా మంది భయాందోళనలతో వీధుల్లోకి పరుగులు తీశారు. స్థానిక కాలమానం ప్రకారం, అగ్నిప్రమాదం శుక్రవారం తెల్లవారుజామున ఒంటి గంటకు సంభవించిందని ప్రత్యక్ష సాక్షులు చెప్పారు. ఈ ప్రమాదం గురించి సమాచారం అందుకున్న అగ్నిమాపక దళ సిబ్బంది వేకువజామున దాదాపు 3.30 గంటల ప్రాంతంలో సంఘటనాస్థలికి చేరుకుని మంటలను అదుపు చేశారని దుబాయ్ సివిల్ డిఫెన్స్ అధికారులు వెల్లడించారు. అదృష్టవశాత్తుగా ఈ ప్రమాదంలో ఎవరూ గాయపడలేదని వారు తెలిపారు. గడచిన రెండున్నరేళ్లలో దాదాపు 1100 అడుగుల (335 మీటర్లు)పైగా ఎత్తయిన ఒక ఆకాశహర్మ్యం అగ్నిప్రమాదానికి గురికావడం ఇది రెండోసారి కావడం గమనార్హం.

ట్రంప్ చెప్పింది.. నిజమే : రష్యా

మాస్కో : అమెరికా–రష్యా మధ్య సంబంధాలు ఇంతకు ముందెన్నడూ లేనివిధంగా ఘోరమైన స్థాయికి క్షీణించిపోయాయంటూ అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ చేసిన వ్యాఖ్యలతో ఏకీభవిస్తున్నట్లు రష్యా శుక్రవారం తెలిపింది. 'ట్రంప్ అభిప్రాయంతో మేము పూర్తిగా ఏకీభవిస్తున్నాం' అని రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ ప్రతినిధి డిమిత్రి పెస్కోవ్ విలేకరులకు తెలిపారు. ట్రంప్ అభిప్రాయం గురించి ఆయన ట్విట్టర్ వేదికగా గురువారం తన స్పందనను తెలిపారు. ఇరు దేశాలకు, వాటి ప్రజలకు అత్యంత కీలకమైన అంశాల పరంగా పరస్పర సహకారం లేకపోవడం వల్లే అమెరికా–రష్యాల మధ్య బంధం ప్రమాదస్థాయికి చేరుకుని ఉంటుందని పెస్కోవ్ అభిప్రాయపడ్డారు.

శవమై కనిపించిన భారతీయుడు

దుబాయి: యుఎఇలో పనిచేస్తూ వారం రోజులుగా కనిపించకుండా పోయిన భారతీయడు శవమై కనిపించాడు. షార్జాలోని ఓ కారు పార్కులో పాక్షికంగా కుళ్లిపోయిన భారతీయుడి శవం కనిపించినట్లు బుధవారం ఓ మీడియా సంస్థ తెలిపింది. కేరళలోని పెరుంబవూరుకు చెందిన డిక్సన్ (35) మృతదేహంగా పోలీసులు గుర్తించారు. తన కుటుంబ సభ్యులను కలిసేందుకు ఐర్లాండ్‌కు వెళ్లిన డిక్సన్ జులై 30న తిరిగి వచ్చారు. రెండు రోజుల తర్వాత గత మంగళవారం నుంచి కనిపించకుండా పోయినట్లు ఆయన కుటుంబ సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. తన కుటుంబ సభ్యులతో కలిసి ఉండేందుకు ఉద్యోగానికి రాజీనామా చేసేందుకు ఐర్లాండ్ నుంచి ఆయన తిరిగి వచ్చినట్లు పోలీసులు తెలిపారు. డిక్సన్ మృతికి సంబంధించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

రోడ్డుపై పడివున్న మందు బిళ్లలు మింగి కోమాలోకి వెళ్లిన మూడేళ్ల బాలిక

మన తెలంగాణ/హైదరాబాద్/ మాదన్నపేట్ : తుక్కుషాపు వద్ద పడివున్న మందు బిళ్లలు తెలియక మూడేళ్ల బాలిక మింగేసిన సంఘటన మూడు రోజుల క్రితం మలక్‌పేట్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. వివరాల ప్రకారం మలక్‌పేట్ లోని మూసరాంబాగ్‌లోని తీగల బస్తీలో నివసించే రాజేష్,జ్యోతిలకు ముగ్గురు కూతుర్లు . గత బుధవారం రెండవ కుమార్తె స్వాతి(3) తన స్నేహితులతో ఆడుకుంటుండగా పక్కనే ఉన్న తుక్కుషాపు వద్ద పడి ఉన్న ఓ డబ్బాలోని మందు బిళ్లలన్నీ మింగింది. ఇది గమనించిన తోటి స్నేహితులు తల్లి జ్యోతికి తెలిపారు. అప్పటికే పాప కోమాలోకి వెళ్లింది. వెంటనే తల్లిదండ్రులు అంబులెన్స్‌కు ఫోన్ చేసి నీలోఫర్‌కి తరలించారు. వైద్యులు పాప పరిస్థితి చూసి మలక్‌పేట్ పోలీసులకు ఫిర్యాదు చేయడంతో పోలీసులు వచ్చి వివరాలు సేకరించి వెళ్లారు. స్వాతికి మూడు రోజుల పాటు వైద్యులు అత్యవసర చికిత్సను అందించారు. ప్రస్తుతం పాప పరిస్థితి మెరుగుపడిందని వైద్యులు తెలిపారు.

మత్తు పదార్థాలు విక్రయిస్తున్న ఆరుగురి అరెస్ట్

3 కిలోల మత్తు పదార్థాలు స్వాధీనం

మన తెలంగాణ/ హైదరాబాద్/ పంజాగుట్ట: నిషేధిత మత్తు పదార్థాలను విక్రయించేందుకు యత్నిస్తున్న ఆరుగురు వ్యక్తులను పశ్చిమ మండలం టాస్క్‌ఫోర్సు పోలీసులు అరెస్టు చేసి, ఎస్సార్‌నగర్ పోలీసులకు అప్పగించారు. వివరాల్లోకి వెళితే... కామారెడ్డి జిల్లాకు చెందిన కిరణ్ గౌడ్ (31) ఆర్థికంగా చితికి పోయాడు. దీంతో త్వరగా డబ్బు సంపాదించాలనే ఉద్దేశంతో మత్తు పదార్థాలను విక్రయించేందుకు సిద్ధపడ్డాడు. ఇందుకు సిద్దిపేట, దుబ్బాకు చెందిన పాండుగౌడ్ (25), మవీన్ (23), కామారెడ్డి జిల్లాకు చెందిన వై.శ్రీకాంత్ (24), కర్ణాటకకు చెందిన మహ్మద్ అంజత్(24), రాజేంద్రనగర్‌కు చెందిన కే. భసవరాజు (32)ల సహకారంతో మత్తు పదార్థాలను విక్రయిస్తున్నారు. పక్క సమాచారంతో మైత్రీవనం వద్ద మత్తు మందు విక్రయాలు జరుగుతుండగా పోలీసులు వారిని అదుపులోనికి తీసుకున్నారు. వారి వద్ద నుంచి రెండున్నర కేజీల అల్ఫోజామ్, 500 గ్రామాలు డైజోఫాంలతో పాటు ఏడు సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. అనంతరం ఎస్సార్‌నగర్ పోలీసులు వారిపై సంబంధిత సెక్షన్ల కింద కేసులు నమోదు చేసి రిమాండ్‌కు తరలించారు.

సహనానికీ హద్దుంటుంది

డోక్లామ్ సంక్షోభంపై చైనా హెచ్చరిక

బీజింగ్ : సిక్కిం సెక్టార్‌లో భారత్‌తో నెలకొన్న సైనిక ప్రతిష్టంభన విషయంలో తాము చాలావరకు సుహృద్భావంతోనే నడుచుకుంటున్నామని, తమ సహనానికి కూడా ఒక హద్దుంటుందని చైనా శుక్రవారం హెచ్చరించింది. ఇరు దేశాల మధ్య ద్వైపాక్షిక సంబంధాల పటిష్టతకు భారత్–చైనా సరిహద్దు ప్రాంతం వద్ద శాంతి, సుస్థిరతలు కీలకమంటూ భారత విదేశాంగ శాఖ మంత్రి సుష్మా స్వరాజ్ ఒక ప్రకటనలో పేర్కొన్న మరుసటి రోజు గురువారం రాత్రి చైనా రక్షణ మంత్రిత్వ శాఖ ఇలా స్పందించడం ప్రాధాన్యతను సంతరించుకుంది. శాంతియుతమైన పరిష్కారం దిశగా చర్చలు జరగాలంటే వివాదాస్పద డోక్లామ్ ప్రాంతం నుండి ఇరు దేశాలు తమ బలగాలను తొలుత వెనక్కి తీసుకోవాలంటూ సుష్మ గతనెల భారత వైఖరిని స్పష్టం చేసిన సంగతి తెలిసిందే. జూన్ 16న భూటాన్‌ని కలిపే త్రికూడలికి సమీపంలో చైనా బలగాలు ఒక రహదారి నిర్మాణానికి పూనుకోవడంతో డోక్లామ్ వివాదానికి బీజం పడిన సంగతి తెలిసిందే. సరిహద్దు ప్రాంతంలో శాంతి, సుస్థిరతలను పునరుద్ధరించే దిశగా సమస్యకు పరిష్కారాన్ని కనుగొనాలని చైనా రక్షణ శాఖ ప్రతినిధి రెన్ గ్వాకియాంగ్ ఒక ప్రకటనలో భారత్‌ను కోరారు. 'సరిహద్దు వద్ద సంక్షోభం తలెత్తినప్పటి నుండి చైనా ఎంతో సుహృద్భావాన్ని ప్రదర్శిస్తోంది.భారత్‌తో సమస్యను దౌత్య పద్ధతుల్లో పరిష్కరించుకునేందుకు ప్రయత్నిస్తోంది. ఇరు దేశాల మధ్య ఉన్న సాధారణ ద్వైపాక్షిక సంబంధాలు, ప్రాంతీయ శాంతి, సుస్థిరతల దృష్ట్యా చైనా బలగాలు సైతం అత్యంత సంయమనంతో వ్యవహరిస్తున్నాయి' అని రెన్ చెప్పినట్లు చైనా ప్రభుత్వరంగ వార్తా సంస్థ 'జిన్ హువా' ఒక ప్రకటనలో పేర్కొంది. మంచితనానికీ దాని విలువలుంటాయని, సంయమనానికీ ఒక హద్దుంటుందని రెన్ స్పష్టం చేశారు. శాంతి పరిరక్షణ విషయంలో చైనా బలగాల విశ్వాసాన్ని, సత్తాని, దేశ సార్వభౌమాధికారాన్ని, భద్రతను, అభివృద్ధి ప్రయోజనాలను కాపాడటంలో వాటి సంకల్ప బలాన్ని ఏ ఒక్క దేశమూ తక్కువగా అంచనా వేయరాదని ఆయన పునరుద్ఘాటించారు. అందువల్ల భారత్ తన తాత్సారకు యుక్తుల భ్రమ నుండి బయటకు రావాలని ఆయన సూచించారు. చైనా సాయుధ బలగాలకు తమ దేశ ప్రాంతీయ సమగ్రతను, రక్షణ ప్రయోజనాలను కాపాడే దృఢ సంకల్పం ఉందని ఆయన దీమాగా చెప్పారు. కాగా, జాతీయ భద్రతా సలహాదారుల (ఎన్ఎల్ఎలు) బ్రిక్స్ సదస్సు సందర్భంగా చైనా జాతీయ భద్రతా సలహాదారును భారత జాతీయ భద్రతా సలహాదారు అజిత్ దోవల్ కలిసిన తర్వాత కూడా రెన్ ఈ రకంగా వ్యాఖ్యానించడం ప్రాధాన్యతను సంతరించుకుంది.




డోక్లామ్‌పై భూటాన్ సహకారం : భారత్

డోక్లామ్ సంక్షోభ పరిష్కారానికి చైనాతో దౌత్యపరమైన పద్ధతులను కొనసాగిస్తున్నామని భారత్ శుక్రవారం వెల్లడించింది. మరోవైపు సంక్షోభానికి పరస్పర ఆమోదయోగ్యమైన పరిష్కారాన్ని కనుగొనేందుకు భూటాన్‌తో ఎప్పటికప్పుడు సంప్రదింపులు జరుపుతున్నామని, ఆ దేశ సహకారాన్ని కూడా తీసుకుంటున్నామని భారత విదేశాంగ శాఖ ప్రతినిధి గోపాల్ బాగ్లే తెలిపారు. డోక్లామ్ వద్ద భారత్ తన బలగాలను 400 నుండి 40కి తగ్గించిందంటూ చైనా చేసిన ప్రకటనపై అడిగిన ప్రశ్నకు ఆయన సమాధానాన్ని దాటవేశారు. అది ఇరు దేశాల మధ్య ఒక ఆపరేషన్‌కి సంబంధించిన వ్యవహారమని ఆయన అన్నారు.

కెనడాలో 'మోనాలిసా డైనోసార్' అవశేషాల గుర్తింపు

టోరంటో : కెనడాలో మోనాలిసా డైనోసార్లుగా పిలవబడే దాదాపు 110 మిలియన్ ఏళ్ల కిందటి చెక్కుచెదరని డైనోసార్ల అవశేషాలను శాస్త్రవేత్తలు తాజాగా గుర్తించారు. బొరియాలోపెల్టా మార్క్ మిట్చెల్లిగా పిలిచే ఈ కొత్త జాతి చూడటానికి ఒక ట్యాంకు ఆకృతిలో నిర్మితమైనప్పటికీ, దురాక్రమణ జీవుల నుండి స్వీయరక్షణ కోసం మారువేషాన్ని ధరిస్తుంటాయని పరిశోధకులు వెల్లడించారు. చెక్కుచెదరకుండా చక్కటి రూపంలో లభించిన దాదాపు 18 అడుగుల పొడవైన డైనోసార్ నమూనా సంపూర్ణమైన రక్షణ చర్మాన్ని కలిగి ఉంది. దానిని సమగ్రంగా విశ్లేషించామని శాస్త్రవేత్తలు తెలిపారు. తమ విశ్లేషణలో ఈ డైనోసార్ దాదాపు 1300 కిలోలకు పైగా బరువున్నప్పటికీ, దానికి కూడా భక్షక జంతువుల బెడద ఉన్నట్లు గుర్తించామని వారు చెప్పారు. బొరియాలోపెల్టా జాతికి చెందిన డైనోసార్ల చర్మాన్ని పరిశీలించినపుడు, అది భక్షక జీవుల నుండి కాపాడుకునేందుకు చర్మపు రంగులు మార్చుకునేదన్న విషయం బహిర్గతమయిందని వారు తెలిపారు. నోడోసార్ వంశానికి చెందిన డైనోసార్ మాంసభక్షక డైనోసార్ల దాడులకు గురయ్యేదన్న విషయం తమ పరిశోధనలో తేలిందని వారు చెప్పారు.



రాహుల్‌పై దాడి అరాచక పాలనకు పరాకాష్ట

మన తెలంగాణ/హైదరాబాద్:గుజరాత్‌లో వరద బాధితులను పరామర్శించేందుకు వెళ్లిన ఎఐసిసి ఉపాధ్యక్షులు రాహుల్‌గాంధీపై జరిగిన దాడిని కాంగ్రెస్ నాయకులు ఖండించారు. బిజెపి కార్యకర్తలు, గూండాలతో రాహుల్‌పై దాడికి పాల్పడ్డారని సిఎల్‌పి నేత కె.జానారెడ్డి విమర్శించారు. రాహుల్‌పై దాడి మోడి ప్రభుత్వం అప్రజాస్వామిక పాలనకు పరాకాష్ట అని టిపిసిసి అధ్యక్షులు ఉత్తమ్‌కుమార్ రెడ్డి అన్నారు. మతతత్వ శక్తుల విజృంజన జరుగుతుందని టిపిసిసి వర్కింగ్ ప్రెసిడెంట్ భట్టి విక్రమార్క అన్నారు. గాంధీభవన్‌లో శుక్రవారం మీడియా సమావేశంలో భట్టి విక్రమార్కతో కలిసి కె.జానారెడ్డి మాట్లాడుతూ ప్రజా స్వామ్యాన్ని మోడి ప్రభుత్వం ఖూనీ చేస్తోందన్నారు. దేశంలో నియంతతృత్వ పాలన కొనసాగుతుందన్నా రు. మతతత్వశక్తులు, జాతి ఐక్యత, సమగ్రత, మత సామరస్యం కాపాడే వారినే లక్ష్యంగా దాడులకు పాల్పడుతున్నారని విమర్శించారు. మతతత్వ, చాందనవాద,విచ్చినకర శక్తులుపెట్రేగిపోతున్నాయని, దేశం కోసం పనిచేసే నేతల ప్రాణాలు పొట్టన పెట్టుకుంటున్నాయన్నారు. ఇలాంటి చర్యలకు కాంగ్రెస్ భయపడదన్నారు. కాంగ్రెస్‌ను అణచివేసేందుకే బిజెపి ఇలాంటి ప్రయత్నాలు చేస్తోందన్నారు. ఈ దాడితో తమకు సంబంధం లేదని, తమపై తామేదాడి చేసుకున్నారేమో అని గుజరాత్‌లోని బిజెపి సీనియర్ నేత కైలాష్ విజయ్ చేసిన వ్యాఖ్యలతో ఈ దాడి ఎవరు చేశారో స్పష్టం చేస్తుందన్నారు. బిజెపి ఆగడాలను అరికట్టేందుకు కాంగ్రెస్ శ్రేణులు సన్నద్ధం కావాలన్నారు. దేశ స్వాతంత్ర్యం కోసం పోరాడిన మహాత్మాగాంధీని స్వాతంత్ర్యం వచ్చిన ఆరునెలల్లోనే మతతత్వ విచ్చిన్నకర శక్తులు పొట్టన పెట్టుకున్నారన్నారు. ఇందిరాగాంధీని, రాజీవ్‌గాంధీని కూడా ఇవే శక్తులు పొట్టన పెట్టుకున్నాయని చెప్పారు. భట్టి విక్రమార్క మాట్లాడుతూ ప్రజల కోసం పనిచేస్తున్న నేతలను మతతత్వ శక్తులు లక్ష్యంగా దాడులకు పాల్పడుతున్నాయని, కుట్రదారులను ఐక్యంగా ఎదుర్కొంటామన్నారు. వరద బాధితులను పరామర్శించేందుకు వెళ్తున్న రాహుల్‌గాంధీపై దాడికి దిగడం అమానుషమని టిపిసిసి అధ్యక్షులు ఎన్.ఉత్తమ్‌కుమార్ రెడ్డి అన్నారు. శుక్రవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. ప్రపంచంలోనే అహింసా సిద్ధాంతాన్ని నూరిపోసిన మహాత్మాగాంధీ పుట్టిన నేలపైన ఇలాంటి దాడులు జరగడం దారుణమని పేర్కొన్నారు. దాడులకు మోడియే ప్రధాన బాధ్యత వహించాలన్నారు.

డ్రైవింగ్‌పై అవగాహన కల్పిద్దాం



మన తెలంగాణ/ న్యూఢిల్లీ : ద్విచక్ర వాహనాల ప్రమాదాల నుంచి యువత ప్రాణాలను కాపాడడానికి టిఆర్ఎస్ ఎంపి కవిత రూపొందించిన వెబ్‌సైట్ www.sisters4change.orgను లోక్‌సభ స్పీకర్ సుమిత్రా మహాజన్ శుక్రవారం తన ఛాంబర్‌లో ప్రారంభించారు. ఈ సందర్భంగా లోక సభ స్పీకర్ సుమిత్రా మహాజన్ ఎంపి కవిత చేస్తున్న కృషిని అభినందించారు. అనంతరం లోక్ సభ స్పీకర్ మాట్లాడుతూ ప్రతి మహిళ కూడా తన సోదరులు క్షేమంగా ఉండాలని కోరుకుంటూ రాఖీ పండుగ నాడు అన్నదమ్ముళ్లకు రాఖీలు కడుతుంటారని అన్నారు. రోడ్డు ప్రమాదాల్లో చనిపోతున్న అన్నదమ్ములను చూసి ఎంపి కవిత చలించిపోయారని, హెల్మెట్ ధరించాలన్న అవగాహన కల్పించడం ద్వారా ద్విచక్రవాహనదారుల ప్రాణాలను కాపాడేందుకు వీలవుతుందని కవిత భావించారన్నారు. ఎంపి కవిత తాను కూడా సోదరికావడం వల్లే ఇలా స్పందించి .. సిస్టర్ 4 ఛేంజ్ కార్యక్రమానికి పిలుపునిచ్చారని తెలిపారు. ఈ ప్రచార ఉద్యమాన్ని ముందుకు తీసుకెళ్లాల్సిన బాధ్యత మనందరిపైనా ఉందన్నారు. అనంతరం ఎంపి కవిత మీడియాతో మాట్లాడుతూ.. అన్నా– చెల్లెలు, అక్కా–తమ్ముళ్ల సోదరభావానికి ప్రతీకగా మనం రక్షాబంధన్ పండుగను జరుపుకుంటామని చెప్పారు. దురదృష్టవశాత్తూ మన దేశంలో ప్రతిరోజు దాదాపు 400 మంది వరకు ద్విచక్రవాహన దారులు రోడ్డు ప్రమాదాల్ల చనిపోతున్నారని కవిత తెలిపారు. కేవలం ద్విచక్రవాహన దారులు తలకు హెల్మెట్ పెట్టుకోకపోవడం వల్లే ఇలా మృత్యవాత పడుతున్నారని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. ఒక్క 2015 సంవత్సరంలో రోడ్డు ప్రమాదాల్లో 45,540 మంది తమ ప్రాణాలకు కోల్పోయారని, వీటిలో 29 శాతం మంది ద్విచక్రవాహన దారులకావడం తనను కలచివేసిందన్నారు. ఈ నేపథ్యంలోన సిస్టర్స్ 4 ఛేంజ్ ప్రచార కార్యక్రమాన్ని చేపట్టినట్లు తెలిపారు. రక్షణ స్లోగన్ మాత్రమే కాదని, ప్రాణాలకు అదోక మార్గమన్నారు. అన్నా తమ్ముళ్లకు 'రాఖీ కట్టండి హెల్మెట్‌ను బహూకరించడి' అని తాను ఇచ్చిన పిలుపుకు సోషల్ మీడియా బాగా రెస్పాండ్ అయిందన్నారు. నెటిజన్లు తమ మద్ధతు తెలియజేస్తున్నారని, అన్ని వర్గాల వారూ ప్రచారంలో పాల్గొంటున్నారని కవిత తెలిపారు. ప్రతి ఒక్కరు సిస్టర్ 4 ఛేంజ్ కార్యక్రమంలో పాల్గొనాలని, ఇందుకోసం తమ పేర్లను నమోదు చేసుకోవాలని కవిత సూచించారు. ద్విచక్ర వాహనాలు నడిపే తమ సోదరీమణులకు సోదరులు హెల్మెట్‌ను బహుకరించడం మరవకూడదన్నారు. ఈ కార్యక్రమంలో నిజామాబాద్ అర్బన్, రూరల్ ఎమ్మెల్యే బిగాల గణేష్ గుప్తా, బాజిరెడ్డి గోవర్ధన్, బోధన్, ఆర్మూర్, కోరుట్ల ఎమ్మెల్యే షికిల్ అమిర్,ఆశన్నగారి జీవన్ రెడ్డి, కె. విద్యాసాగర్ రావు, జగిత్యాల నియోజక వర్గం టిఆర్ఎస్ ఇంఛార్జీ డాక్టర్ సంజయ్‌కుమార్ పాల్గొన్నారు.

రాష్ట్రపతికి అభినందనలు : కొత్తగా రాష్ట్రపతిగా ఎన్నికయిన రామ్‌నాథ్ కోవింద్‌కి ఎంపి కవిత ఆధ్వర్యంలో నిజామాబాద్ పార్లమెంట్ నియోజక పరిధిలోని శాసనసభ్యులు శుభాకాంక్షలు తెలిపారు. ఎంపి కవితతో వెంట నిజామాబాద్ అర్బన్, రూరల్ ఎమ్మెల్యేలు బిగాల గణేష్ గుప్తా , బాజిరెడ్డి గోవర్ధన్, ఆర్మూర్, కోరుట్ల , బోధన్ ఎమ్మెల్యే ఆశాన్నగారి జీవన్ రెడ్డి, కె. విద్యాసాగర్ రావు, షకిల్ అమీర్‌లతో పాటు జగిత్యాల నియోజకవర్గం టిఆర్ఎస్ డాక్టర్ సంజయ్ కుమార్ ఉన్నారు.

జగిత్యాలకు బైపాస్ రోడ్లు

మన తెలంగాణ/ న్యూఢిల్లీ : జగిత్యాల జిల్లా కేంద్రం చుట్టూ బైపాస్ రోడ్లు వేయాలని నిజామాబాద్ ఎంపి కవితా కేంద్ర రోడ్లు, హైవేస్, షిప్పింగ్ మంత్రి నితిన్ గడ్కరీని కోరారు. శుక్రవారం నిజామాబాద్ పార్లమెంట్ పరిధిలోని ఎమ్మెల్యేలతో కలసి ఆమె నితిన్ గడ్కరీని కలిశారు. వేగంగా అభివృద్ధి చెందుతున్న జగిత్యాల టౌన్‌కు ధర్మపురి, కరీంనగర్, కోరుట్ల మెట్‌పల్లి నుండి వచ్చే వాహనాలు టౌన్‌లో ట్రాఫిక్ సమస్యకు కారణం అవుతున్నాయని కవిత మంత్రి గడ్కరీకి వివరించారు. ధర్మపురి నుండి వచ్చే వాహనాల కోసం చల్ గల్ పోలాస వరకు బైపాస్ రోడ్డు నిర్మించాలని కేంద్రమంత్రిని కోరారు. అలాగే చల్‌గల్, అంతర్గామ్ మీదుగా దరూర్ లేదా రాజారామ్ వరకు నిజామాబాద్ కరీంనగర్ రోడ్‌ను కలిపేలా మరో బైపాస్ రోడ్ వేయాలని కూడా కోరారు. జాతీయ రహదారి 563 జాతీయ రహదారి 63ని కలిపేలా దరూర్, నర్సింగపూర్ మీదుగా పోలాస వరకు బైపాస్ రోడ్ వేయాలని ఎంపి కవిత నితిన్ గడ్కరీని కోరారు. ఈ మూడు బైపాస్‌లపై త్వరగా నిర్ణయం తీసుకోవాలని కేంద్ర మంత్రిని కోరినట్లు కవిత వెల్లడించారు. అలాగే ఆర్మూర్ –జగిత్యాల– రామగుండం జాతీయ రహదారిని నాలుగు లైన్లకు విస్తరించాలని కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీకి ఎంపి కవిత విజ్ఞప్తి చేశారు.

ముగ్గురు భారతీయులకు కీలక పదవులు

వాషింగ్టన్: భారత సంతతికి చెందిన ముగ్గురిని అమెరికా ప్రభుత్వంలో కీలక స్థానాల్లో నియమిస్తూ సెనేట్ ఏకగ్రీవంగా ధ్రువీకరించింది. ఫెడరల్ ఎనర్జీ రెగ్యులేటరీ కమిషన్ సభ్యుడుగా నీల్ ఛటర్జీ, ట్రంప్ పాలనా యంత్రాంగంలో ఇంటెలెక్చువల్ ప్రాపర్టీ ఎన్‌ఫోర్స్‌మెంట్ సమన్వయ కర్తగా విశాల్ అమిన్ నియమితులయ్యారు. పెరూలో అమెరికా రాయబారిగా కృష్ణా ఉర్సు పేరును ఖరారు చేసినట్లు సెనేట్ ధ్రువీకరించింది. స్పెయిన్‌లోని అమెరికా రాయబార కార్యాలయానికి కృష్ణా ఉర్సు ప్రస్తుతం కార్యనిర్వాహకుడుగా పని చేస్తున్నారు. 1986 నుంచి ఫారిన్ సర్వీస్ అధికారిగా కెరీర్ ప్రారంభించిన కృష్ణా ఉర్సు, నిక్కీ హాలే తర్వాత రాయబారిగా నియమితులైన రెండో భారతీయుడుగా రికార్డ్ సృష్టించారు.

క్యాన్సర్ రోగులకు టోకరా : ఇద్దరు నైజీరియన్ల అరెస్టు



మన తెలంగాణ/హైదరాబాద్ సిటీబ్యూరో: సైబర్ నేరగాళ్లు చివరకు క్యానర్ రోగులను సైతం వదలలేదు. క్యానర్ వ్యాధి నయానికి ఆన్‌లైన్‌లో మందులు పంపిస్తామంటూ బాధితుల నుంచి అందిన కాడికి దోచుకుంటున్న ఓ ముఠా గుట్టును సిసిఎస్ పోలీసులు రట్టు చేశారు. ఈ ముఠాకు చెందిన ఇద్దరు నైజీరియన్లను సిసిఎస్ పోలీసులు శుక్రవారం అరెస్టు చేశారు. ఈ మేరకు సిసిఎస్ డిసిపి అవినాష్ మహంతి ఏర్పాటు చేసిన విలేకరు సమావేశంలో వివరాలు వెల్లడించారు. నైజీరియాకు చెందిన స్నెసోకీ అమోస్ విలియమ్స్, ఇబ్రహీమ్‌లు స్నేహితులు. వ్యాపారం వీసాపై న్యూ ఢిల్లీకి వచ్చిన వీరు 'జేబి కెమికల్స్ అండ్ ఫార్మస్యూటికల్స్ ప్రైవేట్ లిమిటెడ్' అనే పేరుతో ఇండియా మార్ట్ డాట్ కామ్ అనే వెబ్ సైట్‌లో ఓ సంస్థను రిజిష్టర్ చేశారు. అందులో క్యాన్సర్‌తో పాటు వివిధ దీర్ఘకాలిక వ్యాధులకు మందులు లభిస్తాయని ప్రకటన ఇచ్చారు. క్యాన్సర్‌కు సంబంధించిన మందులు బుక్ చేసుకున్న వారు ముందుగా 30 శాతం డబ్బులు ముందుగానే తాము సూచించిన బ్యాంకులో చెల్లించాలని షరతు విధించారు. దేశ వ్యాప్తంగా పలువురు బాధితులు వీరి షరతులకు లోబడి డబ్బులు చెల్లించారు. అయితే వారు అనుకున్నట్లు ఎలాంటి మందులు వారు పంపలేదు. దీంతో తాము మోసపోయామని బాధితులు గ్రహించారు. నైజీరియన్ల మోసాలకు ఢిల్లీకి చెందిన పార్సన్స్ గ్రోవర్, కరన్‌కుమార్‌లు కూడా చేతులు కలిపారు. ఈ క్రమంలోనే నగరానికి సందీప్ అనే మహిళకు చెందిన లిండా అనే చెన్నైకు చెందిన స్నేహితురాలు ఉంది. ఆమెకు అత్యవసరంగా క్యాన్సర్‌కు మందు కావాలని కోరింది. చెన్నైలో లభించడం లేదని, మరెక్కడైనా అందుబాటులో ఉంటే పంపించాలంటూ కోరింది. దాంతో సందీప్ ఇండియామార్ట్ డాట్ కామ్ అనే వెబ్‌సైట్‌లో సెర్చ్ చేసింది. 'జేబి కెమికల్ అండ్ ఫార్మస్యూటికల్ ప్రైవేట్ లిమిటెడ్'లో కాన్సర్‌కు సంబంధించి మందులు లభిస్తాయన్న సమాచారాన్ని ఉండడంతో నిందితులతో ఆమె ఫోన్‌లో సంప్రదించారు. మందులు ముంబాయిలో తయారవుతుందని కావాలంటే 30 శాతం అడ్వాన్స్‌గా ఆన్‌లైన్‌లో చెల్లిస్తే రాహుల్‌కుమార్ అనే ఏజెంట్ ద్వారా ముంబాయి నుంచి ఢిల్లీకి మందులు తీసుకువస్తామని నమ్మించారు. ఒక్కో బాటిల్‌కు రూ. 67,264 విలువ చేస్తుందని చెప్పారు. దీంతో సందీప్ 20 బాటిళ్లకోసం ఆన్‌లైన్‌లో రూ.4 లక్షలను ట్రాన్స్‌ఫర్ చేసింది. మిగతా డబ్బులు ఢిల్లీలో మందులు తీసుకునే సమయంలో చెల్లించాలని నిందితులు చెప్పారు. ఇది నిజమని నమ్మిన సందీప్ గత నెలలో విమానంలో ఢిల్లీ వెళ్లింది. మందుల కోసం అక్కడ ఐదు గంటలు వేచి చూసింది. ఎన్నిసార్లు ఫోన్లు చేసినా లాభం లేకపోవడంతో మోసపోయినట్లు బాధితురాలు గుర్తించింది. నగరానికి చెరుకున్న బాధితురాలు సిసిఎస్ సైబర్ క్రైమ్ పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. రంగంలోకి దిగిన ఎసిపి రఘువీర్ ఒక ప్రత్యేక బృందాన్ని ఢిల్లీకి పంపించడంతో నిందితులు దొరికారు.

యాజమాన్య కోటా భర్తీ లోపభూయిష్టం

మన తెలంగాణ / హైదరాబాద్ : తెలంగాణ రాష్ట్రంలోని అన్ ఎయిడెడ్ నాన్ మైనార్టీ వృత్తి విద్యాసంస్థల్లో యాజమాన్య కోటా భర్తీ లోపభూయిష్టంగా ఉందని పేర్కొంటూ హైకోర్టులో రిట్ దాఖలైంది.

ఇంజినీరింగ్ బి– కేటగిరీ సీట్లను మేనేజిమెంట్లే భర్తీ చేసుకునే సౌకర్యాన్ని జిఒ 13 ద్వారా 2014లో తెలంగాణ రాష్ట్రం ఇచ్చిందని పేర్కొంటూ హైదరాబాద్ లోని స్ట్రెథనింగ్ ఆఫ్ ప్రైవేట్ ఇన్‌టేటివ్ ఇన్ రూరల్ ఎడ్యుకేషన్ అసోసియేషన్ ప్రెసిడెంట్ లక్ష్మారెడ్డి దాఖలు చేసిన రిట్‌లో ప్రతి వాదులుగా తెలంగాణ ఉన్నత విద్యాశాఖ కార్యదర్శి , ఉన్నత విద్య కౌన్సెల్ కార్యదర్శి, జెఎన్‌టియు రిజిస్ట్రార్, సాంకేతిక విద్యాశాఖ కమిషనర్లను చేశారు. యాజమాన్యాలే నేరుగా సీట్లను భర్తీ చేసుకుంటున్నాయని, ఇందుకు ఎంసెట్ ర్యాంక్‌గానీ, విద్యార్థుల ప్రతిభగానీ వారి కి అవసరం లేకుండా డొనేషన్స్ ఇచ్చినవారినే వారికి ఇష్టమైన వారినే ఎంపిక చేస్తున్నారని రిట్‌లో పేర్కొన్నారు. డొనేషన్స్ తీసుకోరాదని సుప్రీంకోర్టు తీర్పు కు భిన్నంగా చేస్తున్నారని, జిఒను కొట్టేయాలని రిట్‌లో హైకోర్టును కోరారు.

మాకు వేతనాలు పెంచండి: సెలెక్టర్లు



ముంబయి: తమ వేతనాలను పెంచాలని భారత క్రికెట్ బోర్డు సెలెక్టర్లు డిమాండ్ చేస్తున్నారు. ఈ మేరకు బిసిసిఐ సెలెక్షన్ కమిటీ ఎంఎస్‌కె.ప్రసాద్ బోర్డు అధికారులకు లేఖ రాశాడు. క్రికెటర్లతో పాటు తమకు సమ ప్రాధాన్యత ఇవ్వాలని ప్రసాద్ కోరాడు. పెరిగిన ఖర్చుల నేపథ్యంలో తమకు ఇస్తున్న పారితోషికం సరిపోవడం లేదని ప్రసాద్ అన్నాడు. దీంతో తమకు కూడా వేతనాలను పెంచాలని కోరాడు. ప్రస్తుతం సీనియర్ సెలెక్షన్ కమిటీ సభ్యులకు సీజన్‌కు 60 లక్షల రూపాయల చొప్పున వేతనాలు అందిస్తున్నారు. అంతేగాక, జూనియర్ విభాగంలో సీజన్‌కు 40 లక్షల వంతున అందజేస్తున్నారు. అయితే ఇది తమకు సమ్మతం కాదని, పారితోషికాన్ని 50 శాతం పెంచాలని సెలెక్షన్ కమిటీ సభ్యులు కోరుతున్నారు. 2012 నుంచి తాము వేతనాలు పెంచాలని డిమాండ్ చేస్తున్న బోర్డు అధికారులు స్పందించడం లేదని ప్రసాద్ వాపోయాడు. ఇదిలావుండగా, సెలెక్టర్ల డిమాండ్‌కు బిసిసిఐ పాలక మండలి సానుకూలంగా స్పందించినట్టు సమాచారం. అయితే వారు కోరుతున్నట్టు 50 శాతం కాకుండా 30 శాతం వరకు వేతనాలను పెంచేందుకు బోర్డు అధికారులు అంగీకరించారని తెలిసిందే. త్వరలోనే దీనిపై బోర్డు అధికారికంగా ప్రకటన చేసే అవకాశం ఉంది.

లంక తడబాటు...



అశ్విన్, సాహా, జడేజా హాఫ్ సెంచరీలు, భారత్ 622/9 డిక్లేర్డ్, రెండో టెస్టులో కోహ్లి సేన పైచేయి

కొలంబో: శ్రీలంకతో జరుగుతున్న రెండో టెస్టులో భారత్ ఉచ్చు బిగిస్తోంది. భారత్ తొలి ఇన్నింగ్స్‌లో 9 వికెట్ల నష్టానికి 622 పరుగులు చేసి డిక్లేర్డ్ చేసింది. తర్వాత మొదటి ఇన్నింగ్స్ చేపట్టిన శ్రీలంక 50 పరుగులకే రెండు వికెట్లు కోల్పోయి కష్టాల్లో చిక్కుకుంది. రవిచంద్రన్ అశ్విన్ అద్భుత బౌలింగ్‌తో రెండు వికెట్లను పడగొట్టి లంకను కష్టాల్లోకి నెట్టాడు. శుక్రవారం రెండో రోజు ఆట ముగిసే సమయానికి కుశాల్ మెండిస్ 16, కెప్టెన్ దినేశ్ చండీమల్ 8 పరుగులతో క్రీజులో నిలిచారు. భారత్ తొలి ఇన్నింగ్స్ స్కోరును అందుకోవాలంటే లంక మరో 572 పరుగులు చేయాలి. పిచ్ స్పిన్‌కు అనుకూలిస్తుండడంతో లంకకు ఈ మ్యాచ్‌లోనూ కష్టాలు తప్పేలా లేవు.

ప్రారంభంలోనే...

భారత్ భారీ స్కోరుకు జవాబుగా బ్యాటింగ్ చేపట్టిన శ్రీలంకకు రెండో ఓవర్‌లోనే ఎదురు దెబ్బ తగిలింది. అశ్విన్ వేసిన ఈ ఓవర్‌లో లంక ఓపెనర్ ఉపుల్ తరంగ (0) ఖాతా తెరవకుండానే పెవిలియన్ చేరాడు. అయితే తర్వాత వచ్చిన కుశాల్ మెండిస్‌తో కలిసి మరో ఓపెనర్ దిముత్ కరుణరత్నె ఇన్నింగ్స్‌ను ముందుకు తీసుకెళ్లాడు. ఇద్దరు భారత బౌలర్లను సమర్థంగా ఎదుర్కొంటూ ఇన్నింగ్స్‌ను కుదుట పరిచేందుకు ప్రయత్నించారు. అయితే వీరి పోరాటం ఎక్కువ సేపు కొనసాగలేదు. 45 బంతుల్లో రెండు ఫోర్లతో 25 పరుగులు చేసిన ఓపెనర్ కరుణరత్నెను అశ్విన్ ఔట్ చేశాడు. దీంతో లంక 33 పరుగులకే ఓపెనర్ల వికెట్లను కోల్పోయింది. ఈ దశలో కెప్టెన్ చండీమల్, కుశాల్ మెండిస్ మరో వికెట్ కోల్పోకుండా రెండో రోజు ఆటను ముగించారు. భారత బౌలర్లలో అశ్విన్ 38 పరుగులకు రెండు వికెట్లు పడగొట్టాడు.

అశ్విన్, సాహా జోరు...

అంతకుముందు 344/3 ఓవర్‌నైట్ స్కోరుతో బ్యాటింగ్ చేపట్టిన భారత్‌కు ప్రారంభంలోనే ఎదురు దెబ్బ తగిలింది. చతేశ్వర్ పుజారా ఓవర్‌నైట్ స్కోరుకు మరో ఐదు పరుగులు మాత్రమే జోడించి పెవిలియన్ చేరాడు. అద్భుత ఇన్నింగ్స్ ఆడిన పుజారా 232 బంతుల్లో 11 ఫోర్లు, సిక్సర్‌తో 133 పరుగులు చేసి కరుణరత్నె బౌలింగ్‌లో ఔటయ్యాడు. దీంతో 217 పరుగుల రెండో వికెట్ భాగస్వామ్యానికి తెరపడింది. తర్వాత వచ్చిన రవిచంద్రన్ అశ్విన్‌తో కలిసి మరో ఓవర్‌నైట్ బ్యాట్స్‌మన్ అజింక్య రహానె జోరు కొనసాగించాడు. అయితే ఇది ఎక్కువ సేపు కొనసాగలేదు. 222 బంతుల్లో 14 బౌండరీలతో 132 పరుగులు చేసి పుష్పకుమార బౌలింగ్‌లో స్టంపౌట్ అయ్యాడు. అప్పటికి భారత స్కోరు ఐదు వికెట్లకు 413 పరుగులు. ఈ దశలో ఇన్నింగ్స్‌ను ముందుకు తీసుకెళ్లే బాధ్యతను అశ్విన్, వికెట్ కీపర్ వృద్ధిమాన్ సాహా తమపై వేసుకున్నారు. ఇద్దరు లంక బౌలర్లను దీటుగా ఎదుర్కొంటూ ముందుకు సాగారు. ఒకవైపు వికెట్‌ను కాపాడుకుంటూనే చెత్త బంతులను బౌండరీలకు తరలిస్తూ స్కోరు వేగం తగ్గకుండా చూశారు. వీరిని ఔట్ చేసేందుకు లంక కెప్టెన్ తరచు బౌలర్లను మార్చినా ఫలితం లేకుండా పోయింది. ఈ క్రమంలో అశ్విన్ అరుదైన రికార్డును తన పేరిట లిఖించుకున్నాడు. టెస్టుల్లో రెండు పరుగుల మైలురాయిని అందుకున్నాడు. అంతేగాక, రెండు వేల పరుగులు, 275కి పైగా వికెట్లు తీసిన ఏకైక క్రికెటర్‌గా నిలిచాడు. కీలక ఇన్నింగ్స్ ఆడిన 92 బంతుల్లో ఐదు ఫోర్లు, సిక్స్‌తో 54 పరుగులు చేసి రంగనా హెరాత్ వేసిన చక్కని బంతికి క్లీన్‌బౌల్డ్ అయ్యాడు. తర్వాత వచ్చిన ఆల్‌రౌండర్ హార్దిక్ పాండ్యా వేగంగా 20 పరుగులు చేసి ఔటయ్యాడు. ఈ వికెట్ పుష్పకుమార ఖాతాలోకి వెళ్లింది.

జడేజా మెరుపులు...

పాండ్యా ఔటైనా రవీంద్ర జడేజాతో కలిసి సాహా పోరాటం కొనసాగించాడు. ఇద్దరు లంక బౌలర్లను దీటుగా ఎదుర్కొంటూ మరో కీలక భాగస్వామ్యం నెలకొల్పారు. వీరిని ఔట్ చేసేందుకు లంక బౌలర్లు చేసిన ప్రయత్నాలు ఫలించలేదు. అద్భుత బ్యాటింగ్‌ను కనబరిచిన సాహా 4ఫోర్లు, ఒక సిక్సర్‌తో 67 పరుగులు చేసి హెరాత్ బౌలింగ్‌లో ఔటయ్యాడు. ఈ క్రమంలో 8వ వికెట్‌కు 72 పరుగుల కీలక భాగస్వామ్యాన్ని నమోదు చేశాడు. మరోవైపు మహ్మద్ షమి రెండు సిక్సర్లు, ఒక ఫోర్‌తో 8బంతుల్లోనే 19 పరుగులు చేసి ఔటయ్యాడు. ధాటిగా ఆడిన రవీంద్ర జడేజా 85 బంతుల్లో 3సిక్సర్లు, మరో నాలుగు ఫోర్లతో 70 పరుగులు చేసి అజేయంగా నిలిచాడు. ఉమేశ్ యాదవ్ 8 పరుగులతో నాటౌట్‌గా ఉన్నాడు. కాగా, భారత స్కోరు 158 ఓవర్లలో 9 వికెట్లకు 622 పరుగుల వద్ద ఉన్నప్పుడూ భారత కెప్టెన్ కోహ్లి ఇన్నింగ్స్‌ను డిక్లేర్డ్ చేశాడు. లంక బౌలర్లలో రంగనా హెరాత్ నాలుగు, పుష్పకుమార రెండు వికెట్లను పడగొట్టారు.

స్కోరు బోర్డు



భారత్ మొదటి ఇన్నింగ్స్: శిఖర్ ధావన్ ఎల్బీ–పెరీరా 35, రాహుల్ రనౌట్ 57, చతేశ్వర్ పుజారా ఎల్బీ–బి కరుణరత్నె 133, విరాట్ కోహ్లి (సి) మాథ్యూస్ (బి) రంగనా హెరాత్ 13, అజింక్య రహానె (స్టంపౌట్) డిక్వెల్లా (బి) పుష్పకుమార 132, రవిచంద్రన్ అశ్విన్ (బి) హెరాత్ 54, వృద్ధిమాన్ సాహా (స్టంపౌట్) డిక్వెల్లా (బి) హెరాత్ 67, హార్దిక్ పాండ్యా (సి) మాథ్యూస్ (బి) పుష్పకుమార 20, రవీం ద్ర జడేజా నాటౌట్ 70, మహ్మద్ షమి (సి) తరంగ (బి) హెరాత్ 19, ఉమేద్ యాదవ్ నాటౌట్ 8, ఎక్స్‌ట్రాలు 14, మొత్తం 158 ఓవర్లలో 622/9 డిక్లేర్డ్.

బౌలింగ్: ఫెర్నాండో 17.4–2–63–0, రంగనా హెరాత్ 42–7– 154–4, కరుణరత్నె 8–0–31–1, పెరీరా 40–3–147–1, పుష్పకుమార 38.2–2–156–2, డిసిల్వా 12–0–59–0.

శ్రీలంక మొదటి ఇన్నింగ్స్: దిముత్ కరుణరత్నె (సి) రహానె (బి) రవిచంద్రన్ అశ్విన్ 25, ఉపుల్ తరంగ (సి) రాహుల్ (బి) అశ్విన్ 0, కుశాల్ మెండిస్ బ్యాటింగ్ 16, దినేశ్ చండీమల్ బ్యాటింగ్ 8, ఎక్స్‌ట్రాలు 1, మొత్తం 20 ఓవర్లలో 50/2.

బౌలింగ్: మహ్మద్ షమి 3–1–7–0, రవిచంద్రన్ అశ్విన్ 10–2–38–2, రవీంద్ర జడేజా 7–4–4–0.



అశ్విన్ ఖాతాలో మరో రికార్డు

కొలంబో: భారత స్టార్ రవిచంద్రన్ అశ్విన్ మరో రికార్డును నెలకొల్పాడు. శ్రీలంకతో జరుగుతున్న రెండో టెస్టు సందర్భంగా అశ్విన్ టెస్ట్ కెరీర్‌లో మరో మైలురాయిని అందుకున్నాడు. టెస్టుల్లో రెండు వేల పరుగులను, 250కి పైగా వికెట్లను తీసిన ఆల్‌రౌండర్ల జాబితాలో చోటు సంపాదించాడు. శుక్రవారం భారత్ తొలి ఇన్నింగ్స్‌లో 54 పరుగులు చేసిన అశ్విన్ టెస్ట్‌ల్లో రెండు వేల పరుగుల మైలురాయిని అందుకున్నాడు. అత్యంత వేగంగా రెండు వేల పరుగులు, 250 వికెట్లు తీసిన ఆల్‌రౌండర్లలో అశ్విన్ నాలుగో స్థానాన్ని దక్కించుకున్నాడు. అయితే 2వేల పరుగులు, 275కి పైగా వికెట్లు తీసిన వారిలో అశ్విన్ మొదటి స్థానంలో నిలిచాడు. మరే క్రికెటర్ కూడా ఇంత వేగంగా ఈ ఫీట్‌ను సాధించలేదు. కాగా, ప్రపంచ టెస్ట్ క్రికెట్‌లో ఇయాన్ బోథమ్ (ఇంగ్లాండ్), ఇమ్రాన్ ఖాన్ (పాకిస్థాన్), కపిల్‌దేవ్ (భారత్)లు మాత్రమే అశ్విన్ కంటే వేగంగా టెస్ట్‌ల్లో రెండు వేల పరుగులను పూర్తి చేసిన ఆల్‌రౌండర్లుగా నిలిచారు. కాగా, భారత్ తరపున ఇప్పటివరకు కపిల్‌దేవ్, అనిల్ కుంబ్లే, హర్భజన్ సింగ్‌లు మాత్రమే టెస్ట్‌ల్లో రెండు వేల పరుగులు, 250కి పైగా వికెట్లు సాధించారు. కాగా, ఇప్పటివరకు 51 టెస్ట్‌లు ఆడిన అశ్విన్ 2004 పరుగులను సాధించాడు. అంతేగాక, అత్యంత వేగంగా 281 వికెట్లను కూడా పడగొట్టాడు.

కోహ్లి ప్రోత్సాహం మరువలేనిది...



కొలంబో: గాయం వల్ల చాలా కాలం క్రికెట్‌కు దూరమై ఇబ్బందికర పరిస్థితులను ఎదుర్కొంటున్న తనకు కెప్టెన్ విరాట్ కోహ్లి అండగా నిలిచాడని భారత స్టార్ ఓపెనర్ కెఎల్.రాహుల్ అన్నాడు. అతని ప్రోత్సాహం వల్లే తనలో ఆత్మవిశ్వాసం రెట్టింపు అయ్యిందన్నాడు. కష్ట కాలంలో కోహ్లితో సహా సహచర ఆటగాళ్లందరూ తనకు అండగా నిలిచారన్నాడు. వారి ప్రోత్సాహం ఎప్పటికీ మరచిపోలేనిదని రాహుల్ అన్నాడు. గాయం వల్ల ఆటకు దూరమై తాను ఎంతో మనో వేదనకు గురయ్యానని తెలిపాడు. ఈ సమయంలో తనలో ఆత్మవిశ్వాసం సన్నగిలిందన్నాడు. అయితే తన మిత్రుడు, భారత కెప్టెన్ కోహ్లి స్ఫూర్తిదాయక మెసేజ్‌లతో తనలో ధైర్యాన్ని నింపేవాడన్నాడు. తన కోసం జట్టంతా ఎదురు చూస్తుందని, త్వరలోనే కోలుకుని జట్టులో చేరాలని సూచించే వాడన్నాడు. అతనిచ్చిన ధైర్యంతో తాను శస్త్ర చికిత్స తర్వాత త్వరలోనే పూర్తి ఆరోగ్యాన్ని సంతరించుకున్నానని రాహుల్ అన్నాడు. కాగా, చాలా కాలం తర్వాత ఆడిన తొలి మ్యాచ్‌లోనే అర్ధ సెంచరీ సాధించడం చాలా ఆనందంగా ఉందన్నాడు.

1	టెస్ట్‌ల్లో వేగంగా 2వేల పరుగులు, 281 వికెట్లు తీసిన ఏకైక ఆల్‌రౌండర్ అశ్విన్
4	ఈ మ్యాచ్‌లో భారత ఆటగాళ్లు సాధించి అర్ధ సెంచరీలు
2004	అశ్విన్ టెస్ట్ కెరీర్‌లో సాధించిన పరుగులు
622	లంక గడ్డపై భారత్‌కు రెండో అత్యధిక స్కోరు
217	నాలుగో వికెట్‌కు రహానె, పుజారాలు జోడించిన పరుగులు
4000	టెస్ట్‌ల్లో పుజారా సాధించిన పరుగులు

ముగిసిన భారత్ పోరాటం

క్వార్టర్స్‌లోనే ప్రణయ్, సౌరభ్ ఓటమి



ఆక్లాండ్: న్యూజిలాండ్ ఓపెన్ గ్రాండ్‌ప్రి బ్యాడ్మింటన్ టోర్నమెంట్‌లో భారత పోరాటం ముగిసింది. శుక్రవారం జరిగిన పురుషుల సింగిల్స్ క్వార్టర్ ఫైనల్ పోటీల్లో భారత ఆటగాళ్లు హెచ్.ఎస్.ప్రణయ్, సౌరభ్ వర్మలు పరాజయం పాలయ్యారు. దీంతో భారత ఆటగాళ్లందరూ టైటిల్ పోరు నుంచి నిష్క్రమించారు. ఇప్పటికే పారుపల్లి కశ్యప్, అజయ్ జయరాం, సిరిల్ వర్మలు టోర్నీ నుంచి వైదొలిగిన విషయం తెలిసిందే. తాజాగా వీరి సరసన ప్రణయ్, సౌరభ్‌లు కూడా చేరారు. శుక్రవారం జరిగిన క్వార్టర్ ఫైనల్లో నాలుగో సీడ్ ప్రణయ్ 21–10, 20–22, 21–23 తేడాతో పదకొండో సీడ్ లిన్ యు సీన్ (చైనీస్ తైపి) చేతిలో పరాజయం పాలయ్యాడు. టోర్నీ ఫేవరెట్‌లలో ఒకడిగా పరిగణించిన ప్రణయ్ ర్యాంకింగ్స్‌లో తనకంటే తక్కువ స్థానంలో ఉన్న ఆటగాడి చేతిలో ఓటమి పాలై నిరాశ పరిచాడు. తొలి సెట్‌ను సునాయాసంగా గెలుచుకున్న ప్రణయ్ తర్వాత పట్టును కోల్పోయాడు. వరుసగా రెండు సెట్లలో ఓటమి పాలై టోర్నీ నుంచి వైదొలిగాడు. అసాధారణ పోరాట పటిమను కనబరిచిన లిన్ సంచలన విజయంతో సెమీస్‌కు దూసుకెళ్లాడు. మరో పోటీలో సౌరభ్ వర్మ పరాజయం చవిచూశాడు. ఏకపక్షంగా సాగిన క్వార్టర్ ఫైనల్లో హాంకాంగ్ ఆటగాడు లీ చ్యూక్ 21–16, 21–19 తేడాతో సౌరభ్‌ను ఓడించాడు. ప్రారంభం నుంచే లీ ఆధిపత్యం చెలాయించాడు. అయితే రెండో గేమ్‌లో భారత ఆటగాడు సౌరభ్ ప్రత్యర్థికి గట్టి పోటీ ఇచ్చాడు. అయితే చివరి వరకు నిలకడగా ఆడిన లీ గేమ్‌ను గెలిచి సెమీస్‌కు చేరుకున్నాడు.



క్వార్టర్స్ ఫైనల్లో బాంబ్రీ

వాషింగ్టన్ డిసి: భారత ఆటగాడు యూకీ బాంబ్రీ ప్రతిష్ఠాత్మకమైన ఎటిపి వరల్డ్ టూర్ టెన్నిస్ టోర్నమెంట్‌లో క్వార్టర్ ఫైనల్‌కు చేరుకున్నాడు. ప్రిక్వార్టర్ ఫైనల్లో భారత సంచలనం బాంబ్రీ 6–7, 6–3, 6–1 తేడాతో అర్జెంటీనా ఆటగాడు గ్యూడో పెల్లాపై విజ యం సాధించాడు. తొలి సెట్‌లో ఓటమి పాలైన బాంబ్రీ తర్వాత వరుసగా రెండింటిలో గెలిచి క్వార్టర్ ఫైనల్‌కు చేరుకున్నాడు. ప్రారంభం నుంచే ఇద్దరు నువ్వానేనా అన్నట్టు తలపడ్డారు. ఇద్దరు కూడా చెలరేగి ఆడడంతో పోరు హోరాహోరీగా సాగింది. తొలి సెట్‌లో ఓడినా బాంబ్రీ పట్టు సడలించలేదు. తన మార్క్ షాట్లతో చెలరేగి ఆడి వరుసగా రెండు సెట్లను దక్కించుకున్నాగు. ర్యాంకింగ్స్‌లో తనకంటే ఎంతో మెరుగైన స్థానంలో ఉన్న పెల్లాను ఓడించి ముందంజ వేశాడు. అంతకుముందు ఫ్రాన్స్ ఆటగాడు, వరల్డ్ నంబర్ 22 గౌయెల్ మోన్‌ఫిల్స్‌పై బాంబ్రీ సంచలన విజయం సాధించిన తెలిసిందే.

బెంగళూరు ఉత్కంఠ గెలుపు



నాగ్‌పూర్: ప్రొ కబడ్డీ ఐదో సీజన్‌లో భాగంగా శుక్రవారం ఉత్కంఠభరితంగా సాగిన మ్యాచ్‌లో బెంగళూరు బుల్స్ 32–31 పాయింట్ల తేడాతో తమిళ్ తలైవాన్ జట్టును ఓడించింది. చివరి క్షణం వరకు నువ్వానేనా అన్నట్టు సాగిన ఉత్కంఠ మ్యాచ్‌లో బెంగళూరు ఉత్కంఠ విజయం సాధించింది. తలైవాన్, బుల్స్ జట్లు ప్రారంభం నుంచే సర్వం ఒడ్డి పోరాడాయి. దీంతో పోరు యుద్ధాన్ని తలపించింది. ఫలితం తరచూ చేతులు మారుతూ వచ్చింది. ఒక దశలో తమిళ్ తలైవాన్ విజయం సాధించడం ఖాయంగా కనిపించింది. అయితే పట్టు వదలకుండా పోరాడిన బెంగళూరు బుల్స్ మళ్లీ రేసులోకి వచ్చింది. రోహిత్ కుమార్ కీలక సమయంలో 11 పాయింట్లు సాధించి బుల్ విజయంలో కీలకపాత్ర పోషించాడు. మిగతా వారిలో ఆశీష్ ఆరు, మహిందర్ ఐదు పాయింట్లు సాధించి తమవంతు సహకారం అందించారు. కాగా, తమిళ్ తలైవాన్ జట్టులో ప్రపంజన్, అజయ్ ఆరేసి పాయింట్లు సాధించినా ఫలితం లేకుండా పోయింది. కీలక సమయంలో ఒత్తిడికి గురి కావడంతో తలైవాన్‌కు ఓటమి తప్పలేదు.

Printed and published by K Sreenivas Reddy, Printed at M/s. JAGATI PUBLICATIONS LIMITED, Sakshi Press, D-75 & C-52, Industrial Estate (APIE), Balanagar-500037, R.R.Dist., TELANGANA and Published from H.No.12-1-493/VA, Giriprasad Bhavan,Opp:Rajiv Swagruha Offices Complex, Bandlaguda Main Road, Nagole, R.R. Dist. and owned by M/s. Moveon Media Private Limited, **Editor: K. Sreenivas Reddy,** RNI Regn. No.TELTEL/2012/42234, Phone No/Fax:040-27655666, e-mail : editor@manatelangana.org.